

MAY 1951.

As. 8

ఆంధ్ర, నైజాం, మైసూరు ప్రాంతా
లలో దిగ్విజయయాత్ర
సాగిస్తూన్నది

★

డైరెక్టర్ : కె. వి. రెడ్డి
బి. యస్. సి. (ఆనర్స్)

★

నిర్వహణ :
నాగిరెడ్డి, చక్రపాణి



# విజయావారి: పాతాళ భైరవి



యన్. టి. రామారావు, మాలతి, రేలంగి, సూర్యకాంతం, సి. యస్. ఆర్. మొదలైన ప్రసిద్ధ తారాగణం పాల్గొన్నారు.

★

నేడే చూచి ఆనందించండి

★

## యీ సంచికలో

హేవలాక్ ఎల్లీస్, చౌడేశ్వరీదేవి, రాంషా, ఎ. సూర్యారావు, నీలకంఠం మొదలైనవారి రచనలూ, దాంపత్యం : వయోభేదం, వివాహాల్లో విచిత్రపద్ధతులూ, సందేహాలకు సమాధానాలూ మొదలైన వైజ్ఞానిక వ్యాసాలూ, అవీ, ఇవీ ఇంకా ఎన్నో—

## మీరంతా చదివితీరవలసిన ముఖ్యమైన మూడు పుస్తకాలు

**సిగ్గు :**

హేవలాక్ ఎల్లీస్‌ను అనుసరించి 'క్రాంతినాథ్' రచన. చరిత్రలో సిగ్గుపొందిన రూపాంతర వివరాలు విశదంగా చర్చింపబడినవి. వెల : ఎనిమిదణాలు.

**లైంగిక విజ్ఞానం :**

లైంగికవిజ్ఞాన ఆవశ్యకత, ఏది అజ్ఞానం ? ఏది విజ్ఞానం ? పిల్లల్లో లైంగిక వాంఛలు ఎలా ఉంటవి ? బహిష్టులో స్త్రీకి విశ్రాంతి కావాలా ? నగ్నత్వం కళేనా ? అది నిత్యజీవితానికి ఎంతవరకూ అవసరం ? మొదలైన లక్షప్రశ్నలకు ఇందులో జవాబులున్నవి.—హేవలాక్ ఎల్లీస్‌ను అనుసరించి 'క్రాంతినాథ్' రచన

88 పేజీలు: వెల : ఒక రూపాయి.

**గర్భనిరోధం :**

అధునాతన ప్రపంచంలో అతి ముఖ్యసమస్య చర్చించబడింది. గర్భనిరోధ మార్గాలలో అత్యుత్తమమైనది తెలుసుకొని, అనుసరించి దాంపత్యజీవితాన్ని రుచిచూచేందుకు అనుకూలంగా ఎన్నో బొమ్మలతో వివరంగా రచింపబడింది.

వెల : ఎనిమిదణాలు.

ప్రతి పుస్తకానికి పోస్టేజి ప్రత్యేకం. రూ 2/- మనియార్డరుద్వారా పంపేవారికి పై మూడుపుస్తకాలూ రిజిష్టర్డ్ పోస్టులో పంపబడుతవి. ఏజంట్లకు 25% కమీషన్.

వివరాలకు : అభిసారిక కార్యాలయం, తెనాలి.

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాస పత్రిక.

... సంపాదకుడు: ధనికొండ హనుమంతరావు ...

సంపుటి 2 | మే, 1951 | సంచిక 11


దేశంలో ఒకరకం జనాభావుంది. వారి మెదళ్ళు మూఢనమ్మకాలతో నిండి వున్నవి. ఆ నమ్మకాల్ని గూర్చి వారెప్పుడు లోతుగా ఆలోచించరు; ఆలోచించటమే అపచారమని వారినమ్మకం; అంతకన్న—ఆలోచిస్తే, మారవలసి వొస్తుందేమోనని వారి భయం!

అలాటి వ్యక్తులకు 'సెక్స్' అంటేనే కంపరం. సెక్స్‌ను గూర్చి వారికి పరిపూర్ణ విజ్ఞానం ఉండికాదు. కేవలం అజ్ఞానమే వార్ని ఆవరించి వుంది. వారు కనీసం సెక్స్ సమస్యలు ఎలా ఉంటవి, వాటికి విరుగుడు యేమిటనే విషయమన్నా గమనించరు; వారికి సంబంధించిన సమస్యలేగాక, సమాజానికి సంబంధించిన సమస్యలు కూడా వారికి పట్టవు. వారసలు ఆ విషయాల్ని వినేందుకు కూడా నిరాకరిస్తారు.

యీ రకం జనాభాను మేము కోరేది ఒక్కటే—ఒక్కవారి పత్రిక చదవండి. ఏ వ్యాసం, లేదా ఏ రచన లేదా ఏ రచనాభాగం తమకు ద్వేషాన్ని రేకెత్తించేదిగా, నిరుపయోగ మైనదిగా వున్నదో మాకు తెలియపరచండి. శాస్త్రీయ దృక్పథానికి దూరమైన విషయం ఎక్కడైనా కనిపిస్తే, మీరు స్వేచ్ఛగా విమర్శించవొచ్చు. అంతేగాని, సెక్స్ అంటేనే భయపడితే ప్రయోజనం లేదు; ఎందుకంటే భయం సమస్యను నిర్మూలించదు కనుక! యీ విషయాన్ని మీరు మనసులో ఉంచుకుంటే ఉభయులమూ సామాజికంగా సేవచేసిన వారమౌతాము.

# సందేహాలకు... సమాధానాలు.

**1. ఏడు సంవత్సరాల క్రితం— గనేరియా వ్యాధితో 11 నెలలు బాధ పడి, చికిత్స పొందాను. ఈ 11 నెలల్లోనే నేను గర్భం ధరించాను కాని, రెండో నెలలోనే గర్భస్రావంకింద పరిణమించింది. తిరిగి ఆనాటినుంచీ గర్భం రాలేదు. నా జీవితంలో మరి సంతానాన్ని పొందే అవకాశంవున్నదా?**

గర్భస్రావాన్ని పొందేందుకు గనేరియా వ్యాధి ఒక్కటే కారణమైవుంటుందని చెప్పలేము. ఆ వ్యాధితో బాధపడుతున్నప్పటికీ చాలామంది స్త్రీలు ఆరోగ్యకరమైన శిశువుల్ని కనటం కద్దు. సాధ్యమైనంత వరకూ తల్లి తాలూకు సుఖవ్యాధులు పిండానికి సోకకుండా ప్రకృతి ఎంతో కాపాడుతుంది. పిండాన్ని ఆవరించిన మాయ (Plecenta) ఇందుకు ఎంతో సహాయపడుతుంది. మరొక విశేష మేమంటే తల్లి శరీరంలోని రక్తం పిండంలోకి ప్రవహించదు. మాయవరకూ ప్రవహించటం, అక్కడ ఆ రక్తంలోని ఆహార పదార్థాల్ని మాత్రమే మాయ స్వీకరించి పిండాన్ని పెంచడం జరుగుతుంది. పోతే కాన్పు సమయంలోమాత్రం గనేరియా తాలూకు సూక్ష్మాతిసూక్ష్మమైన క్రిములు బిడ్డ కంటికి తగిలి వాణ్ణి అంధుణ్ణి చేయటం జరుగుతుంది. లోకంలోని గుడ్డివాళ్ళల్లో చాలామంది యీ విధంగా తయారైనవారే! ఇది కారణంగా జాగ్రత కోసమై, బిడ్డ భూమిమీద పడగానే, డాక్టర్ వాడి కళ్ళల్లో మందు వేస్తాడు. కొన్ని దేశాల్లో యీ కంట్లో మందువేయటం, చట్టరూపాన కూడా వుంది.

గర్భస్రావం జరిగేందుకు అనేక కారణాలు ఉంటవి. అదేవిధంగా మూఢ గర్భాన్ని ధరించేందుక్కూడా ఎన్నో కారణాలుంటవి. కొన్ని సందర్భాలలో ఫాలోపియన్ ట్యూబ్స్ (అండవాహికలు) వాపువల్ల మూసుకొని పోవటం అందువల్ల ఓవరీ విడుదలచేసిన గుడ్డు సరాసరిగా గర్భకోశంలోకి వొచ్చేందుకు అవకాశం లేకుండటంవల్ల, గర్భస్రావంగా పరిణమించటం జరుగుతుంది. గనేరియా వ్యాధి

ఎంతో విపరీతంగా పెరగటం వల్ల ఇలాటివి సంభవించ వొచ్చుకాని, ఇది చాలా అరుదైన విషయమని కూడా చెప్పవొచ్చు.

పోతే సంతానాన్ని బడయగలగటమనే విషయాన్ని గూర్చి బాగా తెలిసిన డాక్టర్ పరీక్ష తర్వాతకాని చెప్పలేము. రూబిన్ టెస్ట్ (Rubin Test) జరిగినట్టయితే ప్రాణవాయువు (Oxygen), అండవాహికల్లోకి పంపబడినప్పుడు, వాహిక ఎక్కడైనా మూసుకొనిపోయిందేమోననే విషయం తేలుతుంది. ఒకవేళ వాహికలోలోపం లేకపోయినా, విడుదలయే గుడ్డులో లోపముండొచ్చు లేదా మీ భర్త తాలూకు వీర్యకణాలు తగినంత బలంగానూ, వాటిల్లో ఎక్కువభాగం చలనాన్ని ఎక్కువగా కలిగివుండటంమీదా ఆధారపడి ఉండొచ్చు. ఇలాగే ఇంకా అనేక కారణాలుండొచ్చు. డాక్టర్ పరీక్షతర్వాతకాని ఇదమిద్ధంగా తేలదు; అది తేలాకకాని చికిత్సావిధానం నిర్ణయించేందుకు వీల్లేదు.

2. ఏకారణంచేతనైనా స్త్రీ అండాశయాలు (Ovaries) తొలగించబడినట్లయితే, ఆమె దాంపత్యజీవితంలో కలిగే మార్పులేమిటి? ఆమెకు పూర్వంవలెనే కామవాంఛ వుంటుందా?

అండాశయాలు తొలగించితీరవలసిన పరిస్థితులే ఏర్పడటం చాలా అరుదైన విషయం. అండాశయాల్లో ఏ విషక్రిములో ప్రవేశించిన సందర్భంలో కూడా పూర్వంవలె, శస్త్రచికిత్సద్వారా వాటిని తొలగించవలసిన అవసరం రావటం అరుదు. యీనాడు లభ్యమయే అనేకమందులు ఆ విషక్రిముల్ని హతమార్చి, అండాశయాల్ని శిథిలమయే అవస్థనుంచి కాపాడగలిగే ఉన్నవి.

ఒకవేళ పైన చెప్పిన మందుమాకులకు అసాధ్యమైన పక్షంలో అండాశయాలు తొలగించబడినప్పుడుకూడా ఆమె కామవాంఛ కలిగేవుంటుంది; ఇక దాంపత్య జీవితంలో తృప్తినికూడా పొందగలుగుతుంది. స్త్రీ దాంపత్యంలో తృప్తిపడేందుకు రెండు ముఖ్య ప్రదేశాల్ని సూచించవొచ్చు; ఒకటి— మెదడులోని సెక్స్ కేంద్రం; ఇది మానసికమైనదేగాక శారీరకమైనదిగాకూడా చెప్పవొచ్చు. రెండు: క్లిటారిస్. ఈ రెంటికీ అండాశయాలు తొలగించబడటంవల్ల మార్పు రాదుకనుక ఆమె లైంగిక తృప్తిని పొందుతుంది.

కాని అండాశయాలు స్త్రీకి అతి ముఖ్యమైనవి. ఆమెకవి బలాన్నీ, కామోద్రేకాన్ని కలిగిస్తవి. ఆమె ఆరోగ్యాన్ని అవి ఎంతగానో కాపాడుతవి. ఒకవిధంగా ఆమెను ముసలితనం నుంచి చాలావరకు కాపాడేందుకు ఉపకరిస్తవి. ఓవరీలు విడుదల చేసే హార్మోనులు ఆమెకు దొరకనందువల్ల ఆమె ఆరోగ్యంలో మార్పురాక తప్పదు. కనుక ఓవరీలు తొలగించబడటానికి ముందుగా ఆమెను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయించటం డాక్టర్ విధి.

3. బాగా వయసు వచ్చిన వ్యక్తులు, నిద్రలో పక్క తడపటం ఎందుకు జరుగుతుంది? దాన్ని వొదిలించుకునే మార్గం ఏమిటి?


రయింతో గాఢనిద్రకు గురయే వ్యక్తులకే యీ అవస్థ వుంటుంది. యీ మధ్య ఇంగ్లండులోని రెండు పెద్ద వైద్యశాలల్లో నిద్రలో మూత్ర విసర్జన చేసే వ్యక్తుల మీద పరిశోధనలు జరిగినవి. ఆ రోగుల వయస్సులు 16 నుంచి 41 వరకూ వున్నవి. పక్క మీదకు జేరటం ఆలస్యంగా వారు గాఢనిద్రను పొందుతారు. సామాన్యంగా అలాటి నిద్రలో వారికి కలలు రావు. తెల్లవారుతుండగా వారి నిద్ర గాఢతర మౌతుంది. సామాన్యంగా నిద్రించే వ్యక్తి తెల్ల వారుతూండగా క్రమంగా మెలకువలోకి వొస్తాడు. పోతే గాఢనిద్రలో కొన్ని కొన్ని జ్ఞానేంద్రియాలు తక్కువగా పని చేస్తవి. అదేవిధంగా బ్లాడర్ నిండాక ఆ సంగతి మెదడుకు తెలియజేసే నరాలు సరిగా పనిచేయక పోవటంవల్ల యీ ఇబ్బంది ఏర్పడుతోంది.

ఇలాటి రోగుల మీద రాత్రిపూట **Amphetamine sulphate** అనే రసాయనిక పదార్థం వాడబడింది. అది వారి నిద్రకు భంగం కలిగించకుండా, పక్క తడుపుకోవటం జరక్కుండా కాపాడ గలుగుతుంది.

4. గత రెండు సంవత్సరాలుగా నా రొమ్ములు పెరగ నారంభించినవి. ఇది నేను గమనించక పోలేదు. క్రమంగా పెరగసాగి, ఇప్పుడు బాగా పెద్దవైనవి. దీంతోపాటు పిర్రలదగ్గరకూడా కొవ్వుజేర నారంభించింది. నాలో స్త్రీ లక్షణాలు ఎక్కువవుతూన్నవని నా నమ్మకం. నా పురుషత్వమే లోపించిందని అనుకుంటున్నాను, నా వయస్సు పాతిక సంవత్సరాలు. బరువు 160 పౌనులు. దేహపరిశ్రమ చేశాను; ఆహారాన్ని ఎంతో తగ్గించాను. ఐనప్పటికీ

మార్పులు రాలేదు. దీనికి కారణమేమిటి ? నేను దాంపత్య జీవితంలో ప్రవేశిస్తే, దాంపత్యం సుఖంగా వుంటుందా ? నా పరిస్థితికి సిగ్గుపడి కుంగిపోతున్నాను. నాకు పురుషలక్షణాలు వొచ్చేమార్గ మేదైనావుందా ?

మీ పరిస్థితిని Gynecomastia అంటారు. శరీరంలోని వివిధ గ్రంథులు ఎక్కువ తక్కువలతో పని చేయటం వల్ల శారీరకమైన మార్పులెన్నో సంభవిస్తుంటవి. పాలను విడుదల చేసే మమ్మరీ గ్రంథులు ఎక్కువగా పనిచేయటం వల్ల, రొమ్ములు పెరిగినవని చెప్పవొచ్చు. లేక ఎండోక్రైన్ గ్రంథుల్లో లోపం వుండటమైనా కావొచ్చు. యీ పక్క బొమ్మలో మీలాగే అవస్థపడేరోగి చూపబడ్డాడు.



మీరు పడ్డశ్రమవల్ల ఫలితం కలగలేదు. పోగా మిగిలింది రెండురకాల చికిత్సలు. ఒకటి_ఎండోక్రైన్ గ్రంథుల విషయంలో నిపుణునిచూడటం — రెండు శస్త్రచికిత్స, మొదటిది అంత ఉపయోగకరమైన చికిత్సగా చెప్పలేము. పోతే శస్త్రచికిత్స ద్వారా మమ్మరీగ్రంథులు తొలగించబడటం, రొమ్ములవద్ద పేరుకొన్న కొవ్వును తీసెయ్యటం జరుగుతుంది. ఒకో సందర్భంలో శస్త్రచికిత్స తాలూకు మచ్చలుకూడా కనిపించకుండా పోతవి.

పోతే మీరు మానసికంగా కుంగిపోతున్నారు. మీరు సిగ్గుపడనక్కర్లేదు. మమ్మరీగ్రంథులవల్ల మీ పురుషత్వంలో పెద్దమార్పురాదు; ఆమార్పల్లా మానసికమైంది. మీ దాంపత్యజీవితం సౌఖ్యమయమయేందుకు, మీ ప్రస్తుతపరిస్థితి ఏవిధంగానూ అడ్డంకి కాదు. శస్త్రచికిత్స పొందినట్లయితే, మరేవిధమైన ఇబ్బందీవుండదు.

★

# పతివ్రత



మూలం : శశికాంత్ అనువాదం : నీలకంఠం

మృత్యువనేది కేవలం ముసలి వాళ్ళని, ఎండి, జీర్ణించి, చిక్కిపోయిన శరీరాల్ని మాత్రమే తన వొడిలోకి తీసుకోదు. ఎంతో బలవంతులతో పాటు మంచి యవ్వనంలో వున్నవాళ్లు కూడా దానికి లోబడి వుండాల్సిందే. మృత్యువు పెదిమల తాలూకు ఛాయ ఎవరిమీదైతే, నవ్వుతూ పడుతుందో — అప్పుడు మిగిలిన నవ్వులన్నీ, నిరాశగా దాని వేపు ఎంతో దీనంగా చూస్తుంటయ్ !

మృత్యువును గురించి శాస్త్ర వేత్తలు మాత్రం ఆలోచించాల్సిన విషయమే గానీ— ఇంతవరకూ దీని విషయం ఎవరూ పట్టించుకోలేదు. అసలామెకు ఈ విషయాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరమే కలగలేదు.

రెండు రోజులనుంచి, విక్రముని ఆరోగ్యం కొద్దిగా చెడిపోయింది. ఆయన ఆ పక్కనే వున్న వూరినుంచి రాత్రి పూట తిరిగి వస్తున్నప్పుడు జలుబు చేసింది. దానితో పాటు వెంటనే దగ్గు పట్టుకుంది. ఆ దగ్గుతోనే అవసరమైన పని మీద ముకుందపురం వెళ్ళాల్సి వచ్చింది. సంపెద్దు బండిమీద నాలుగైదు గంటలు ప్రయాణం చేయాలి. బలంమీద ఆధారపడి బయలుదేరాడు. ఆ జలుబుకు తోడుగా యింకా రొంప పట్టుకుంది. ఇంతకీ జబ్బనేది అందరికీ వస్తుంది: నయమవుతుంది. కానీ విక్రముని మాత్రం ఆ జబ్బు లొంగదీసింది. గొంతులో కఫం అడ్డు పడింది, మాట పడిపోయింది. చూస్తూ — చూస్తుండగానే వూపిరాడ్డం కూడా ఆగిపోయింది.

పన్న నిశ్శబ్దంగా మృత్యువు తాలూకు నాటకాన్ని చూస్తూనే నిలుచుండిపోయింది. ఆమెకి గుండెలు పగిలిపోయాయ్ ! శవంమీద పడి భోరున ఏడ్చింది. ఊళ్ళోని ఆడవాళ్లంతా, పోగయి, పన్న ఏడుపులో భాగం పంచుకున్నారు. ఏడుపులూ — పెడబొబ్బలు వినడంతోనే మగవాళ్లంతా వచ్చారు. విక్రముడు పోయాడంటే వాళ్ళకి నమ్మకం కలగలేదు. నిన్ననేగా చూసింది. మంచి

పుష్టికల మనిషి ! పైగా వయసు కూడా ఏమంత ఎక్కువ కాదాయె !

శవం చుట్టూ — ఏడుస్తున్న స్త్రీల గుంపే ఎక్కువగా వుంది కానీ ఆ కంఠాలన్నిటికన్నా — ఎంతో దీనంగా వినిపిస్తున్న పన్న గొంతుక పెద్దదిగా — చుట్టూ నిలుచున్న వాళ్ల హృదయాల్నిండా అలముకుపోయింది.

పన్నకు వివాహమై అప్పటికి సరిగ్గా అయిదేళ్లయి వుంటుంది. ఇరవై వొక్క సంవత్సరానికే ఆమె జీవితం విధవగా మారి కూచుంది.

విక్రమునిశవాన్ని పాడెమీదకి చేర్చేందుకు నలుగురూ పట్టుకున్నప్పుడు—పన్న శవాన్ని గట్టిగా పట్టుకుని వదల్లేదు. పైగా తనూ భర్తతోపాటు చితిమీద కూర్చుని భస్మమవుతానని అంటూ— శవాన్ని ఒక్క అంగుళంకూడా కదలనివ్వలేదు. ఆ శవంతోపాటు తన జీవితాన్నికూడా కాల్చమని మొండిపట్టు పట్టింది.

గ్రామంలోని పెద్దలంతా — అమాయకురాలి, సుకుమార సౌందర్యాన్ని జాలిగా చూస్తూ నిలుచున్నారు.

"అమ్మాయీ ! ఇప్పుడితను వొట్టి మట్టిబొమ్మ మాత్రమేనమ్మా ! భగవంతుడు మీ ఇద్దరికీ ఇంతవరకే రాసి పెట్టాడు. అదృష్టం ముందు......అని అంటుంటే ఒక వృద్ధుడి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్! కొంచెంసేపు ఊరుకుని మళ్ళీ "అదృష్టాన్ని కన్నీళ్ళతో మార్చలేమమ్మా! ఈ మట్టిబొమ్మను యింట్లో వుంచుకుంటే-పాపం వస్తుంది. నువ్వు తప్పుకో!" అని అన్నాడు.

ఒక పొరుగింటి ముసలావిడ కూడా— "అమ్మాయీ! పోయిన విక్రముడు తిరిగి వస్తాడా-? భగవంతుడనేవానికికూడా న్యాయ ముందోలేదో తెలియదు. ఇంత చిన్నతనంలోనే ఇతనికేం చావు-? పెద్ద పెద్ద వాళ్ళంతా బ్రతికుండి ఈ [illegible] చూడాల్సి వచ్చింది. ఇతనికి బదులు భగవంతుడు నన్ను తీసుకొని వెళ్ళినట్లయితే బాగుండేది—"అని "లే అమ్మాయి లే... ఒక పక్కకి తప్పుకో—" అని అన్నది.

ఈ వూరడింపులకు పన్న మమత యింకా ఎక్కువైంది. ప్రపంచమంతా ఆమె కిప్పుడు కటిక చీకటి...! ఆమె మంగళ జ్యోతి ఆరిపోయింది. ఆరిపోయిన దీపం మాత్రం యిప్పుడామె ముందుంది. పన్న భర్తశవాన్ని కౌగలించుకుని "నేనుకూడా ఈయనతోనే సహగమనం చేస్తాను" అని అన్నది.

ఈ మాటవిని చిన్నా — పెద్దలంతా ఆశ్చర్యపోయారు.

"విక్రముడి ఆత్మకు శాంతి కావాలి అమ్మాయ్! నువ్వు సహగమనం చేసినా విక్రముడు తిరిగి రాడు" అని ఒక వృద్ధుడు అన్నాడు.

అయిదారుగురు స్త్రీలు కలిసి ఆమెను శవంనుంచి వేరుచేశారు.

* * *

పన్న భర్త చనిపోయి రెండేళ్ళు గడచినయ్! ఆమె ఆరోగ్యం మటుకు చాలా దిగజారిపోయింది. ఇప్పుడామె తన శృంగారాలన్నిటినీ వొదులుకుని ఊరుకుంది.

ఆడదాని సౌందర్యాన్ని గురించి లోకంలో ఎప్పుడూ చర్చ జరుగుతూనే

వుంటుంది. అదేవిధంగా—భర్త బ్రతికి ఉన్నంతకాలం పన్న గ్రామంలో అందంగలదని నిర్ణయించేందుకు యువకులకి కష్టమైపోయింది. ఆమె విషయం మాటల సందర్భంలో వచ్చినప్పుడు కొంతమంది ఆమె అందగత్తెనీ, మరికొంతమంది 'మల్ఖన్' చౌదరి కూతురు 'అంగూర్' అందగత్తెనీ, యింకా కొందరు 'పండిత నందలాల్' భార్య 'శివరాణి' అందగత్తెనీ అంటుండేవాళ్ళు...

ఈ రెండేళ్ళలో 'అంగూరు'కు వివాహమై అత్తవారింటికి వెళ్ళిపోయింది; 'శివరాణి'కి యిద్దరు బిడ్డలు పుట్టారు. ఆమె అందమంతా చల్లారి పోయింది.

అప్పుడు గత్యంతరం లేక యువకులంతా పన్ననే గ్రామములో 'అతి సుందరమైనదనీ గొప్ప అందగత్తె' అనీ అంటున్నారు.

పన్న భర్తతోపాటు సహగమనం చేస్తానన్న సంగతి యింకా ఎవరూ మర్చిపోలేదు. ఈ సంగతిని ఎంతో గొప్పగా వూరంతా అనుకునే వాళ్ళు. ఆమె కూడా పతివ్రతనని పించుకుందామనీ మాట పడకుండా బతుకుదామనీ ప్రయత్నిస్తూనే వుంది. కావాలంటే తన జాతివాడైన ఒక 'విదురుడి' యింట్లో ఆమెకి ఆశ్రయం దొరికేది! వాళ్ళ జాతిలో మారుమనువు లున్నయ్ ఆమె మీద ఎంతోమంది కన్ను వేశారు కూడా! ఒక్క విదురుడే కాదు — పెళ్ళికాని వాళ్ళు కూడా ఆమెను వివాహం చేసుకోవటం తమ భాగ్యమని భావించేందుకు తయారయారు కాని పన్న హృదయంలో మాత్రం ఈ విషయం మెదల లేదు.

ఒకనాడు ముసలి దొకతె తన అన్న కొడుకును పెళ్ళి చేసుకొమ్మని చెబుతూ "వాడికి కావాలంటే పెద్ద పెద్ద వాళ్ళే తమ పిల్లల్నిస్తామని కబుర్లు చేశారు. కాని వాడు నీమీద గంపెడాశతో వున్నాడు పన్నా! పర్వతంలాంటి నీ జీవితానికి ఒక మగవాడు నిజంగా అండగా వుండాలి సుమా!" అన్నది.

ఆ మాటలు తన భర్తని తన ముందే అవమాన పర్చినంత కోపంలోకి పన్నను లాక్కుపోయినయ్. "చూడమ్మా! ముగ్గురు పిల్లల్ని కని 'కన్నయ్య'ను వుంచుకున్న సుగుణ తల్లిని కాను. నాకు ఒక్క నలుసుకూడా లేకుంటే ఏం? భగవంతునికి అదే యిష్టమైంది. ఈ జానెడు కడుపుకోసం ఏదో ఒక పని దొరక్కుండా వుంటుందా! ఆడదంటే ఏమనుకున్నావమ్మా? భర్త చనిపోయాక ఆయన పేరు స్మరిస్తూ•జీవితాన్ని వెళ్ళ మార్చిందే ఆడది" అని అన్నది.

ఆ మాటల్లో ఎంతో నిగ్రహముంది. యింకేమన్నా అన్నట్లయితే పన్న తనని తిడుతుందని. "చూడమ్మా! ఏదో అన్నాను. ఆతరువాత నీయిష్టం. కానీ ఈ నాజూకు చేతులు ఏ పనేం చేస్తాయమ్మా!" అని అన్నది.

ఈ రకమైన మాటలు వినడం ఆమెకి కొత్త కాదు. ఇంకా ఎంతోమంది ఆడంగులు వదినా మరదళ్ళ వరుస కలిపి ఎన్నో అంటూండే వాళ్ళు. వాళ్ళందరికీ ఏదో ఒక విధంగా వ్యంగ్యంగా జవాబులు

చెపుతుండేది. ఈ విషయాన్ని గురించి బయట ఎంత కోపాన్ని ప్రదర్శించి, నిష్ఠూరంగా మాట్లాడినా వాళ్ళ మాటలకి హృదయంలో అప్పుడప్పుడు సంతోషం పొందేది! ఇంతమంది యువకులు ఆమెను కోరుతున్నారంటే ఇదంతా ఆమెకు పెద్ద గర్వకారణమై పోయింది.

ఆమెకు కావాలంటే యింతవరకూ పాతిక వివాహాలు చేసుకో గలదు. ఇద్దరు ముగ్గురు యువకులు తమ అభిప్రాయాలు విప్పి చెప్పినప్పుడు— ఆమె చెప్పిన జవాబుకు భయపడి ఆ సంగతి తమ స్నేహితులకు కూడా చెప్పలేక పోయారు.

పన్న తన అయిష్టాన్ని చెబుతున్నా— కోపంగా మాట్లాడుతున్నా — అప్పుడప్పుడూ హృదయంలో— ఆడది ఎంత సుఖంగా వున్నా మగవాడు లేనిదే ఆడదాని జీవితంలో నిజంగా సుఖంలేదు అని అనుకునేది. ఈ విషయం అనుకున్నప్పుడు రెండో పెళ్ళి చేసుకున్న విధవలంతా మంచిపనే చేశారనీ అనుకునేది. అటువంటప్పుడు ఆమెలో అణగారివున్న కోర్కెలు ఈ అయిదేండ్ల జీవితాన్ని ఏ విధంగా ఉపయోగించారో— నిజంగా అదే వాస్తవిక జీవితం— అని చెప్పేవి. అప్పుడప్పుడూ ఆమె ఆనందం మేలుకుని రోష్న రోషాన్ని ఝుళిపించేది.

విక్రముడు చనిపోయి నాలుగుసంవత్సరాలు దాటిపోయింది. పొరుగింటి లలితమొగుడు చనిపోయి ఆర్నెల్లు కాకముందే తిరిగి జగ్గూను వివాహం చేసుకుంది. గ్రామమంతా ఆమె విషయమే అనుకోవడం మొదలుపెట్టారు. పన్న భావికి వెళ్ళినప్పుడు, అక్కడే నీళ్ళు తోడుకుంటున్న చౌదరిగారి భార్య— "మూసావటమ్మా! పాపం. సంవత్సరమన్నా కాలేదు. అప్పుడే లలిత పెండ్లి కూతురైంది—" అని చెప్పినప్పుడు, ఆ సంగతి వింటేనే పాపంవస్తుందన్నట్లు చెవులూ — ముక్కూ మూసుకునేది. ఇంకా నలుగురైదుగురు పోగై, తమ బిందెలన్నీ — క్రిందపెట్టి చర్చల్లో మునిగి పోయేవాళ్ళు.

ఒకమ్మ "చూచారూ! మన పన్న వుందే—! అయిదు సంవత్సరాలు గడిచినయ్! జీవితంలో దుఃఖాల్ని, కష్టాల్ని, భరిస్తూ, ఎంతో విసిగిపోయింది. కానీ ఆఖరికి సరే అనికూడా అనలేదు. ప్రస్తుతం పన్నలాంటి పతివ్రతలు పుట్టడం అరుదు" అన్నది.

తననుగురించి పొగడేమాటలు వినడం పన్నకిది మొదటిసారి కాదు. తనను అంతా 'పతివ్రత' అని అంటుంటే, విని ఆమెహృదయం సంతోషించేది!

ఒకనాడు ఆవుకు పాలుతీసి, పాలు పెరట్లోని పుట్టిమీద పెట్టి, భోజనం చేస్తూవుండగా — ఆమె మనసులో నాలుగైదురోజుల పూర్వం జరిగిన సంఘటన అకస్మాత్తుగా మెదిలింది. ఆలోచించిన కొద్దీ, అదంతా ఒక కలలావుంది. ఆ సంఘటనను తను ఆపగలదు. దానికి జవాబుదారి తనదేననికూడా ఆమెకు తెలుసు, భగీరథుడు ఆమెయింటి కానుకునివున్న యింట్లోనే వుంటుండేవాడు. మొదట్లో భగీరథుడు ఆమెను ఎగతాళి

చేసి పరాచికాలాడేవాడు. పోయిన బుధవారం ఆమెకేమీ బావుండలేదు. భగీరథుడు సిగరెట్టు వెలిగించుకునేందుకు ఆమె యింటికి వచ్చాడు. పన్న మనసులో భగీరథుడు రాకపూర్వం నుంచే ఏవో కోరికలు మెదుల్తూ, ఆమెను సతమతం చేస్తున్నయ్ ! సరిగ్గా ఆ దేసను యంలో భగీరథుడు వచ్చి, నవ్వుతూ ఎగతాళిగా ఏదో అన్నాడు.

ఆమె సిగ్గుపడింది. ముడుచుకు పోయింది. కానీ భగీరథుణ్ని మాత్రం — అతని ఎగతాళి మాటల్నించి ఆపుచేయ లేకపోయింది. ఆమె అంతా మర్చి పోయింది. తనూ ఒక ఆడదాన్ననే సంగతి మాత్రమే ఆమెకప్పుడు గుర్తుంది. తను విధవననేసంగతి గుర్తులేదు. దానితో పాటు భగీరథుడుకూడా మగవాడేనని అనుకుంది. కానీ పరపురుషుడనే సంగతి ఆమెకి గుర్తులేదు ! తన మనసులోని ఏదో భావంమాత్రం భగీరథుణ్ని వారిద్దా మని, ఒకమూల మెదిలింది. అయినా — కంఠంకానీ, చేతులు కానీ, ఆ భావాన్ని అనుసరించలేక పోయినయ్ ! యుద్ధసమ యంలో సేనలన్నీ సేనాధిపతికి ఎదురు తిరిగినట్టుగా, తన శరీరాన్ని, ఏవో శక్తు లన్నీ లోబరుచుకున్నయ్! పతి వ్రతనే భావం అశక్తిముందు నిలుచోలేక పారి పోయి — ఏమూలలోనో, తలదాచుకు కూచుండి పోయింది. ఒకేసమయంలో రెండువేపులనుంచీ గాలివాన బ్రహ్మాం డంగా వీచింది. అందులో ఆమె తాలూకు సతీత్వమనే చిన్నమొక్క పూడిపడి ఎగిరి పోయింది.

అంతా జరిగిపోయాక పన్నకు తెలివి వచ్చి, ఒక కలకన్నట్టు త్రుళ్లిపడిలేచింది. కానీ అది కలకాదని తెలుసుకుని ఆలో చిస్తూ, ఈనాడు ఏడుస్తూవుంది. భావి వద్ద లలితసంగతి మాట్లాడుతున్నప్పుడు తన సంగతి మర్చిపోయింది. కానీ యిప్పుడా సంఘటన పదునైన బాకులా తన మనసుని బాధ పెడుతూవుంది. భోజనంచేసి మంచంమీద పడుకున్నాక, ఈ సంఘటన విషయమై ఆలోచిస్తూ — ఇకనైనా కాలు జారకుండా జాగ్రత్తగా వుండాలని, నిశ్చయించుకుంది. ఈ ఆలోచనల్లో ఆమెకి ఎప్పుడు నిద్ర పట్టిందో కూడా తెలీదు.

సూర్యకిరణాలు తలుపు సందుల్లోంచి తొంగి చూసి, ఆమె నిద్రను భంగ పర్చినయ్! ఇప్పుడామెలో ఏ ఆలోచనా లేదు.

భగీరథుడు ప్రభాత సూర్యునిలానే మామూలుగా వచ్చి ఆమె ముందు నిలు చున్నాడు. అతనిప్పుడు కూడా సిగరెట్టు వెలిగించుకునేందుకు వచ్చాడు. అయిదారు రోజులపాటు కుంభవోతగా కురిసిన వర్షం వెలిసిన తరువాత ఎండ ఎంత హాయిగా వుంటుందో — పన్న కిప్పుడలానే వుంది! ఇంతలో పన్న హృదయంలో ఏదో ఆలోచన తట్టి వెంటనే — "భగీరథ్ ! నువ్విక్కడికి కిక రావద్దు" అని అన్నది. కానీ — హృదయంలోని రెండవ కోన దానికి విరుద్ధంగా ఆమె ఆత్మని బలవం తంగా నొక్కుతూవుంది.

భగీరథుడు ఆమెను గ్రుచ్చి గ్రుచ్చి చూస్తూ — "పన్నా ! నన్నిక్కడకు

రావద్దని అనేట్లయితే— సాయంకాలానికల్లా నా శవం నీ యింటి ముందు వుంటుంది. నిన్నొదిలి నేను బతకలేను. ఇప్పుడు మన మిద్దరం ఒకరి కొకరం తోడు నీడలమయాం! నాకెప్పుడూ నువ్వే జ్ఞాపక ముంటావు! నువ్వు నాకొకసారి. అన్నీ అర్పించావు. యిప్పుడిక ఆ సంగతిని గురించి ఆలోచించడం అనవసరం—" అని అన్నాడు.

పన్న ఆలోచనల్లో మునిగిపోయింది. జరిగిందేదో జరిగిపోయింది. పోయిన శీలం రానేరాదు.

భగీరథుడు తనలో తానే రాత్రికి వస్తానంటూ సిగరెట్టు కాల్చుకుని, వయ్యారంగా పొగవదులుకుంటూ — ఎవరైనా చూస్తారేమోనన్న భయంతో తొందరగా వెళ్ళిపోయాడు.

చీకటి పడడంతోనే మొండి గోడ దూకి, భగీరథుడు పన్నా యింటికి వచ్చాడు. ఆసమయంలో పన్న ఏమేమో ఆలోచిస్తూవుంది కానీ ఆమె ఏనిశ్చయానికీ రాలేకపోయింది. భగీరథుడి మనసులో వున్నది మాత్రం పూర్ణంగా అలానే వుండిపోయింది. ఈనాడు కూడా పరిపూర్ణ నిశ్చయం — ఓ మూల మెదుల్తూన్న అసంపూర్ణమైన నిశ్చయాన్ని ఓడించింది.

తన యింటికి భగీరథుడొక్కడే! పన్నా కూడా అంతే! మొట్టమొదటి రోజుల్లో పన్నా, భగీరథుణ్ని రావద్దని వారించింది. ఆ తరువాత అతిడి ప్రార్థనలకి, వేడుకోవడాలకి, మెల్లిగా లొంగిపోయింది.

నాలుగు నెలలయ్యాక, భగీరథుడు భయపడుతూనే వివాహ ప్రస్తావన ఎత్తాడు.

"భగీరథ్! నీకూ— నాకున్న సంబంధం చాలు! వేరే యింకేమీ పెళ్ళి పెడాకులు అవసరంలేదు." అని ఆమె అన్నది.

మనసులో ఒకమూల, భగీరథుణ్ని యిక రావద్దని చెబుదామని అనుకుంటూనేవుంది! ఎప్పుడన్నా ఎవరికైనా తెలిసినట్లయితే తన తపశ్చర్యంతా ఏట్లో పోసినట్లవుతుందనీ, నలుగురాడవాళ్ళకీ సంగతి తెలిస్తే వాళ్ళముందు తల ఎలా ఎత్తుకు తిరగాలనీ, హృదయం నిండా మెదిలేది. ఆ కారణంతోనే కొన్ని క్షణాలసేపు భగీరథుణ్ని చూసి "వివాహం చేసుకోను భగీరథ్! నువ్వుకూడా వివాహం చేసుకోమ్మని ఎప్పుడూ నన్ను బలవంతం చేయకు" అన్ని అన్నది.

భగీరథుని కళ్ళుమాత్రం "భగీరథుడు నీ మాటపాలించగలడు." అన్నట్లున్నయ్.

"మనిద్దరి విషయం ఎవరికీ తెలియనీయ కూడదు. లేకుంటే నేను విషం పుచ్చుకుంటాను" అని అన్నది పన్నా.

భగీరథుడు తన చేతిని పన్నా తల మీద ఉంచి—"భగీరథుణ్ని ముక్క ముక్కలుచేసినా వాడు నీ కవమానం కలుగనీయడు" అని అన్నాడు.

పన్న ముఖంమీద సంతోష చిహ్నం ఒకటి పరుగుతీసింది. ఎవరికైతే ఆమె తన సర్వస్వాన్నీ అర్పించిందో—వాళ్లు ఇంతకంటే చెప్పాల్సిన సంగతేముంటుంది?

ఈమాటు భగీరథుణ్ని ఎప్పటికీ పన్న తనవాణ్నిగా చేసుకుంది. ఈనాడు

ఆమెకూ-భగీరథునికీ మధ్యనున్న విభిన్నత్వమనే రేఖ తుడుచుకుని పోయింది.

* * *

పల్లెవాళ్ళంతా కలిసి ఎంతో నచ్చచెప్పాక భగీరథుడు తనయింట్లో ఒక భాగాన్ని మహేశు డాక్టరుకు అద్దెకిచ్చాడు. ఒకనాటి రాత్రి ఏదో అలికిడికి మహేశు డాక్టరుకి మెలంకువ కలిగింది. కిటికీలోంచి తొంగిచూసేసరికి భగీరథుడు మొండిగోడ దూకి పన్న ఇంట్లోకి వెళ్ళడం కనిపించింది.

డాక్టరుకేమీ పాలుపోలేదు. నిద్ర పట్టలేదు. ఆయన మాటిమాటికీ భగీరథుడు ఎప్పుడు తిరిగివస్తాడాని కిటికీలోంచి తొంగిచూస్తున్నాడు. గంటసేపు గడిచాక భగీరథుడు తిరిగి వచ్చాడు. డాక్టరు పండ్లతో క్రింది పెదవి కొరికి యేదో నిశ్చయించుకుని— మంచముమీద నడుమువాల్చి, గట్టిగా నిట్టూర్పులు విడుస్తున్నాడు. పన్న తన రహస్యాన్ని బట్టబయలు చేయవద్దని క్షమాపణ కోరుతూన్నట్లనిపించింది.

డాక్టరు మెల్లిగా తన తలుపుగొళ్ళెం తీసి, బయటికి వచ్చి, భగీరథుడి కిటికీ వద్ద చెవుంచి చూశాడు. ఆ గదిలోంచి గురక శబ్దం వినిపించింది. డాక్టరు హృదయం ఆనందంతో ఎగిరి గంతేసింది.

అతను కూడా మొండిగోడ దూకి, నాలుగు ప్రక్కలా జాగ్రత్తగా చూసి పన్నగది దగ్గరికి చేరాడు. అతని హృదయం దడదడ లాడింది. కానీ అధైర్యపడలేదు. పన్న తలుపేమో వేసుంచింది. కాని లోపలమాత్రం గొళ్ళెం వేసుకోలేదు. అడుగులో అడుగులు వేస్తూ ఆయన లోపలికి ప్రవేశించి, చీకట్లో వెదకుతూ పన్న శరీరాన్ని ముట్టుకున్నాడు. భగీరథుడు తిరిగి వచ్చాడేమో ననుకుని, కళ్ళు తెరవకుండానే— "ఎవరూ—?" అని అడిగింది.

"నేనే మహేశు డాక్టరుని—"

"నువ్వా-? మహేశు డాక్టరువా—? యిక్కడికెలా వచ్చావు-? ఎందుకొచ్చావు-?" భయపడుతూ — ఆమె లేచి కూచుంది.

"భగీరథుడు యిక్కడికెలా వచ్చాడో — అలానే వచ్చాను—"

డాక్టరు నోటివెంట భగీరథుడను పేరు విని పన్న నోటంట మాట రాలేదు. ఆమె భయంతో అలానే చూస్తూ నిలబడి పోయింది. ఆమె హృదయం నిండా-ఉదయాన్నే డాక్టరు తన విషయమంతా వూళ్ళో చెప్పేస్తాడనీ, తనను మెచ్చుకునే వాళ్ళంతా వుమ్మి వేస్తారనే భయం అలుముకు పోయింది. వూపిరి గట్టిగా కొట్టుకుంటూంది.

"భయపడకు పన్నా! నీ విషయం నే నెవరికీ చెప్పను. నేను కూడా భగీరథుని లానే వచ్చాను. నీకిష్టం లేకుంటే నేను వెళ్ళిపోతాను కాని దీనిఫలం ఎలా వుంటుందో ఆలోచించుకో" అని డాక్టరు అన్నాడు.

పన్న మాట్లాడలేదు. తను ఆటంకపరచి నట్లయితే ఏమవుతుందో— ఆ సంగతి హృదయంనిండా ముందుగానే

నించిపోయింది. తన పేరు ప్రతిష్ఠలు ఒక్క రోజులోనే నాశనమై పోతాయ్!

"ఏమంటావు పన్నా?"

పన్నా మాట్లాడలేదు.

నిలుచున్న డాక్టరు పన్న మంచం మీద కూచున్నాడు.

జీవితంలోని ఒక పాపాన్ని దాచేందుకు మానవుడు తప్పని సరిగా యింకా కొన్ని పాపాలు చేయాలి. పన్న జీవితం ఆక్షణంలో ఈ సత్యాన్ని నిరూపించేందుకు విశ్వంలోని అనన్య సంఘటనలతో పాటు యింకొక సంఘటనను విధిగా కలిపింది. వొప్పుకుంది.

* * * * *

పన్న వయస్సిప్పుడు ముప్పైఆరు సంవత్సరాలు! ఆమె యవ్వనంలోని రూపానికి అప్పుడూ యిప్పుడూ తేడా కనిపిస్తూనేవుంది. శరీరంలో యింత భేద మున్నప్పటికీ యెదురుగా వున్న మర్రి చెట్టు తన చిన్నతనంనుంచీ యెలావుందో అలానే వుందేమని దాన్ని చూసి ఆలోచించేది. ఆ మర్రిచెట్టుక్రింద వేసవి కాలపు మధ్యాహ్నం ఆవూరు రచ్చ చావిడిగా అది మారి పోయేది. కొంత మంది వృద్ధులు అక్కడ మంచాలు వేసుకుని చుట్టలు కాల్చుకుంటూనో తాళ్లు పేనుకుంటూనో వుంటారు.

ఆ మర్రిచెట్టు క్రింద భగీరథుడు డాక్టరు, యింకా యిద్దరు ముగ్గురు పేకాడు కుంటున్నారు. ఆ చెట్టును చూడడంతోనే తన జీవితంలోని పతనాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆరోజల్లా ఏడ్చింది. జరిగిపోయిన భర్త తాలూకు మధురాను భూతులు ఆయనగారి పట్ల తను చేసిన ద్రోహం ఆయనగారి కీర్తికి తెచ్చిన కళంకం, ఒక్కొక్కటిగా అన్నీ ఆమె చుట్టూ తిరిగినయ్. ఏడుస్తూ భోజనం చేయకుండానే బాధపడుతూ— యెప్పుడో నిద్రపోయింది.

ఉదయంలేచి స్నానం చేసింది. కానీ మధ్యాహ్న మవడంతోనే ఆమెకు జ్వరం వచ్చింది. అప్పుడప్పుడు ఏదో కలవరించింది. వూళ్ళోని వైద్యుని పిలిచింది. ఆయన చూసి జ్వరం వస్తుండగా స్నానం చేసింది, అని చెప్పి వెళ్ళి పోయాడు.

ఇవ్వాల్టికి జ్వరంవచ్చి యెనిమిది రోజులైంది. కలవరింతలు కూడా యెక్కువైనాయ్.

"ఆయన నన్ను పిలుస్తున్నారు. ఆయన నాతో 'నీకోసం చాలా కాలం నుంచీ యెదురు చూస్తున్నాను' అని అంటున్నారు."

కొన్ని క్షణాలు వూరుకుని "పన్నా-పన్నా—రా—ఇక్కడికిరా! ఆయన నన్ను బల్లవంతంగా సీత, సావిత్రీదేవి అధిష్టించిన సింహాసనం మీద కూచోపెడుతున్నారు." అని అన్నది.

"చూడండి ... అదుగో చూడండి! ఆయన స్వర్గంనుంచి వస్తున్నాడు. ఆయన పక్కనవున్న స్థానం ఖాళీగావుంది."

ఇలానే యెన్నో రకాలుగా కలవరించేది. ఉలిక్కి పడేది.

పన్న జ్వరం సంగతి విని ఇరుగు పొరుగు ఆడవాళ్ళు చాలామంది వచ్చి మంచం చుట్టూ కూచున్నారు. ఇద్దరు ముగ్గురు చిన్న పిల్లలు కూడా వచ్చి ఆశ్చర్యంగా చూస్తూ నిలుచున్నారు.

"అడుగో_అడుగో_! ఒక బండి పూలు తెప్పించండి. మాలకట్టి ఆయన మెడలో వేయాలి! నన్ను సహగమనం చేయకుండా ఆపారు. ఇప్పుడు నేనా యనతో వెళ్లి పోతాను."

జ్వరం వేడికి ఆమె శరీరం కంపిస్తూ మాటిమాటికీ పళ్ళు కొరుకుతూవుంది. పిచ్చిదానిలా పిడికిళ్లు మూస్తూవుంది. ప్రలాపాలు తగ్గనేలేదు. వూపిరి సరిగ్గా ఆడ్డంలేదు. ఇరుగు పొరుగువాళ్ళు కళ్ళ నిండా నీళ్ళునింపుకుని జాలిగా చూస్తూ నిలుచుండిపోయారు.

ఒక వృద్ధురాలు— "ఇవాళ నిజంగా ఎంతో పుణ్యంచేసుకున్న వాళ్లకే మృత్యువు దొరుకుతుంది! పాపం జీవితమంతా అతనికోసమే గడిపింది. వేలుపెట్టి చూపించుకోలేదు" అని అన్నది.

"నిజమేనమ్మా! విక్రముడు పోయి యింతికాలమైనా — ఒక్క చెడుమాట కూడా మనం వినలేదు" ఇంకొకమ్మ ఆమాటకి లయవేసింది.

"పాపం! పతివ్రత—" అని గుంపు లోంచి యింకొకరు అనడం వినిపించింది.

కొంతమంది అవునన్నారు

దగ్గరున్నవాళ్ళంతా ఆమెను మెచ్చు కున్నారు.

మహేశు డాక్టరు ఎవరితోనో "పాపం చాలా తెలివిగలమనిషి.!" అని అనడం వినిపించింది,


ఇదేసమయంలో భగీరధుడు— "మృత్యువు మంచిచెడ్డల్ని చూడదు. దానికి హెచ్చుతగ్గులు లేవు—" అని ఎవరితోనో అనడం వినిపించింది.

పన్న ఆమాటలన్నీ విన్నది.

అందరూ తనను మెచ్చుకోవటంచూచి నిజంగా తను పతివ్రతనే అని అనుకున్నట్లుగా ఆముఖంలో ఆనందం వెల్లివిరిసింది. అంతే! ఆమెలోని జ్యోతి ఆరిపోయింది.

చుట్టూ నిలుచున్నవాళ్ళు అంటున్న ప్రశంసలను విని, పన్నశవం ఆమె పాతివ్రత్యానికి నవ్వింది.!!






హేవలాక్ ఎల్లీస్‌ను అనుసరించి

## 'క్రాంతినాథ్' రచన

జచ్చియా అనే ఆయన—స్త్రీ స్ఖలించేంతవరకూ రతి జరగాలా అక్కర్లేదా అనే విషయాన్ని చర్చించాడు. తన స్ఖలనంతో రతిని పూర్తిచేయటం పురుషుని అహంభావమే అవుతుంది; తన స్త్రీకూడా పూర్ణతృప్తిని పొందేవరకూ రతిని సాగించటం భర్త కర్తవ్యం. ఇదికాని పక్షంలో స్త్రీ నిద్రలో స్ఖలించటమో, లేక హస్తప్రయోగంద్వారా స్ఖలించటమో జరుగుతుంది. హస్తప్రయోగం పాపమనే భావనలోవున్న స్త్రీ తన తొడల రాపిడితో స్ఖలించేందుకు ప్రయత్నిస్తుంది. మరి కొంతమంది వేదాంతులు—దాంపత్యంలో పూర్ణతృప్తిని పొందలేని స్త్రీ హిస్టీరియా మొదలైన వ్యాధులకు గురవుతుందని నమ్మారు. మొత్తంమీద రతిలో స్త్రీ అసంతృప్తి చెందటంవల్ల శారీరకంగానూ, మానసికంగానూ ఆమె ఆరోగ్యం దెబ్బతింటుంది.

అనేక సార్లుగా కామోద్రేకం కలిగి అది చల్లారే మార్గంలేక స్త్రీ బాధపడటం వల్ల— ఆమె నరాల బలహీనతకూ, జీర్ణకోశానికి సంబంధించిన జబ్బులకూ గురై క్రమంగా ఆరోగ్యం పాడుచేసుకుంటుందనే విషయాన్ని వైద్య ప్రముఖులు ఒప్పుకున్నారు. 1904 లో బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో కామోద్రేకం చల్లారనందువల్ల స్త్రీ అండకోశాల్లో బాధ కలిగిన రోగి విషయం చర్చించ బడింది. సెక్స్ యంత్రాంగానికి సంబంధించిన వ్యాధులకు గురికావటం దాంపత్య జీవితంలో అసంతృప్తి జెందిన స్త్రీలలోనే గాక కన్యల్లో కూడా కనిపిస్తుంది. ఆస్ట్రియన్ డాక్టర్ కాయన ఇలా అంటున్నాడు. "మూత్రసంబంధమైన వ్యాధులకు గురైన ప్రతి వందమంది రోగుల్లోనూ 70 మందిలో గర్భకోశం ముడుచుకు పోవటం కనిపిస్తుంది. దీనికి కారణమల్లా పూర్ణ రతి జరగ కుండటమే!"

స్ఖలన మయే సమయంలో దాన్నుంచి తప్పించుకొందామనే ప్రయత్నంలో పురుషుడు పురుషాంగాన్ని విరమింప జేయటం— అసంపూర్ణ రతిగా పరిగణించబడింది. సహజంగా స్ఖలన మయే పక్షంలో గర్భం వొస్తుందేమోననే భయంతో కూడా పురుషుడు అసంపూర్ణ రతికి పాల్పడవచ్చు. కాని యీపద్ధతి వల్ల స్త్రీ పురుషులిద్దరిలోనూ కూడా అశాంతి ప్రబలి వారు నరాల బలహీనత్వానికి, మానసికమైన బాధకూ గురి కావటం జరుగుతుంది.

స్త్రీ కామోద్రేకం ఏ ఘట్టంలో వున్నప్పటికీ, పురుషుడు తన స్ఖలనాన్ని స్వభావ సిద్ధంగా చేయకుండేందుకుగాను, అకాత్తుగా రతినుంచి విరమించటంవల్ల స్త్రీ ఆరోగ్యం దెబ్బతినక తప్పదు. ఐతే యీ పద్ధతి అనేక దాంపత్యాల్లో అమల్లో వున్నప్పటికీ పైన చెప్పుకున్నంత ఘోరంగా దంపతుల ఆరోగ్యాలు తలక్రిందులైనట్టు కనిపించదు. మొత్తంమీద యీ పద్ధతిద్వారా పూర్ణతృప్తిని పొందలేక, ఆ తరువాత గంటల తరబడిగా వేదనపడే స్త్రీ ఆరోగ్యం భంగం గాక తప్పదు. శీఘ్రస్ఖలనానికి పురుషుడు గురైనప్పుడు కూడా, స్త్రీ కామవాంఛ చల్లారక, ఆమె ఆరోగ్యం దెబ్బతినక తప్పదు. కనుక అసంపూర్ణ రతివలెనే, అక్రమమైన రతివల్లకూడా చెడుగువుంది. అసంపూర్ణ రతిలో స్త్రీ స్ఖలించినట్టయితే, ఆమె తృప్తి చెందటం, ఆమె ఆరోగ్యం కాపాడబడటం జరుగుతుంది.

స్ఖలన నిరోధం (పురుషుని విషయంలో) చాలా కాలంగా మానవునికి తెలుసు. జెనిసిస్‌లో స్ఖలన నిరోధం పేర్కొనబడింది. 16 వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లోని ఇల్లాళ్ళు తమ ప్రియుల్ని స్ఖలన నిరోధం కోసమని అర్థించేవారు; స్ఖలన నిరోధం గర్భనిరోధమవటం వల్ల ఇది అనేక దాంపత్యాలలో అమలు జరుపబడుతోంది.

స్ఖలననిరోధంలోనే వేరొక పద్ధతి— పురుషుడు స్ఖలించకుండా చాలా సేపటివరకూ వీర్యాన్ని తొక్కిపడతాడు; యీలోగా స్త్రీ అనేకసార్లు స్ఖలిస్తుంది. దీన్నే 'Coitus reservatus' అంటారు. యీ పద్ధతివల్ల స్త్రీ అత్యంతతృప్తిని పొందుతుంది. స్త్రీ ఆరోగ్యానికి భంగకరం కానంతవరకూ స్ఖలననిరోధంవల్ల దాంపత్యసౌఖ్యం లభ్యమౌతుందని చెప్పవొచ్చు.

ఐతే స్ఖలననిరోధం చెప్పినంత తేలిక కాదు. చాలామంది పురుషులకు అసాధ్యమైన విషయమే! నరాల బలహీనత, మానసిక బలహీనతలు వున్న వ్యక్తులకు అసంభవంగా కూడా పరిణమిస్తుంది. రతిలో ఇది అత్యుత్తమపద్ధతిగా గుర్తించబడింది— తూర్పుదేశాలవారు దీని ఉపయోగాల్ని గుర్తించి ఎక్కువగా అమలు జరుపుతున్నారు. రతి జరుగుతూన్నప్పుడుకూడా భర్త వేరేవిషయాల్ని భార్యతో మాట్లాడుతూ తన స్ఖలనాన్ని ఆలస్యంచేయటం, ఒకోసారి నల్లమందును పురుషాంగపు కొనకు రుద్దటంవల్ల స్ఖలనాన్ని ఆలస్యంచేయటంలాటివి కలకాలంగా మన దేశంలో జరుగుతూనే ఉన్నవి.

స్ఖలననిరోధంవల్ల — రతికాలం విశేషంగా పొడిగించబడుతుంది; ఇది పురుషుని ఆరోగ్యానికి భంగకరమనే అభిప్రాయం కొంతమంది వెల్లడించారు. శైలర్ అనే ఆయన స్ఖలననిరోధంవల్ల క్రమంగా పురుషునిలో నపుంసకత్వం రావొచ్చనే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. లావెన్‌ఫీల్డ్ అనే ఆయన సెక్స్ యంత్రాంగానికి సంబంధించిన నరాలు, కండరాలు, గ్రంధులు మొదలైనవాటి రిఫ్లెక్స్ యాక్షన్ చెడుతుందన్నాడు. స్ఖలన నిరోధాన్ని విశేషంగా అమలు జరిపి, ఎంతో ఎక్కువ కాలం రతిని పొడిగించటంవల్ల రిఫ్లెక్స్ యాక్షన్ నశించటంలో అబద్ధంలేదు; కాని బాగా ఆరోగ్యంగా వున్న వ్యక్తులు హద్దులుమీరకుండా స్ఖలననిరోధాన్ని అమలు జరపటంవల్ల చెడుగులేమీరావు.

ఇక్కడ స్ఖలననిరోధాన్ని సామాజిక ఆచారంగా చేసిన ఓనెడా జాతిని గూర్చి తెలుసుకోవటం అత్యవసరం. చాలాకాలంగా ఆ జాతివారు స్ఖలననిరోధాన్ని అమలు జరుపుతూన్నప్పటికీ, అందువల్ల విషాద ఫలితాలను వారు గురికాలేదు. యీ జాతిలోని స్త్రీలంతా పురుషుల సొత్తు వారు తమ ఇష్టానుసారంగా సంబంధాలు పెట్టుకోవొచ్చు. కాని ప్రతిపురుషుడూ ప్రతిస్త్రీవల్లా సంతానాన్ని పొందేందుకు మాత్రం వీల్లేదు. మొగపిల్లలు యవ్వన ప్రవేశంలోనే లైంగిక విజ్ఞానాన్ని — తమ కన్న వయస్సులో పెద్దవారైన స్త్రీలనుంచి పొందుతారు; ఆడపిల్లలు యవ్వన ప్రవేశానంతరం కొద్దికాలం తరువాత, తమకన్న వయసులో పెద్దవారైన పురుషుల నుంచి లైంగిక శిక్షణను పొందుతారు.

రతిలో పురుషుడు గంటకు పైగా స్ఖలించడు; యీలోగా స్త్రీ అనేకసార్లు స్ఖలిస్తుంది. రతినుంచి విరమించాక కూడా పురుషునిలో స్ఖలనం వుండదు; ఆ అవసరం ఉన్నట్టు కూడా అతనికి తోచదు. ఇది సామాజికాచారం. యీ ప్రావీణ్యత, నేర్పులేని పురుషుణ్ని స్త్రీ దూరాన వుంచుతుంది. స్ఖలననిరోధ ఆవశ్యకతను ఆ జాతిలోని స్త్రీ పురుషులందరూ గుర్తించారు. హస్తప్రయోగం ఆ జాతికి బొత్తిగా తెలియదు; తమ జాతికి సంబంధించని వ్యక్తులతోడి సంబంధ బాంధవ్యాలను వారు నిరాకరిస్తారు. యీ పద్ధతిని 30 సంవత్సరాలుగా వారు అమలు జరిపాక, చివరకు వొదిలేశారు; ఇందుకు కారణం అందువల్ల చెడుగులు జరిగినవని కాదు, కాని మిగతా ప్రపంచంనుంచి తాము నిందలను పొందవలసి వొచ్చిందని.

ఆ జాతిలో చాలా సంవత్సరాలు గడిపిన మిల్లర్ అనే ఆయన ఇలా అంటున్నాడు:"యీ పద్ధతిని దాంపత్య జీవితంలో ప్రవేశపెట్టేందుకు కొన్ని ఇబ్బందు లున్నవి. దాంపత్యం పోనుపోను యాంత్రికమైన పద్ధతిగా మారుతుంది. ఓనెడా జాతిలో అమలు జరిపే స్ఖలననిరోధం — రెండు విషయాల్ని ముఖ్యంగా గమనించింది. ఒకటి సమాజానికి సంబంధించిన జాతి విస్తరణ, రెండు దాంపత్య జీవితంలో ఉభయులూ పొందే తృప్తి. జాతి విస్తరణ — ఆ యావ్యక్తులకు తెలియకుండానే,

వారి అధీనంలో లేకుండానే దానంతట అది జరిగిపోవటం శాస్త్రీయ పద్ధతి అవనేరదు. 1844 లో స్ఖలననిరోధాన్ని గూర్చిన తలపు నాకు వొచ్చింది. నా భార్య ఆరోగ్యం శిథిలావస్థలోవుండి, ఆమె సంతానానికి మాతృత్వాన్ని వహించ లేని స్థితిలో వున్నప్పుడు, యీ పద్ధతిని ప్రవేశపెట్టి నేను విజయాన్ని సాధించాను; దాంపత్యపు శాంతిని కాపాడేందుకు స్ఖలననిరోధం ఉపయోగపడింది. ఒనెడా జాతిలోని పెద్దలు చాలా గౌరవనీయ కుటుంబాలకు చెందినవారు; న్యూ ఇంగ్లండులోని ఉన్నత పాఠశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. వారు నాగరికత, విద్యాసంస్కారాలు గలవారు. వారి నైతిక ఆశయాలు ఉన్నతమైనవి. చివరకు 1846 లో వారు తాము ఆచరణలో ఉంచిన స్ఖలన నిరోధాన్ని గూర్చి చర్చించి ఒక క్రొత్త సమాజాన్ని సృష్టించేందుకు ప్రయత్నించారు. కనుక స్ఖలన నిరోధాన్ని గూర్చిన అభిప్రాయం—ఆ సమాజమే తేలుస్తుంది. ఆ సమాజంలోని నరాల బలహీనతకు సంబంధించిన వ్యాధులు —సరాసరి సంఖ్యకన్న చాలా తక్కువగా ఉన్నవి. రెండేరెండు నరాల బలహీనతకు సంబంధించిన కేసులు —యివి కూడా స్ఖలన నిరోధం సరిగా ఆచరణలో ఉంచలేని పురుషులవల్ల జరిగినవి. వార్కర్ అనే ఆయన ఒనెడా జాతిలోని 42 మంది స్త్రీలను పరీక్షించి, జాత్యాభివృద్ధికి సంబంధించిన యంత్రాంగంలో ఎలాటి లోపమూ లేదనీ, వారు అనుసరించే రతిపద్ధతులవల్ల వారి ఆరోగ్యంలో మార్పు రాలేదనీ నిశ్చయించాడు. దీన్నిబట్టి స్ఖలన నిరోధ ఆవశ్యకత అర్థమవకపోదు.”

పురుషుడు దీర్ఘరతిలో పాల్గొనటమనేది కలకాలంగా ప్రయత్నించబడుతున్నప్పటికీ ఒక విశిష్టదృష్టితో, శాస్త్రీయంగా కొన్ని విధులననుసరించి స్ఖలననిరోధం అమలుజరుప బడలేదు. దీర్ఘరతి జరిగినప్పటికీ స్ఖలించవలసిన అవసరం రాకుండా తప్పించుకోవటం సరైనపద్ధతి. దీర్ఘకాల రతిలో స్త్రీ అనేకసార్లు స్ఖలించిన తరువాత పురుషుడు స్ఖలించడం అనాదినుంచీ మానవునికి తెలుసు. 17- వ శతాబ్దంలో జచ్చియా అనే ఆయన పురుషుడు ప్రదర్శించే పరిపూర్ణ స్ఖలన నిరోధం ఎంతవరకు నీతికి లోబడి వున్నదనే విషయాన్ని తర్కించాడు. ఇక నేడు ఏవిధులూ లేకుండానే అనేక దాంపత్యాలలో స్ఖలన నిరోధం అమలుజరుప బడుతూనేవుంది; యిందువల్ల పురుషుని ఆరోగ్యం తలక్రిందులు కాకుండటం, స్త్రీ అత్యంతతృప్తిని అనుభవించడం జరుగుతోంది. కనీసం ముప్పావుగంటైనా రతిజరగందే స్త్రీకి తృప్తికలగదనే శాస్త్రీయ అభిప్రాయానికి అనుగుణంగా స్ఖలన నిరోధపద్ధతిలో రతి గంటకు పైవరకూ సాగించే అవకాశం ఏర్పడుతోంది. ఈ కాలంలో స్త్రీ 4, 5 సార్లు స్ఖలించినప్పటికీ- పురుషుడు మాత్రం ఒకే ఒక్కసారి స్ఖలించటంతో రతి పూర్తవుతుంది. ఆ తరువాత స్త్రీకి వాంఛ కలుగవచ్చు; అప్పుడు పైపద్ధతిలోనే దాంపత్యం నిర్వర్తించబడుతుంది. స్త్రీకి మరి కోర్కె కలుగదు.

ఆధునిక పరిశోధనల ఫలితంగా స్ఖలన నిరోధాన్ని నియమంగా పాటించటం వల్ల చెడుగుకూడా వున్నదని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. యీ విషయం అభిసారికలో విశదంగా చర్చించబడింది. కనుక స్ఖలన నిరోధ పద్ధతి అప్పుడప్పుడు అనుసరించటం వాంఛనీయమని చెప్పవొచ్చు.

ప్రణయకళనుగూర్చి తెలుసుకోవాల్సి వొచ్చినప్పుడు రతి భంగిమల ప్రాముఖ్యాన్నీ, వాటి ఉపయోగాల్నిగూర్చికూడా తెలుసుకోవాల్సివుంది. ముఖాముఖీగా దాంపత్యం నిర్వర్తించబడటం సర్వజనామోదమైన, సామాన్యపద్ధతిగా గుర్తించబడివుంది. యీ పద్ధతిలో ఒకరి ముఖకవళికల్ని వేరొకరు అర్థంచేసుకుంటూ, ఒకరి అనుభూతిని వేరొకరు గ్రహిస్తూ, ముఖ్యవిషయాల నెన్నిటినో మాట్లాడుకుంటూ రత్యానుభవం పొందే అవకాశంవుంది.

రతిజరిగే అనేక విధానాలు — వ్యక్తిగతమైన అభిరుచులమీదా, జాతీయమైన పద్ధతులమీదా అమల్లో ఉన్నవి. ఫ్యూర్‌బ్రింగర్ అనే ఆయన "నేను ఎన్నివిధాలుగా రతిభంగిమల్ని ఆలోచించగలనో వాటినన్నిటినీ నా రోగులు అమలుజరిపేవున్నారు" అన్నాడు. ఐతే యీ ఇతరవిధానాలు అక్రమశిక్షణవల్ల వొచ్చిపడినవని అనలేము. అవి సాధారణంగా ప్రకృతిసహజంగా, ఏ ప్రమాదవశానో జరిగినవని చెప్పవొచ్చు. దంపతులకు ఇష్టమైన ఏ రతిభంగిమా అశాస్త్రీయం మాత్రంకాదు.

కొంతమంది వేదాంతులు సాధారణపద్ధతిలోగాక ఏ ఇతరవిధానంలో జరిగే దాంపత్యమైనా పాపంగానే గుర్తించారు. మరి కొంతమంది వేదాంతులు — ఉపరతిని వొక్కదాన్నే పాపంగా గుర్తించారు. ఎందుకంటే యీ పద్ధతిలో స్త్రీ బానిసగా వుండవలసింది, పురుషుని అక్రమించకూడదనే భావన స్పష్టమౌతుంది.

ఇంకొంతమంది వేదాంతులు రతికి సిద్ధపడే ముందు ఏభంగిమ, ఏక్రియ ఐనా తప్పు కాదనే అభిప్రాయాన్ని వెల్లడించారు. గ్రీన్. అరబిన్ వేదాంతులు — స్త్రీ గర్భకోశం వీర్యాన్ని కోరుతూంటుంది కనుక స్ఖలనం యోనిలోనే జరిగే పక్షంలో ఏరతి భంగిమైనా తప్పులేదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఆదిమ వేదాంతుల్లోనే ఎన్నో అభిప్రాయ భేదాలున్నవి. ఆధునిక వైద్యశాస్త్ర ప్రకారం — కొన్ని సందర్భాలలో అక్రమమైన అనేక ఇతర రతి భంగిమలు ఎంతో అనుకూలంగానూ, వాంఛనీయంగానూ వుంటవని తేలింది. కిష్చ్ అనే ఆయన స్త్రీకి తృప్తి కలగాలంటే, రతిలో ఆమె పురుషుని స్థానాన్ని ఆక్రమించాలన్నాడు, ఏడ్లర్ కూడా వివిధ రతి భంగిమల్ని ఒప్పుకుంటూ, ఉపరతిలో ఏదో మంత్రశక్తి పనిచేసినట్టుగా ఎంతో ఆనందం వెల్లడయే అవకాశాలున్నవని తేల్చాడు. శారీరకమైన, మానసికమైన కొన్ని లోపాలకు అసామాన్యంగా భావించబడే అనేక రతి భంగిమలే మందు మాకుల్లాగు పనిచేయటం కొత్తకాదు. సరదాకోసమని మార్చుకునే రతి భంగి

మలు ఒకోసారి ఎంతో ఆనందాన్నివ్వటం, ఆ దంపతులు అదే భంగిమలో గాంపత్యాన్ని నిర్వర్తిస్తూ సౌఖ్యపడటం లాటి కేసులు వైద్యశాస్త్రానికి ఎన్నో తెలుసు. ఒకవేళ ఇతర భంగిమల్లో దంపతులకు ఆనందం లభ్యంకానట్టయితే, సామాన్య పద్ధతికే మారేందుకు ఎక్కువ కాలం పట్టదు.

అనేకమంది వేదాంతులు రతిభంగిమలు కొన్నిటిని ఆమోదించే వున్నారు. నైతికమైన నిర్బంధాలవిషయం ఇక్కడ చర్చించటం చాలా అనవసరం. దాంపత్య జీవితసౌఖ్యాన్ని అనుభవించేందుకు దంపతులు అన్నివిధాలా అర్హులు. వారిమధ్య జరిగే రతివిశేషాలలోని నీతి – అవినీతి ప్రశంసలేదు. వారిద్దరికీ తృప్తికరమైన ఏ పద్ధతినైనా సరే శాస్త్రం ఆమోదిస్తుంది. ఇందుకు ఒకే ఒక్క నియమంవుంది. రతి ఏ భంగిమలో జరిగినప్పటికీ స్ఖలనంమాత్రం యోనిలో జరగాలి.

దేశదేశాల్లోని కామశాస్త్రరచయితలు అనేక రతిభంగిమల్ని వర్ణించారు. వాటిల్లో కొన్ని శారీరకమైన లోపాలను సరిజేసుకునేందుకు అత్యంత ఉపయోగకరంగా వుంటవి. ఉదాహరణకు పురుషుడు చాలా పెద్దవాడై, దీర్ఘకాయుడైన పక్షంలో, సామాన్యపద్ధతివల్ల స్త్రీ చాలా బాధపడుతుంది; ఇలాటి సందర్భంలో ఉపరతి దాంపత్యశాంతిని కాపాడగలుగుతుంది. యీ పద్ధతి నేడు బహుజనామోదాన్ని పొందింది. స్త్రీ తనకు అనుకూలంగావుండే యీ విధానాన్ని ఎక్కువగా కోరుతుందనటం సత్యదూరం కాదు. సాధారణపద్ధతిలో తృప్తిపడని స్త్రీ, ఉపరతిలో తృప్తిపడటానికి ఎన్నో అవకాశాలున్నవి.

క్రీ. పూ 1300 ల్లోనే యీజిప్ట్‌లో కామశాస్త్రంతాలూకు 14 రతిభంగిమల చిత్రాలు శిథిలాల్లో దొరికినవి. ఇండియన్‌లు 48 రతిభంగిమల్ని ఆమోదించారు. 'అనంగరంగం' అనబడే కామశాస్త్ర గ్రంథంలో 42 రతిభంగిమలు వర్ణించబడినవి. మహమ్మదీయ కామశాస్త్రగ్రంథం—'ది పెర్‌ఫ్యూమ్డ్ గార్డెన్'లో 40 రతిభంగిమలూ, మరి ఆరురకాల కదలికలూ వర్ణించబడినవి. కామశాస్త్ర గ్రంథాల్లో పాశ్చాత్య దేశాలకన్న ప్రాక్ దేశాలకు గొప్ప స్థానం ఉన్నదనే విషయాన్ని కొమ్ములు తిరిగిన వాళ్ళంతా ఒప్పుకున్నారు. కామశాస్త్ర గ్రంథాల్ని రచించినవారిలో స్త్రీలుకూడా ఉన్నారు. కాని పురాతన గ్రంథాలు నేడు లభ్యంకావు. ఆధునిక రచయితల్లో ఫర్‌బెర్గ్ అనే ఆయన 90 రతి భంగిమల్ని విశదీకరించాడు కాని—వాటిల్లో 48 మాత్రమే సాధారణపద్ధతులుగా పరిగణించబడినవి. మిగతావి అమలు జరపటంకూడా ఒకపెద్ద సమస్యే!

రతిని ఏవగింపుతో అసహ్యించుకోవటం మొదలయాక క్రమంగా అది చీకట్లోకి పాకిపోయింది. చీకటి తప్పుగా పరిగణించబడసాగాక, నాగరికత ప్రబలిన ప్రదేశాల్లోకూడా రతి—రాత్రి మొదటిభాగంలోనే జరగటం పరిపాటయింది. పగలల్లా పనిచేసి అలసిపోయి వున్నప్పుడు—గొంతుదాకా తిని, విశేషంగా తాగటం

వల్ల మత్తులో ఉద్రిక్తపడి, కాంతిహీనమైన మూరికితో కూడిన పడకగదుల్లో చీకటి తప్పు జరిగిపోవటం సామాన్యవిషయం. ఇది కారణంగానే రతినుంచి విముఖత్వాన్ని ప్రదర్శించటం స్త్రీలలో ఎక్కువగా కనిపిస్తుంది.

రతి ఏ కాలంలో జరగాలి? ఈ విషయంలో నాగరికులకన్న అనాగరికులే తమ బుద్ధిసూక్ష్మతను ప్రదర్శించారని చెప్పవొచ్చు. క్రైస్తవమత జననానికి పూర్వం నుంచే కొన్ని కొన్ని సామాజికాచారాలు, నమ్మకాల్ని అనుసరించి, రతి చీకట్లోకి మారిపోయింది; ఆ తరువాత క్రైస్తవమతం పెరగసాగాక రతి — పగటి పూట నిషేధించబడింది. ఇతర మతైకమైన నమ్మకాలు కూడా రతి, రాత్రి పూటే జరగవలసిన విధిని శాశించినవి.

న్యూగినియాలోని అనాగిరికులు బట్టబయిట రతి జరుపుతారు. గుబ్‌వుకా, బురూద్వీపాల్లో శారీరకమైన కష్టాన్ని చేసుకుని బతికే స్త్రీలు రాత్రి పూట రతిని నిరాకరిస్తారు; ఆసమయంలో అలిసిన వారి శరీరాలకు విశ్రాంతి అత్యవసరం. సెరంగ్ ద్వీపవాసులు — పగటి పూట ఏఅటవీ ప్రదేశంలోనో మన్మథ క్రియ జరుపుతారు.

ఐతే యీ పద్ధతుల్ని నేటి ఏపట్టణంలోనూ ప్రవేశపెట్టటం అసంభవమే! రతి జరిగాక కొంత విశ్రాంతి, నిద్ర అవసరమనే విషయాన్ని కూడా వైద్యశాస్త్రం అంగీకరిస్తుంది. కనుక రాత్రి మొదటి గంటల్లో కాక, తెల్లవారు జాము కాలం రతికి చాలా అనుకూలమైనదిగా గుర్తించవొచ్చు. "రాత్రి పూట చీకట్లో సృష్టి కార్యం జరగటం కేవలం పశువాంఛను తీర్చుకోవటం లాటిది. సూర్యకాంతిలోనే గర్భం రావాలి. ప్రణయం పొంగి పొరలే వారి మధ్య పట్టపగలు జరిగే రతి అత్యంత ఆనందాన్నిస్తుంది" అన్నాడు మిచ్‌లెట్.

పై విషయాన్ని మేధావులంతా వొప్పుకున్నారు. పగలల్లా పని చేసివుండటం వల్ల అలసిపోయిన శరీరం ఎంతత్వరగా విశ్రాంతితీసుకుందామా అనే లెక్కలో వుంటుంది. ఇక కృత్రిమ సాధనాలద్వారా కామేచ్ఛ కలగటం, లేదా స్వభావ సిద్ధంగా ఆ కోర్కె కలిగినప్పటికీ — ఆ సమయంలో నిర్వర్తించబడే దాంపత్య క్రియనుంచి శరీరం వెంటనే విడుదలయేందుకు ప్రయత్నిస్తుంది. అలసివున్న కండరాలు, నరాలు, గ్రంథులు త్వరగా వీర్యాన్ని వెడలగ్రక్కి స్వేచ్ఛను పొందేందుకు ప్రయత్నిస్తవి. శీఘ్రస్కలనవ్యాధికి గురయేందుకు రాత్రి మొదటివేళల్లో జరిగే రతి కొంత కారణం. దాంపత్యం ఏ తెల్లవారుఝామునో జరిగినట్టయితే పైన పేర్కొన్న ఇబ్బందులుండవు. శరీరం తగినంత విశ్రాంతిని పొందివుండి, ఎంతో ఉత్సాహంగా వుంటుంది. శీఘ్రస్ఖలనవ్యాధినుంచి దూసుకు కేందుకు రతి జరిగే కాలాన్ని మార్పు చేసుకోవటం ఒక చిటకా. ఆ తెల్లవారుకట్ట కాలకృత్యాలు దీర్చుకొని దాంపత్యం నిర్వర్తించబడితే దంపతులిద్దరూ తృప్తిపడే అవకాశం ఎంతైనావుంది.

ఆనాదినుంచీ రతికి సూర్యోదయకాలం అత్యుత్తమమని గ్రీకులు నమ్మారు. దక్షిణసముద్రతీర వాసులు తెల్లారుకట్ల దాంపత్యం నిర్వర్తించబడేందుకు చాలా అనుకూలమైన సమయంగా గుర్తించారు. ఆధునిక మేధావులు కూడా యీ విషయాన్ని ఒప్పుకున్నారు. రేబడ్ అనే ఆయన తెల్లారు కట్ల సమయంలో జరిగే రతిలో ఎక్కువ ఆనందం వుంటుందని, సాయంత్రం కోర్కె ఎక్కువగా వున్నా, ఆనందం తక్కువనే అభిప్రాయాన్ని వెల్లడించాడు.

ఒసియాండర్ కూడా పగటిపూట మొదటిగంటల్లోని రతిని సలహాచేశాడు. వెనెట్ అనే ఆయన గత శతాబ్దంలో రతికి అనుకూలమైన సమయాన్ని గూర్చి చర్చిస్తూ ఇలా అన్నాడు: "వాంఛనుబట్టి రతి జరగటం అత్యుత్తమమైనప్పటికీ, అందగత్తె దీపాల కాంతిలోకన్న సూర్యకాంతిలో తన అందాన్ని పరిపూర్ణరూపంలో ప్రదర్శించ గలుగుతుంది కనుక సూర్యోదయం అత్యుత్తమ సమయం." మరి కొంత మంది రాత్రిసమయమే స్వభావసిద్ధమైన అనుకూల సమయంగా గుర్తించారు. వారిలో కొంతమంది అప్పుడప్పుడైనా తెల్లవారుఝామున దాంపత్యం జరగటం మంచిదనే సలహాను ఇచ్చారుకూడాను.

మరికొంతమందికి—సూర్యరశ్మి, ప్రకృతి రతికి అత్యవసరమనే నమ్మకంవుంది. మన పురాణాలు, శృంగార కావ్యాలూ, ఇతిహాసాలూ, కథలూ తీసినట్లయితే—ఉద్యానవనం, ప్రకృతి సౌందర్యం, హాయిగా మెల్లగా వీచే మలయమారుతం, ఇంపైన సూర్యరశ్మి మొదలైనవి శృంగారానికి ముఖ్యాంగాలుగా మనకు కనిపిస్తవి. కొన్ని కొన్ని జాతుల్లో దివారతి అతి ముఖ్యమైనదిగా, మతైకమైన ప్రాముఖ్యతతో కూడిన ఆచారాలద్వారా తెలియవొస్తోంది.

ఆస్ట్రేలియానుంచి ఒకానొక విలేఖరి ఇలా రాస్తున్నాడు: "సిగ్గుపడుతూ భయపడుతూ చీకట్లోనే సృష్టికార్యం జరపటం నేటికీ ఆచారంగానే వున్నప్పటికీ, మానవ శ్రేయస్సు కొరకు కొన్నాళ్ళకైనా ఏ మతైకమైన ఆచారంగానో, వసంత ఋతువులో పట్టపగలు—ప్రకృతి శోభలో దాంపత్యం నిర్వర్తించబడుతుందనే నమ్మకం నాకు వుంది. క్రమంగా మానవజాతి విజ్ఞానాన్ని సంపాయిస్తుంది; అందరూ సౌఖ్యమయమైన మంచి జీవితాల్ని గడిపేందుకు అలవడుతారు. గతంలో జరిగిన చరిత్రను గూర్చి ఆయా ఫలితాల్ని గూర్చిన జ్ఞానం వారికి వుంటుంది. మూఢనమ్మకాల విలువను వారు గుర్తిస్తారు. కనుకనే వసంత ఋతువులో, ప్రకృతిలోనే కలిసిపోయి సృష్టి విస్తరణ కార్యం నిరాటంకంగా సాగటమనేది ఏమతైక నిబంధనగానూ వారంతా ఒప్పుకొని, అమలు జరుపుతారు. అప్పుడప్పుడు యీ పవిత్రమైన, సర్వాంగ సుందరమైన ఘట్టాన్ని నేను చూడగలుగుతున్నాను; కాని దాన్ని వర్ణించటంవల్ల ఆసౌందర్యం చెడుతుందేమోనని శాభయం! జ్ఞాపకం ఉంచుకోలేనంత సౌందర్యమది!

మానవజాతిలో ఇమిడి వున్న సౌందర్యం, ఆనందం, ప్రణయం — ఇవన్నీ కూడా వసంత ఋతువులో మిన్నుముట్టుతవి. భూమి స్వర్గంగా మారినట్లయితే — సుందరమైన యువతీ యువకులు, ఏలోయలోని ప్రకృతి సౌందర్యంలోనో ఐక్యమై, కొన్ని వేలమంది సమక్షంలో దాంపత్యాన్ని నిర్వర్తిస్తారు. రోజుల పర్యంతరం యీ పవిత్ర కర్మ కాండ — యజ్ఞమే జరుగుతుంది. వెచ్చని సూర్య రశ్మి, చెట్లమీద, నీటిమీద, పూలమీద, పర్వత శిఖరాలమీద ప్రతిఫలిస్తూ, మానవుని శరీరంమీద, జుట్టుమీద, ప్రకాశిస్తూండగా, యువతీ యువకులు పీల్చి వొదిలే గాలిలోని పరిమళంతో ఆ లోయ అంతా ఆరోగ్యకరమైన, పవిత్రమైన వాతావరణాన్ని పొందుతుంది. నువ్వూ నేనూ ఆ అతి సుందర దృశ్యాన్ని చూడలేకపోవొచ్చు; కాని ఆ దృశ్యాన్ని తయారు చేసేందుకు సహాయ పడగలం."

యీ పైవాక్యాలవల్ల సర్వసామాన్యమైన అభిప్రాయం సెక్సువిషయమంటేనే భయపడి, సిగ్గుపడి దాన్ని నీచంగా చూడాలనే భావనమీద యెలాటి తిరుగుబాటు జరగగలదో అర్థమవకపోదు. ఇలాటి అభిప్రాయం యే కొద్దిమందికో ఉన్నాదనటం అబద్ధం. సరైన విజ్ఞానం, సంస్కారం ఉన్న ప్రతివ్యక్తికీ ఇలాటి అభిప్రాయాలు ఏర్పడటంలో వింతేమీ ఉండదు. సమాజపు కట్టుబాట్లు విధిగా అనుసరించితీరవలసిన మూఢనమ్మకాలమీద మానవ విజ్ఞానం దాడిచేడలటం, విజయాన్ని సాధించటం చరిత్రకు కొత్తకాదు.

సృష్టివిస్తరణ కార్యం అతి పవిత్రంగా పరిగణించ బడటం లోకంలోని కొన్ని జాతుల్లో అమల్లోవున్న సాగూజికాచారాలవల్ల తెలుస్తోంది. రతి కేవలం భగవంతుని సేవకొరకై ఏర్పడింది. కనుకనే రతికి పూర్వమూ, తరువాతా, దంపతులు విధిగా దైవాన్ని ప్రార్థించే ఆచారం నేటికీ కొన్ని జాతుల్లో ఉంది. నాగరికతను విశేషంగా మేసిన నేటి మానవుడు మాత్రం సెక్సుకన్న, ఉదరానికి ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చి భోజనానికి ముందుమాత్రమే ధ్యానిస్తాడు; ప్రణయానికి అతనిదృష్టిలో విలువేలేకుండా పోయింది.

ప్రణయకళలో అతి ముఖ్యాంగమైన రతినిగూర్చిన చర్చ అవసరం. రతి అంటే ద్వేషించటం, కనీసం ఏవగించుకుంటున్నట్టు నటించటం, నిందించి తన గొప్పతనాన్ని ప్రదర్శించ జూపటం మొదలైన దురభిప్రాయాలు మనలోనే చాలామందికి ఉన్నవి. క్రైస్తవ మత ప్రవక్త క్రీస్తు జనన వృత్తాంతంలోనే—అతని తల్లి కన్యాత్వం మొదలైన విషయాలవల్ల—దాంపత్య జీవితం కొలూకు పవిత్ర ఆశయాలు బయటపడేందుకు వీల్లేని పరిస్థితులు ఏర్పడినవి. ఆ తరువాత వైవాహిక జీవితపు ఆశయాల్ని పెంచేందుకు చర్చిప్రయత్నించినా లాభంలేకపోయింది; ఆ పురాతనపు అభిప్రాయాలు యీనాటివరకూ మనమీద ఏదోవిధంగా పనిచేస్తూనే ఉన్నవని చెప్పవొచ్చు. లైంగిక

మైన ప్రణయానికీ, మతైకమైన ప్రణయానికీ గల సంబంధం యెంతో స్వభావసిద్ధంగానే లోకమంతటా విస్తరించి వున్నప్పటికీ వాటినిగూర్చి చర్చించే సాహసం చాలా కొద్దిమందికేవుంది. రతినిగూర్చి ఆలోచించేందుకూ, దాని వున్నతిని గుర్తించేందుకూ ఏనాడైతే నిరాకరణ జరిగిందో ఆనాటినుంచే రతి అంటే ద్వేషభావం ప్రజ్వరిల్ల సాగింది.

ఐనప్పటికీ శాస్త్రానికి ఇలాటి మూఢనమ్మకాలు అడ్డురావు. కామానికి ప్రాధాన్యత నివ్వటంవల్ల మాత్రమే రతి జరగటంలేదు; వైవాహిక జీవితంలో శారీరకమైన ఉపయోగాలుకూడా రతివల్ల లభిస్తవి. లైంగిక సంబంధం ఏర్పడటంతోనే ప్రణయ కళకు పునాది పడిందని చెప్పవొచ్చు. ఇక ఆకళ వృద్ధయేందుకు ప్రకృతి శక్తులన్నీ కూడా సహాయపడ సాగుతవి. కాని మనం ప్రస్తుతం అనుసరించే యీ నాగరికతలో ప్రకృతిశక్తుల సహాయాన్ని దూరంగా వుంచటంవల్ల, అనుకూల వాతావరణం లభించటం లేదు. కాని నిపుణత్వానికి గుర్తుగా ప్రకృతి ఎదురైనప్పటికీ తన కౌశలంతో దాంపత్యాన్ని నిర్వర్తించుకొని పోవటం చాలా కొద్దిమందికే తెలుసు. ప్రణయకళారాధనలో ప్రతిక్షణమూ ఏదో కొత్తవిషయం తెలిసి వొస్తూనే ఉంటుంది; ఇన్నాళ్లూ అర్థంచేసుకో గలిగామనే నమ్మకం ఉన్న యెదుటివ్యక్తినుంచి, తానింకా తెలుసుకోవాల్సింది చాలా ఉన్నదనే భావం కలుగుతుంది; అందుకనే ఆ స్నేహంలో యెన్నో కొత్తవిషయాలు తెలిసి వొస్తూండటంవల్ల అది మరింత బలపడసాగింది. ప్రణయాన్ని రేకెత్తించటంకన్న ప్రణయాన్ని కలకాలంగా ఆరాధించటమే ప్రణయకళ ఆశయం. ఇది కానిపక్షంలో ప్రణయం పతనమవక తప్పదు. ప్రణయం పొందే మార్పులల్లా ప్రణయాన్ని వృద్ధిచేసుకునేందుకే ఉపయోగ పడాలికాని, దాన్ని నాశనం చేసుకునేందుకు మాత్రం కాదు. ఉదాహరణకు—ఎక్సిమో జాతుల్లో భార్యల్ని మార్చుకునే ఆచారంవుంది. ఐనప్పటికీ యెంతమంది ఇతర స్త్రీల దగ్గర సౌఖ్యాన్ని అనుభవించినా, తన భార్యే అందరికన్నా యెన్నోరెట్లు దగ్గరదనే అభిప్రాయం ఎక్సిమోకు కలిగేందుకు ఎక్కువ కాలం పట్టదు. ఇదేవిధంగా వ్యభిచారానికి అలవడిన పురుషుడు—ఇతర స్త్రీలకన్న తనభార్యే యెన్నోరెట్లు దగ్గరదనే సత్యాన్ని కనుక్కోలేకపోడు.

యువతీ యువకులైన దంపతులు-చాలాకాలంగా అస్వభావికమైన విరహాన్ని అనుభవించి, ఆ కాలంలో కోర్కెనూ, తృప్తినీ కృత్రిమంగా చంపుకున్నట్టయితే వారి మధ్య ప్రణయకళారాధనకు అనుకూల వాతావరణం ఉన్నదని చెప్పలేము. దాంపత్య జీవితంలో పెరగవలసిన వారి స్నేహాన్ని నిర్లక్ష్యంగా తప్పుకొని కృత్రిమంగా తమ వాంఛల్ని చంపుకోవటమే అవుతుంది. "వారు దంపతులు. వారు జీవితాంతంవరకూ ఒకరినొకరు ప్రేమించుకోవాలి. ప్రతిరోజూ ఒకరిపట్ల వేరొకరు ఆకర్షించబడి తమ యిష్టాయిష్టాలను నిశ్చయాలను కలుపుకునేందుకే ప్రయత్నించితీరాలి" అన్న ఎల్లిస్ కే మాటలు సత్యదూరం కావు.

ప్రస్తుత నాగరికతలో ప్రతివిషయమూ వ్యక్తిగత మైనదిగానే కనిపిస్తుంది. అందుకనే వ్యక్తిగతమైన అభిరుచులు, అలవాట్లు వింత మనస్తత్వాల్ని బట్టి విషయం రంగు మారుతూంటుంది. తరతరాలుగా వొస్తున్న నమ్మకాలు, ప్రణయం తాలూకు అపూర్వశక్తికూడా ఒకోసమయంలో ఈ వ్యక్తిత్వాన్ని మార్చలేవు. స్నేహితుల మాటల్నీ, అప్పుల సంబాల విషయమై ద్వేషభావంపూని ప్రణయం విశిష్టరూపాన్ని దాల్చకముందే రతిలో పాల్గొనటంవల్ల శాశ్వతమైన దాంపత్య సౌఖ్యానికి దూరమవ వలసి వొస్తోంది.

యీ కారణంవల్లనే దాంపత్య జీవితపు సౌఖ్యానికి గాను దంపతులు వేరువేరు శయ్యలమీద పవళించటం, వీలుంటే వేరువేరు గదుల్లో ఉండటాన్ని మేధావులు సలహా చేస్తున్నారు. వారు వేరువేరు గృహాల్లో ఉండటంవల్ల కూడా ఇబ్బందిలేదు. అతి సౌఖ్యమయమైన దాంపత్యాలు కలిసి మెలసి ఉండటంవల్లనే ఏర్పడినవి; కాని ఆ యీవ్యక్తుల విచిత్ర ప్రకృతులే ఇందుకు కారణమని చెప్పవొచ్చు. కలిసి మెలిసి ఉండటం ప్రణయానికి గొడ్డలి పెట్టనే అభిప్రాయాన్ని బ్లోచ్ వెల్లడించాడు; కాని ఇది సత్యం కాదు; ఆకలయిక ప్రణయాన్ని ఎప్పుడు వినమయం చేయగలుగుతుందంటే— ప్రణయం తగినంత గాఢంగా లేని పక్షంలోనే! పాతుకొనిపోయిన ప్రణయానికి కలిసి ఉండటం మరింత గాఢమైన సంబంధానికి దారి తీస్తుంది.

మధ్యమధ్య విడిపోవటం కూడా ప్రణయానికి అవసరమనే చెప్పాలి; యీ విరహంవల్ల ప్రణయంలో కొత్తదనం, ఉన్నత అనుభూతి, ఆశయం ఏర్పడుతవి. 'విరహం ఆదర్శమైన సౌందర్యాన్ని పెంపొందిస్తుంది' అన్నాడు లాండర్. దంపతులు కొద్ది విరహం తరువాత తిరిగి కలుసుకున్నప్పుడు శోభనపు రాత్రుల్ని తిరిగి చవి చూడటం సర్వసామాన్యం.

మానసిక ఆరోగ్యంమీద చర్చిస్తూ క్లేష్టక్ ఇలాఅన్నాడు; "దాంపత్యం సౌఖ్యమయంగా వుండేందుకని దంపతులు విధిగా కలిసి నివశించనక్కర్లేదు; నిజానికి అడపా దడపా విడిపోతూ, విరహాన్ని అనుభవించి, తిరిగి కలుసుకుంటూండటం వారి సంబంధాన్ని గాఢతమం చేయగలుగుతుంది."

యీ విషయం నిర్వివాదాంశం. మేరీ వులెక్‌స్టాక్‌క్రాఫ్ట్ అనేఆమె అభిప్రాయం ఇది: "వ్యక్తియెదుట లేనప్పుడూ, కష్టాల్లో ఉన్నప్పుడే ప్రణయం స్థిర రూపాన్ని దాల్చుతుంది; అప్పుడే చాలాకాలంగా ప్రణయం భరించదగినదిగా వుంటుంది. ఐతే ప్రణయం అభివృద్ధి కావలసిన వ్యక్తులమధ్య విశేషంగా విరహం ఉండరాదు."

దీన్నిబట్టి వ్యక్తి ఎదుటవుండటంవల్ల ప్రణయానికి ఏవిధమైన ఏ అపాయాలు జరుగుతవో, పరోక్షంలోనే ఉండిపోవటంవల్లకూడా అలాటి ప్రమాదాలే సంభ

విస్తవి. చిరకాలం విరహాన్ని అనుభవించడంలో క్రమంగా నిరాశ, లోకంలోని అనేక ఇతరసంఘటనలతో అనుభవం ఉండటంవల్ల యీర్ష్యకలగటం మొదలైన ప్రమాదాలకు దారితీస్తుంది. ఇక్కడ అనూయనుగూర్చి చర్చించవలసిన అవసరంవుంది; ఎందుకంటే అనూయ, యీర్ష్య, అనుమానంతో కూడిన దృక్పథం — వీటికి ప్రణయ కళ ప్రాథమికమూత్రాలతో సంబంధంవుంది.

భూమిమీది మొట్టమొదటి జంతుజాలం దగ్గర్నుంచీ అనూయ ప్రాథమిక ప్రకృతి సహజమైన ఒక జ్ఞానంవలెనే అభివృద్ధి చెందింది. "ఏదైనా నీకు కావలసిన వస్తువును నీ అధీనంలోనే ఉంచుకునేందుకుగాను, కనబరిచే ఒక రకం భయమే అనూయ" అన్నాడు డెస్క్రాట్స్. జంతువుల్లో తన శత్రువును చూసినప్పుడు తనకన్న ముందుగా ఆ శత్రువే తన గురిని అందుకుంటుందేమోననే యీర్ష్య రేకెత్తటం సహజ గుణంగా కనిపిస్తుంది. ఇలాటిది జంతువుల ఆహార సమస్యలో ఎదురై వుంటుంది; తనకు లేకుండా ఇతర జంతువులు ఆహారాన్ని తీసుకుంటూన్న దృశ్యాన్ని చూస్తూ వూరుకున్న జంతువు అతి త్వరలో నశిస్తుంది. కనుక అది కూడా అనూయపడి మిగతా జంతువులకు అందకుండానైనా సరె ఆహారాన్ని సంపాయించుకునేందుకు ప్రయత్నిస్తుంది.

"విశాలంగా చూసినట్లయితే జీవశాస్త్రంలో అనూయ ప్రాథమిక సహజ సత్యంగానూ, అత్యవసరమైన మానసిక పరిణామంగానూ కనిపిస్తుంది. అనూయ అతి త్వరలోనే కోపంగా మారుతుంది. కోపం ఒక రకం భయానికి పరోక్షరూపం, కనుక అనూయ సామాజికంగా ఎంతో కీడుకు ఉపకరించినప్పటికీ, జంతు ప్రపంచంలో అదెంతో ఉపయుక్తమైంది. ఒక గుంపుమీద ఒక్క జంతువే తిరుగుబాటు చేస్తుంది. సామాజికమైన ఉద్రేకాలు చెలరేగేందుకుగాను ప్రకృతినుంచే అనూయ బయలు దేరిందేమో?" అన్నాడు ఆర్ నాల్డ్.

కేవలం ఆహార సమస్యనుంచే మొదట్లో యీ అనూయ జంతుజాలంలో ప్రవేశించింది. ఒంటరిగా వున్నప్పటికన్న ఇతర జంతువులతో కలిసివున్నప్పుడు యెక్కువ ఆహారాన్ని తీసుకోవటం జంతుజాలంలో చూడదగిన సత్యం; ఆసమయంలో అది ఆకలి తీర్చుకునేందుకే కాదు; ఇతర జంతువులనుంచి సాధ్యమైనంతగా తన ఆహారాన్ని కాపాడుకునేందుకూడా ప్రయత్నిస్తుంది. ఇవేభావాలు జంతుజాలమంతటా సెక్స్ విషయాల్లో కనిపిస్తవి. కుక్కలు మొదలైన పెంపుడు జంతువుల్లో అనూయ యెంత నిశితంగా ఉంటుందో గమనించవొచ్చు.

జంతువుల్లోనూ, అనాగరికుల్లోనూ, పిల్లల్లోనూ, వార్ధక్యంలోనూ, పతనమయే సమయాల్లోనూ, తాగుడు మొదలైన మత్తుపదార్థాలకు విశేషంగా అలవడిన వ్యక్తుల్లోనూ—ఈర్ష్య అత్యున్నత స్థానాల్లో కనిపిస్తుంది. తాగుబోతుల్లో ఈర్ష్య అధికమయ్యేందుకు కారణాలెన్నో ఉన్నవి. తాగుబోతు భార్య తన భర్తను యెంతగా

ప్రేమించినప్పటికీ అతని ప్రవర్తనపట్ల అసహ్యభావాన్ని కలిగి, వేరొక పురుషుని స్నేహంకోసం ప్రయత్నించటం, ఈ సంగతి తెలిసి తాగుబోతు ఎంతో అసూయతో తన భార్యను చంపటం—ఇలాంటి కేసుల్ని మనం యెన్నిటినో వింటూవుంటాం.

ఉత్తమ కళను సృష్టించినవారంతా కూడా అసూయ సామాజికంగానూ, వ్యక్తిగతంగానూ కూడా ఎంత ప్రమాదకరమో గుర్తించి, అది ఒక కుదరనివ్యాధిగానే పరిగణించారు. షేక్స్పియర్ పాత్ర ఒథెల్లో అసూయకారణంగా అనాగరికుడయ్యాడు. కొద్దిమంది రచయితలు సౌశీల్యతరక్షణార్థం అసూయ అవసరమనే వాదనను ప్రవేశపెట్టారు కాని, మొత్తంమీద అసూయ సామాజికంగా ప్రమాదకరమైనదని మాత్రం చెప్పకతప్పదు. అసూయఫలితంగా ఎన్నో దారుణహింసాకాండలు జరుగుతవనే సత్యాన్ని ఒప్పుకుంటూ గెసీల్ అనేఆయన_లైంగికనీతిని కాపాడేందుకు అసూయ అవసరమనే ధోరణిని కనబరిచాడు. ఎల్లెన్ కే ఇలా అన్నాడు; "ప్రణయారంభంలో మాత్రమే అసూయ ఉపకరిస్తుంది. దాన్ని పెంచుకోవటంవల్ల దుఃఖమయ జీవితానికి దగ్గరితోవ కనుక్కోవటమే అవుతుంది."

జంతువుల్లోవలెనే – నాగరికత మొదటిరోజుల్లో మానవజాతికి అసూయ కొంతవరకూ మేలునుచేసివుండొచ్చు. కాని నాగరికత పెంపొందసాగాక కూడా అసూయవల్ల సామాజికంగా మేలుజరుగుతోందనుకోవటం శుద్ధపొరపాటు. ప్రాథమికమైన మరికొన్ని ఉద్రేకాలు – ఉదాహరణకు భయం, కోపం మొదలైనవాటిని పెంపొందించటం అనాగరికలక్షణమని చెప్పవొచ్చు; పైపెచ్చు వాటిని భరించేందుకు తొక్కిపట్టేందుకు నాగరికత ప్రయత్నించ వలసి వుంటుంది.

మిస్ క్లాపర్టన్ అసూయమీద చర్చిస్తూ ఇలా అంది : "అసూయ స్త్రీ కౌశల్యాన్ని బోధించేందుకు ఉపయోగ పడుతూన్నప్పటికీ, స్త్రీ బానిసత్వాన్ని కూడా ప్రబోధించింది కనుక, దాన్ని రూపుమాపుకోవాల్సిన అవసరంవుంది. ఇది జరగకపోతే ఆ సమాజంలో నాగరికత నశిస్తోందని చెప్పక తప్పదు."

ఫోరల్ ఇలా అన్నాడు. "అసూయ–విరుద్ధభావాల పరిణామం. మరీ లైంగిక విషయాల్లో అసూయ చాలా ప్రమాదకరమైంది. మన జంతుజాలం తాలూకు పూర్వీకుల నుంచి అసూయ మనదాకా వచ్చింది. వైవాహిక ధర్మాల్ని అతిక్రమించిన భర్త, అసూయాపరుడైన భర్తకన్న యెన్నుకోదగ్గవాడు. ఒకోసందర్భంలో న్యాయసమ్మతమైన అసూయనుగూర్చి వింటుంటాం. కాని అసూయ యేవిధంగానూ సమ్మతించదగ్గది అవనేరదు. అది ఒక రోగగ్రస్తమైన ఉద్రేకమని చెప్పవొచ్చు. పశుజ్ఞానానికి సంబంధించిన అనాగరిక ఉద్రేకంగా అసూయను గుర్తించాలి. వంశపారంపర్యా కానీ, పుట్టిపెరిగిన వాతావరణ మహాత్య్యంవల్ల కానీ అసూయాపరుడైన వ్యక్తి తన జీవితాన్ని తన కుటుంబీకుల జీవితాల్ని కూడా విషమయం చేస్తాడు. అలాటి వ్యక్తులు వివాహమాడకుండటం మంచిది. మనకు ఇవ్వబడే శిక్షణ, విద్య, సంస్కారం—అన్నీ కూడా సాధ్యమైనంతగా అసూయను బుర్రలోకి రానీకుండా పాటుపడాలి."

అనూయవల్లనే గృహంలో శాంతినిలుస్తుందనే అభిప్రాయాన్ని ఖండిస్తూ ఇరిక్ గిల్లార్టీ ఇలాఅన్నారు: "అనూయవల్లనే దాంపత్యంలోని శాంతి నశిస్తుంది. అహంభావత్వం హెచ్చుపెరిగి, తరతరాలుగా వొస్తూన్న మూఢనమ్మకాల బలిమివల్ల అనూయ పెంచబడుతుంది. అనూయ ఏవిధమైన ఇతరఆలోచనలకూ తావివ్వక తన శాంతితోపాటు, తన చుట్టుపట్లవున్న వ్యక్తులశాలూకు శాంతినికూడా భగ్నంచేస్తుంది. కాని నిజమైన ప్రణయంముందు, అనూయ పారతికర్పూరమవ్వాలి. అనూయ సామాజికంగా కలిగించే కీడును లెక్కచేయకపోవటం పొరపాటు. స్వర్గసమానమవవలసిన ఎన్నో కాపరాలను అనూయ నరకసమానమే చేస్తుంది. ఆత్మహత్యలకు తాగుడుఅలవాటయేందుకు, నిర్లక్ష్యంగా అతిగా ప్రవర్తించేందుకు — చివరకు పిచ్చి ఎక్కేందుకు అనూయ గొప్ప కారణంగా చరిత్రఅంతటా కనిపిస్తుంది. అనూయాపరుడైన భర్త, అతని భార్యవంక చూసిన ప్రతిపురుషుడూ ఆమె శీలాన్ని అపహరించినట్టే భావిస్తాడు; వేరొకభర్త తన భార్య స్నేహితురాండ్రపట్ల కూడా తన అనూయను ప్రదర్శిస్తాడు; ఇంకోభర్త భార్య పిల్లలపట్ల చూపే శ్రద్ధకు అనూయ వహిస్తాడు. ఇదేవిధంగా అనూయాపరురాలైన భార్య భర్తస్నేహితుల్ని — చివరకు భర్తపెంచే పెంపుడుకుక్కను సైతం యీర్ష్యతో చూస్తుంది. వ్యక్తిలోని ప్రతిభాగమూ ప్రతి భావమూ తన సొత్తుకానిదే ప్రణయంలేదనే అభిప్రాయాన్ని వెల్లడించటంతో అనూయకు ప్రాముఖ్యత హెచ్చుతోంది. ప్రేమించే వ్యక్తినితప్ప వేరొక వ్యక్తి ప్రస్తావనకూడా పనికిరాదనే ధోరణి కనిపిస్తుంది. పాతస్నేహితుల్ని వొదులుకోవాలి; కొత్తవాటికోసం ప్రయత్నించరాదు — గృహంలో శాంతి నిలబడేందుకు అనుసరించాలిసిన విధానం ఇది!"

లైంగిక విషయాల్లో అనూయత నాగరికతలో అభ్యుదయంకోసమై ఉపకరించే ఉద్రేకంగా ఉన్నప్పటికీ అది పైపూతగా మాత్రమే ఉండిపోతోంది; దీన్నిబట్టి నిజానికి దానివిలువ బహుతక్కువ. అనూయాపరుడైన వ్యక్తి ప్రేమించబడలేదు; లేదా తక్కువగా ప్రేమించబడుతాడు. అనూయవల్ల అనూయపడే సంఘటనలు ప్రోత్సహించబడుతవి. అందువల్ల కృత్రిమమైన జీవనం, కపటంతో ప్రవర్తించటం జరుగుతుంది.

అనూయ కారణంగా భగ్నమైన ప్రణయాలు, విచ్ఛిన్నమైన అనేకదాంపత్యాలు మనకు తెలిసే ఉన్నవి. ఇక్కడ పెప్పిస్ కుటుంబంలో అనూయ ప్రవేశించి ఏ విధంగా పరిణమించిందీ, అతని డైరీనుంచి గ్రహించవొచ్చు. యీ సంఘటనలు సర్వసామాన్యమైనవిగా మనం గుర్తించగలం. పెప్పిస్ దాంపత్యజీవితం తాలూకు సంఘటనలు కొన్ని యీ క్రింద ఇవ్వబడుతూన్నవి. అతని 36.వ సంవత్సరంలో సంగతి.

16వర అక్టోబర్ 25 వ తారీకు: డెబ్ అనే ఇంటిలోని పనికత్తె నాకు తల దువ్వుతోంది. ఏదో ఉద్రేకంలో నేను ఆమెను కావిలించుకోవటం నాభార్య కంట పడింది. ఈ సంఘటన నా భార్యకు ఎంతో దుఃఖహేతువైంది. నేనూ, డెబ్ కూడా

జరిగిందానికి హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడి యెంతో విచారించాం. కాని నా భార్య తన పట్టును విడువకుండా కోపంతో ప్రజ్వరిల్లింది... యీ నెలంతా నేను ప్రతిరోజూ, జరిగిన పొరపాటునుగూర్చి విచారిస్తూనే వున్నాను. కొన్నాళ్ళ తరువాత—

నాకు కొద్ది మనశ్శాంతి చిక్కింది. నేను చేసినదానికి సిగ్గుపడ్డాను, నా భార్య విచారాన్నిచూచి బాధపడ్డాను. పాపం—ఆ పనికత్తె స్థితికూడా జాలికొలిపింది.

నవంబర్ 6 : ఆ దుర్ఘటన తాలూకు విచారం కొంత తగ్గింది. నా భార్యే నాకు సేవచేయ నారంభించింది. డెబ్ మీదా, నామీదా ఒక కన్ను వేసివుంచింది.

నవంబర్ 9: మెల్లిగా ఒక కాగితంమీద విషయాన్ని రాసి డెబ్‌కు అందించాను. నేను డెబ్‌ను ముద్దు పెట్టుకున్నా ననటం అబద్ధమని ఇంకా పట్టుదలగా వాదిస్తున్నానసీ, అలాగే డెబ్ కూడా మాట్లాడటం మంచిదనీ ఆమెకు ఆదేశించాను. యీ అబద్ధాన్ని క్షమించమని దేవుడ్ని ప్రార్థించాను. యీ అసత్యం వల్ల డెబ్‌కు ఎంతో ప్రమాదం వుంది. ఆమె జీవితంలో మరి శాంతి వుండదు. ఇక్కడ మా అందరి జీవితాలూ కూడా దుఃఖమయ మౌతవి. నేను రాసిన చీటిని చదువుకొని నేను కోరినట్టుగా నా చీటీని నాకు పారేసింది.

మర్నాడు: ఏదెలా జరిగిందో కాని డెబ్‌ను నేను ముద్దుపెట్టుకున్నట్లు నా భార్య దగ్గర డెబ్ ఒప్పుకుంది. కొన్ని రాత్రుల వరకూ నాకూ నాభార్యకూ నిద్ర లేదు. ఇద్దరమూ ఎవరి గదుల్లో వాళ్ళం విచారిస్తూ ఉండిపోయ్యాం.

నవంబరు 14: డెబ్ వేరొక చోట పని చూసుకుంది. నాభార్య కాపలా వేసి ఉండటంవల్ల డెబ్‌ను నేను తిరిగి చూడలేక పోయ్యాను. మా దాంపత్య జీవితంలో దుమారం చెలరేగేందుకు డెబ్ కారణ మైనప్పటికీ— ఆమె మీద ఎంతో అభిమానం నాలో ప్రజ్వరిల్ల సాగింది. మర్నాడు ఆమె వెళ్ళి పోతుందనగా— ఎలాగైనా ఆమె కన్యాత్వాన్ని అనుభవించాలనే వాంఛ నాలో ప్రబలింది. యీ సంఘటన జరుగుతే నా భార్య శాశ్వితంగా నాకు అధికారిణి అవుతుంది. నేను బానిస బతుక్కు గురవుతాను. ఐనప్పటికీ మా మధ్యవున్న ప్రణయం సన్నగిలే అవకాశం లేదు. డెబ్‌ను ముద్దుపెట్టుకున్న సంఘటన జరిగాక ఒకవిధంగా మా దంపతులమధ్య వున్న ప్రణయం పెచ్చుమీరింది. దాంపత్య జీవితంలో ఇది వరకు యెన్నడూ చవి చూడనంత ఆనందాన్ని ఉభయులమూ ఆనందించాము.

మర్నాడు ఆదివారం. సోమవారంనాడు డెబ్ ఎక్కడ వున్నదో విచారించసాగాను. 18. నవంబర్‌న ఆమెను పట్టుకోగలిగాను. ఆమెను బండిలో ఎక్కించుకొని ముద్దాడాను. 'ఇలాటి అవకాశాన్ని యెవరికీ ఇవ్వద్దు. నీ శీలాన్ని కాపాడుకోవటం నీ విధి' యీరకం సలహాల్ని యిచ్చాను. నన్ను కనుక్కునేందుకు సులువైన సూత్రాన్ని ఆమెకు చెప్పాను. అంతా సక్రమంగా, తృప్తికరంగా జరిగిందని నమ్మాను.

కాని ఆమర్నాడే యీ సంగతంతా .నా భార్యకు తెలిసిపోయింది. మొదట్లో అదంతా అబద్ధమని వాదించాను, కాని చివరకు వొప్పుకోక తప్పిందికాదు. ప్రణయం

ప్రళయరూపం ధరించింది. ఈ సమయంలోనే నా భార్య విడాకులిస్తానని బెదిరించి, నన్నెంతో భయపెట్టింది. డెబ్‌ను గూర్చి తలచరాదని నిశ్చయించుకొని భగవంతుని మీద ప్రమాణం చేసుకున్నాను. నేను డెబ్‌ను ప్రేమించటంలేదనీ, ఆమెవొక వ్యభిచారిణికన్న హీనురాలనీ, అందుకని ఆమెను ద్వేషిస్తున్నాననీ—విధిగా నాభార్య బలవంతంమీద డెబ్‌కు ఉత్తరం రాశాను. ఇదిగాక, నే నెప్పుడైనా బైటికివెళ్తే నన్ను నీడనలె గుమాస్తా వెంటాడేందుకు నా భార్య ఏర్పాటు చేసింది.

ఆ తరువాత పెప్పీస్‌కు కంటి జబ్బు రావటంవల్ల డైరీ రాయ బడలేదు. కాని పైకథనంలో — ప్రేమించే భార్య, ప్రతీకారం తీసుకునే స్త్రీమూర్తిగా తయారవటం గమనించదగ్గ విషయం. భర్త ఆమెకు విరోధిగా తయారయ్యాడు; యీవిధంగా ఆమె తన ఆనందాన్ని పాడు చేసుకొని దాంపత్య జీవితంలోని చిచ్చును ప్రజ్వరిల్ల చేసింది. దాంతో పాటే భర్తను మరింత దూరం చేసుకొనిపోతూ, తనకు తెలియకుండానే భర్తను డెబ్ వైపు మళ్లించే ప్రయత్నాలు చేసింది; ఇందుకు అతని పట్టుదల కూడా పెంపొందే అవకాశం ఏర్పడింది. కాని ఆ దంపతుల్లో ఎవరూ కూడా ముందు జరగబొయ్యే విషాద ఫలితాల్ని గూర్చి ఆలోచించలేదు. ప్రతివొక్కరూ బాధపడ్డారు; పశ్చాత్తాపంతో విచారించారు. పరిస్థితినిబట్టి భర్త భార్యకు లొంగివున్నట్లు నటించినప్పటికీ, అతని ఆలోచనలన్నీ ఆమె ఏర్పరిచిన బంది ఖానానుంచి దూసుకొని డెబ్‌ను చేరాలనే ధోరణిలోనే పనిచేసినవి. అంత మాత్రం చేత ఆ దంపతులు విడాకుల్ని కోరలేదు; వారి మధ్య దాంపత్య బంధం దృఢంగానే వుంది. ఒక పక్క అవిశ్వాసం జరిగింది; వేరొకపక్క బలవంతాన శీలం కాపాడబడే ప్రయత్నం జరిగింది. ఏమైనా వారి దాంపత్యం కుంటి నడక సాగించక తప్పలేదు.

అసూయ ఎంత బలీయమైన ఉద్రేకమైనప్పటికీ, అది ఎంత మందికి అపాయకరంగా పరిణమించినప్పటికీ సామాన్యంగా నాగరికతకు సంబంధించిన అభిప్రాయాలను అది విషతుల్యం చేయగలదని మాత్రం నమ్మకంగా చెప్పగలం. సెక్స్ సమస్యలకూ, ఇతర సమస్యలకూ చాలా దగ్గరి సంబంధంవున్నది. అంతేకాని సెక్స్ సమస్యలనేవి ప్రత్యేకించి ఏ కొద్దిమంది వ్యక్తులకో సంబంధించినవి కావు. ఆ సమస్యలన్నిటికీ సామాజికమైన విలువవుంది. పోతే అసూయవల్ల మేలుకన్న కీడే సంభవించే అవకాశాలున్నవి కనుక సంస్కారం పొందవలసిన జాతిలో దాన్ని రూపుమాపుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. నైతికంగా జాతి ఉన్నతస్థాయికి పోవాలంటే వ్యక్తిగతమైన ఆదర్శాలు, ఉద్రేకాల్ని స్వాధీనంలో వుంచుకోగలగటం, అదే విధంగా ఇతరుల అనుభూతుల్ని, గౌరవించగలగటం మొదలైనవి పెంపొందించుకోవాలి. పైపెచ్చు ఒకవ్యక్తి వేరొక వ్యక్తికి బానిసగా ఉండనక్కర్లేదు; అందుకని ఒక వ్యక్తి అధికారాన్ని చలాయించ జూడటం నాగరికతకే దెబ్బ, అసూయ ఉండటమంటే దాంపత్యజీవితం తాలూకు హక్కుల్ని భగ్నం చేసుకోవటమే అవుతుంది.

—ఇంకావుంది




రచన: చాదేశ్వరీదేవి

ఇవాళ వరలక్ష్మి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. వరలక్ష్మి దగ్గిర్నించి వుత్తరం వచ్చినప్పుడల్లా నా హృదయ మెందుకో బాధపడుతుంది. ఒక క్షణమైనా వరలక్ష్మి నన్ను 'మరిచిపోయినట్లు కనపడలేదు.

కాలేజీలో చదువుకునే రోజుల్లో దాని పరిచయం కలిగింది. ఒక సంవత్సరమే ననుకుంటాను మేమిద్దరం కలిసి చదువుకున్నది. ఆతరవాత అది నలభై రెండు ఆగష్టు విప్లవంలో అన్నకు తోడుగా రాజకీయాల్లో పాలుపంచుకుని కాంగ్రెసు వుద్యమానికి ఎన్నోరకాల పాటు బడింది.

మొట్ట మొదట్నుంచీ నాకీ రాజకీయాలు; అందులోనూ కాంగ్రెసు 'సత్యాగ్రహం' పేరుతో జరిపే వుద్యమాల వల్ల దేశానికి స్వరాజ్యం వస్తుందనే సిద్ధాంతం మీద బొత్తిగా నమ్మకం లేకపోవడంచేత దూర దూరంగా వుంటూ వచ్చాను. కాని, వరలక్ష్మికి మాత్రం కాంగ్రెసు మీద, కాంగ్రెసు నాయకుల మీద అమితమైన నమ్మక ముండడంచేత అన్నతో పాటు అది చదువు వొదిలిపెట్టి బ్రిటిషు సామ్రాజ్యం మీదకి విప్లవాన్ని నడిపించింది.

మేమిద్దరం కలిసి చదువుకున్నది పన్నెండు నెలలైనప్పటికీ వరలక్ష్మి హృదయం మాత్రం ప్రత్యేకమైన తరహాకి చెందిందని తెలుసుకోగలిగాను.

ఒకనాటి సాయంకాలం సినిమాకు వెళ్దామనుకుని ముస్తాబు చేసుకుంటుండగా గబగబా నా గదిలోకి వచ్చి "ఎక్కడికే ఈ ముస్తాబు?" అన్నది.

"ఏం?" అన్నాను.

"నారాయణరావు తెలుసుకదూ?"

"ఎందుకూ?"

"చెబుతానుగా"

"ఏమిటే?"

"ప్రొద్దుణ్నుంచి తంటాలుపడి అటూ ఇటూ తిరిగి నేను చూస్తుండగా వుత్తరం పడేసి తీసుకోమని సైగ చేశాడు"

"ఎవరూ?"

"ఆడేనే మన కాలేజీ నాటకాల్లో వేషాలు వేస్తుంటాడు అతను."

నాకళ్లు గిర్రున తిరిగాయి. పధ్ధెనిమిది సంవత్సరాల జీవితంలో కాలేజీలో నన్నాకర్షించిన నారాయణరావు అక స్మాత్తుగా వరలక్ష్మి వెంటపడి వుత్తరాలు కూడా రాస్తున్నాడని విన్నప్పుడు నిజంగా నాకళ్ళు గిర్రున తిరిగాయి. నేనేమీ మాట్లాడలేక పోయాను.

"బ్బ...బ్బ...బ్బ...! ఏంరాసాడు! జీవితంలో నాలాంటి ఆడది అపురూప మట! సౌందర్యాన్నంతా పోగుచేసి బ్రహ్మ నన్ను సృష్టించాట్ట...!" గది అదిరేట్లు నవ్వింది.

నేనిప్పటికి చాలా అమాయకు రాలి నని తెలుసుకోగలిగాను. నా ప్రేమతో నారాయణరావు మనసుని కట్టి సుఖంగా కాలాన్ని గడుపుకుంచా మనుకోవడం ఇక అసంభవం. మగవాడి మనసు చాలా తేలికనీ, క్షణక్షణానికీ అది మారిపోతుం దనీ నేనిప్పటికి తెలుసుకోగలిగాను.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్ ?" అంది వరలక్ష్మి.

"ఏమీ లేదు—"

"ఉత్తరం చూస్తావా ?"

"చూడడం ఎందుకులే."

"ఏం ?—"

"నువు చెబితే కాదన్నానా ?"

"అయితే విను."

"సినిమాకి వెళ్ళే ముందు నాకీ సోదంతా ఎందుకే." అన్నాను.

"సినిమాకా!"

"ఆ—"

"వెళ్లేందుకు వీలులేదు."

"ఏం?—"

"చెబుతానుగా"

"ఏమిటీగోల—"

"గోలతోనే మనం ఇవాళ నారా యణరావు పనిపట్టాలి."

అర్థంకాక వెర్రిగా దాని మొహం లోకి చూసాను.

"ఏమిటలా చూస్తావ్? నువ్వివాళ సినిమాకి వెళ్తానంటే నేనొప్పుకోను"

"ఏంచేస్తావేం?"

"నా ప్రేమలో నువ్వివాళ భాగం పంచుకోవాలి!"

వరలక్ష్మిదో నాగొంతు మీదికి తెచ్చేట్లుగావుంది. నాన్నకీ, అమ్మకీ ఈవిషయం తెలిస్తే నాచదువు కటువంటి నిర్భంధం ఏర్పడుతుందో వూహించుకో గలిగాను. కానీ, వరలక్ష్మితో మాత్రం ఏమీ అనలేక పోయాను.

నాభయాన్నీ, బాధనీ ఏవిధంగా అర్థంచేసుకుందో ఏమో "ప్రియురాలా, వరలక్ష్మి! కాలేజీలో నిన్ను చూస్తున్న కొద్దీ, నా మనసదో విధమైన వుత్సాహంతో నిండిపోతూ వుంది. సౌందర్యాన్నంతా పోగుచేసి బ్రహ్మ నిన్ను సృష్టించాడు...జీవితంలో నీలాంటి ఆడదాన్ని కలుసుకోవడం గొప్ప అదృష్టం! నామన సంతా నీపాదాలముందు పెట్టి, తప్పకుండా రేండో సినిమాకి రమ్మనమని వేడుకొంటూ, వువ్విళ్లూరుతున్నాను. నీ ప్రియుడు, నారాయణ్"

ఉత్తరం లోంచి అది పూర్తిగా ముఖాన్ని బైటికి పెట్టక ముందే "అయితే

ఇంతకూ నన్నేం చేయమంటావే?" అన్నాను.

వరలక్ష్మి కొంచెం తికమకపడి "ఏముంది. రెండో ఆటకి మనం వెళ్దాం. అందుకనే నేనొచ్చాను" అన్నది చివరికి.

"మగవాణ్ని మనం ఏంచేయగలుగుతామే? నీదంతా ఆఖరికి వృథా ప్రయాసవుతుందేమో!" అన్నాను.

"నేనొకటి చెబుతాను. నువ్వేమీ అనుకోవు గదా?" అన్నది సిగ్గుపడుతూ.

"నువ్వేం చేయదలుచుకున్నావో పూర్తిగా నాకు తెలియక పోతే నేను వచ్చినందువల్ల ప్రయోజనం ఏముంది?"

"అభయం నీకేమీ అవసరం లేదు. మనం హాలు దగ్గరికి వెళ్లడం ఆలస్యం—నారాయణరావు టిక్కెట్లు తెస్తాడు. లోపలికి వెళ్లి కూచున్న తర్వాత, అతను నాపక్కన కూర్చుంటే — నేను లేస్తాను. నువువచ్చి మెల్లగా అతనిపక్కన కూర్చో. ఆ తరవాత నే నాడవలసిన నాటకం ఆడతాను." అని వరలక్ష్మి యెన్నోవిషయాలు చెప్పింది.

నాకు దానిమాటలన్నీ చాదస్తంగా కనిపించినయ్. నేనేం మాట్లాడాలో తెలీలేదు. ఒప్పుకున్నాను. అలానే ఇంట్లో ఏదో వంకచెప్పి—రెండోఆటకి వెళ్ళాను.

వరలక్ష్మి చెప్పినట్లు నారాయణరావు దానికోసం ఎదురుచూస్తూ. హాలుముందు నిలుచున్నాడు. యాభైగజాల దూరంలో నారాయణరావుని చూసి "చూశావా! నాకోసం ఎలా ముస్తాబై వచ్చాడో! చదువుకుంటున్నప్పటికీ వీళ్లకి దుర్బుద్ధులు పోవుసుమా" అన్నది వరలక్ష్మి.

ఏదో ఆలోచించుకుంటూ నడుస్తున్న దాన్నల్లా హాలువేపు చూశాను. హాలు ముందు ఎలక్ట్రిక్ లైట్ల కాంతిలో సిగరెట్ కాలుస్తూ నారాయణరావు నిలబడి వుండడం కనిపించింది.

నేనేమీ జవాబు చెప్పకుండా వరలక్ష్మి వెంటనడుస్తున్నానేగాని మనసంతా ఎందుకనో బాధపడటం మొదలుపెట్టింది.

ఏం లాభం? —

వరలక్ష్మి ఆలోచనా, ఉద్దేశమూ నెరవేరలేదు. హాలుముందుకు వెళ్ళేప్పటికల్లా—నన్నుచూసి మెల్లగాజారుకున్నాడు నారాయణరావు.

"ఇప్పటిదాకా ఇక్కడే నిలబడిన నారాయణరావేడీ?" అంది వరలక్ష్మి ఆశ్చర్యంగా.

నేను నవ్వుతూ "ఏమోనే నాకేం తెలుసు?" అన్నాను.

"చాలా ఆశ్చర్యంగావుందే. ఒక్కసారే తమాషాగా మాయమైపోయాడేమిటి?"

"ఎక్కడికన్నా వెళ్ళాడేమో; కొంచం సేపు నిలుచుందాం" అన్నాను.

ఎంతసేపు నిలుచున్నా నారాయణరావు రాకపోయేప్పటికి "నువ్వున్నావని జారుకున్నాడేమోనే!" అన్నది వరలక్ష్మి.

మొత్తంమీద మేము సినిమా చూడకుండానే ఇంటికి తిరిగి వచ్చాం. ఆ రాత్రల్లా నాకు నిద్రపట్టనేలేదు. ఎందుకనో గాని చాలాసేపు ఏడ్చాను.

ఆ తరువాత ఇంకోసారి ఇటువంటి విషయాన్నే వరలక్ష్మి బైటపెట్టింది.

దాంతో నాకు నారాయణరావుమీద వున్న కొద్దిపాటి అభిమానమూ—ప్రేమా తుడుచుకపోయినయ్.

"నీకు తెలియదులేవే యీ మగవాళ్ళంతా ఇంతే! చేపల్ని పట్టేందుకు ఎరల్ని ఏవిధంగా ఉపయోగిస్తారో, అదేవిధంగా ఆడది తమ కౌగిట్లోకి వచ్చేంతవరకూ ఏమేమో అంటారు, ఎన్నెన్నో చెబుతారు. వలలో పడిందా—సరే, లేకపోతే కన్నీళ్ళ పర్యంతమై వేడుకుంటూ—చివరికి కాలవలో దూకుతానని బెదిరిస్తారు. వాళ్ళమాటలు, వినయాలు, వేడుకోవడాలు చాలా తమాషాగా వుంటయ్."

వరలక్ష్మి ముఖంనిండా అసహ్యం, జుగుప్సా నిండుకుపోయినయ్. దానిప్రతి మాటా నా హృదయంమీద బాగా హత్తుకపోయింది.

"అయితే- ఇంతకూ జరిగిందేమిటే ?" అన్నాను.

"ఏముంది—నారాయణరావు కలిసి తన గొడవంతా చెప్పుకొచ్చాడు."

"నువులేందే బతకనన్నాడాఏమిటి?"

"అది మామూలేగా! అటువంటి మాటన్నా బతికిపోదును. నేనటువంటి మాటల్ని ఖాతరు చేయనని తెలునుకున్నాడో ఏమో — కనపడడంతో నేనవ్వుతూ దగ్గరికి వచ్చి నీ విషయం ఎత్తాడు."

"ఏమని—?"

"నువ్వేదో ఉత్తరం రాశావని, ప్రేమిస్తున్నావనీ—జీవితంలో ఆయన తృణీకరించినట్లయితే—ఆత్మహత్య చేసుకునేందుకు కూడా వెనుకాడవనీ, ఏవేవో చాలా రాశావటగా ?" అన్నది వరలక్ష్మి.

నా మెదడుకు చుట్టుకున్న గర్వమూ, దురహంకారమూ ఒక్కసారిగా జారిపోయినయ్. నారాయణరావు 'డిబేటింగ్' సొసైటీలో మాట్లాడే 'అభ్యుదయ' వాదనల్ని గురించి, అతని ఉత్సాహాన్ని గురించి, కళాభిలాషని గురించి నేనేమేమో వూహించుకుని ప్రేమించాను గాని, వరలక్ష్మితో మాట్లాడుతూ నామీద తన అసహ్యాన్ని ప్రదర్శిస్తూ ఇంత నీచంగా దిగజారిపోతాడని అనుకోలేదు.

"ఒక ఉత్తరమన్నా చూపించ మనకపోయావా ?" అన్నాను ఇంకేమన్నా చెప్పాడేమో తెలుసుకోవాలని.

"ఆ మాటలు వింటున్న కొద్దీ నా మనసెంతగా మండిపోయిందో నీకెలా చెప్పను ? అవసరం లేని సంభాషణతో నా మనసుని తనవేపు తిప్పుకునేందుకు నీమీద లేనిపోని కథ అల్లుతున్నాడని గ్రహించి మెదలకుండా వింటూ కూచున్నాను.

"నీకేం చెప్పను వరలక్ష్మి? జీవితంలో నీ వంటి స్త్రీ తోడు నీడగా వున్నట్లయితే—దేశానికి నా సర్వస్వాన్నీ ధారపోసేందుకు ముందుకు వురికేవాణ్ని కదా !" అన్నాడు.

ఆ కళ్ళు తమాషాగానే వున్నయ్. ముఖంమీద పడుతున్న క్రాపు వెంట్రు

కలం హోటల్లోని పంకా గాలికి మెల్లిగా కదులుతున్నాయ్.

"కూల్ డ్రింకులు తెచ్చిన మనిషి దూరంగా వెళ్ళి నిలుచున్నాడు. రోడ్డు మీద జట్కాలు, రిక్షాలు, టాక్సీలు రణగొణ ధ్వనిని చేసుకుంటూ పోతున్నాయ్. హోటల్లోని రేడియో బజారు ధ్వనితో శృతి కలిసి—గోలగా అవుతూ వుంది.

"మీ అన్నాయ్‌తో పాటు మన మిద్దరం కలిసి 'దేశసేవ' కోసం నడుములు బిగించినట్లయితే—మన నాయకుల కెంతో బరువు తగ్గిపోతుంది. అనాడే..."

ఆ మాటల్ని వినలేక పోయాను. రానురాను అతని ధోరణి నామననునీ, స్వేచ్ఛనీ అరికట్టేదిగా మారిపోయింది.

"ఇప్పుడు మాత్రం నీ సేవనీ, శక్తినీ—మన మాతృభూమి కోరడం లేదా—ఎందుకింకా దూరంగా నిలుచుని ఆలోచిస్తావ్ ?" అన్నాను.

"అదికాదు లక్ష్మీ! నేనొక్కణ్ణే దేశం కోసం పాటుబడితే ప్రయోజనం లేదు. నువుకూడా నాతో-" గొణుగుతూ నా వేపు చూసాడు.

"నేనిప్పుడు దూరంగా వుంటున్నానా? అన్నాయ్‌తో పాటు తీరుబడి దొరికినప్పుడల్లా ఖద్దరు అమ్ముతూనే వున్నాను. కార్మికుల పిల్లలకి చదువు చెబుతూనే వున్నాను. నాయకుల ఆజ్ఞ కావాలిగాని 'జైలు'కి వెళ్ళడం ఎంత సేపు!"

"అందుకనే మనమిద్దరం ఈ దోవ వెంట కలిసి ప్రయాణం చేస్తే- మనల్ని!"

"నేనిప్పుడు అన్నాయ్‌తో పాటు ఇందులోనే తిరుగుతున్నానుగా ?"

"కాదనలేదు. కానీ, నీ భవిష్యత్ జీవితాన్ని నువు చూడడం లేదు. ఆయన ఎక్కడో హఠాత్తుగా అరస్టయితే నీగతేం కావాలి? నీమీద ఎటువంటి నిందలు పడతాయ్. నా అనేవాళ్ళు లేనప్పుడు వివాహమే కాని నిన్నీ బ్రిటిషు ప్రభుత్వం తాలూకు చోపుదార్లు ఏం చేస్తే చెల్లుబడి కాదు. ఆడదంటే ఈరోజుల్లో అందరికీ అలుసు పరంక్ష్మీ! అన్నీ తెలుసుండి కూడా నువ్విలా తెలియనట్లు, చేతకానట్లు,ఏదో ఆలోచిస్తున్నట్లు..."

"అలా ఆలోచించినప్పుడే జీవితంలో 'చేతకాని' తన మంటే ఏమిటో తెలుస్తుంది! రెక్కలు విరిగిన పక్షి 'చేతకాక' ఏవిధంగా యెగరలేక పడివుంటుందో అదే విధంగా నువు చెప్పినట్లు మా జీవితాలున్నాయ్. బాధలతో, అవమానాలతో, తిరస్కారాలతో నిండిపోయిన ఆడవాళ్ళ జీవితాల్ని గురించి నువ్వెప్పుడనా ఆలోచించావా? ఎన్నైనా అనేందుకు మగవాళ్లు సమర్థులు. సమాజమనేది వాళ్ళది. ఆడదాన్ని తిడుతూ, గడ్డికంటే, మురికికంటే ఎక్కువగా చెడిపోయారని అంటూ మళ్ళీ వాళ్ల వెనకాలే పరుగెడుతుంటారు. ఇటువంటి వాళ్ళ మాటల్ని గురించి చదువుకున్నవాడివి భయపడుతూ నువ్వే నాకు ఏమేమో చెబుతుంటే నేనింకేం చేయను? ఐనా జీవితంలో దేన్ని గురించైనా ఒకరికి మాట ఇచ్చేముందు ఆలోచించి చెప్పడం మంచిది కదూ!" అన్నాను.

నారాయణరావు ఇంకేమీ మాట్లాడ లేదు. బిల్లు చెల్లించి బైటికి వచ్చాడు. నా మాటల్ని గురించి ఆ కళ్ళు బాధ పడ్డాయనుకుంటాను, అదో విధంగా నావేపు చూసి శలవు తీసుకుని వెళ్ళి పోయాడు.

లోకంలో ఆడది— అందులోనూ ఒంటరిగా సమాజంలో తిరిగేవాళ్ళు వీళ్ళకి చాలా తేలికగా కనబడతారు. లేకపోతే— నీ ప్రేమ లేఖల్ని గురించి గొప్పగా 'డప్పు' కొట్టేమనిషి— నాదగ్గరింత ఇదిగా ప్రాధేయ పడడం నాకు అనుమానాన్నే కలిగించింది సుమా!" అన్నది.

వరలక్ష్మి ఆలోచనా పటిమకి నాకు కంపరం కలిగింది. నా బుద్ధి ఇంతదూరం పోనేలేదు. ఆ మాటలేన్నే నారాయణ రావు నాదగ్గర ఒప్పచెప్పి నట్లయితే— నేనెప్పుడో అతనికి లోబడి పోయేదాన్ని.

ఒక విధంగా వరలక్ష్మి నా జీవితానికి మహోపకారమే చేసింది. లేకపోతే నారాయణరావు, తర్వాత నా దగ్గిర ఆడిన నాటకానికి తప్పకుండా నేను లోబడి పోయేదాన్ని.

వరలక్ష్మి నాకంటే ఒక ఏడాది చిన్నదైనప్పటికీ నారాయణరావు విషయంలో చాలా జాగ్రత్తగా అతని మనస్తత్వాన్ని గుర్తించ గలిగి వూబిలోకి జారిపోయేందుకు సిద్ధంగా వున్న నా మనసుని పట్టుకుని బైటికి లాగింది. లేకపోతే ఈనాడు నేను కూడా కర్మని గురించి, వేదాంతాన్ని గురించి ఆలోచిస్తూ అందరిలానే ఒకమూల పడి ఉండేదాన్ని.

ఆ తర్వాత మేమిద్దరం నారాయణ రావు మీదా అతని కుక్కబుద్ధి మీదా— ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాము. ఎన్నో సంగతుల్ని చర్చించుకున్నాము. ఈనాడు అవన్నీ ఇక్కడ మళ్ళీరాసి మీకు విసుగు కలిగించటం బాగుండదు. కాని ముఖ్యంగా వరలక్ష్మి బుద్ధి ఎటువంటిదో, దాని తెలివి తేటలు ఎంత గొప్పగా రాణిస్తాయో, ఎదుటి మనిషి తాలూకు మనస్తత్వాన్ని అదెంత చమత్కారంగా గ్రహిస్తుందో, స్నేహితులంటే దానికెంత అభిమానమో అవన్నీ మళ్ళీ ఒకసారి దాని ఉత్తరం చూడటంతోనే కళ్ళముందు తిరిగినై.

ఒకటికి రెండుసార్లు, మూడుసార్లు, నాలుగుసార్లు — పదిసార్లు చదువుకున్నాను. మనసుకు తృప్తనేది లేకపోయింది. నాకళ్ళని నేనే నమ్మలేకపోయాను.

ఉత్తరంలోని దాని ఆవేదన, నిశ్చయమూ — పశ్చాత్తాపమూ, బాధా — ఇవన్నీ నా మనసుని మార్చకలిగాయి గాని, లోకానికి మాత్రం ఇవేవీ అక్కర్లేదు. తెలిసో తెలియకో బురదలో జారిపోయి, పడిపోయిన కాలుని, శుభ్రంగా కడుక్కుని తిరిగేందుకూ కూడా సమాజం ఈనాటికీ ఒప్పుకునే స్థితిలో లేదు.

ఆగస్టు విప్లవంలో అన్న కనబడకుండా వెళ్ళిపోతే — అధికారులు వరలక్ష్మిని జైల్లో పెట్టారు. తల్లీదండ్రీ లేని వరలక్ష్మిని దాని అన్నాయ్ ఒంటరిగా వొదిలి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోతే,

బ్రిటీషు సామ్రాజ్యం తాలూకు రక్షకులు జాగ్రత్తగా జైల్లో పెట్టి అన్ని సదుపాయాలు కలిగించి కాపాడుతూ, వుండడం బాగానే వుందిగాని, నాకెందుకో దాని వొంటరి తనపు బతుకుమీద జాలి కలిగి నాన్నతో 'పర్మిషన్' తెప్పించి చూసేందుకు జైలులోకి వెళ్లాను.

నన్ను చూసి గబగబా గేటు దగ్గరికి వచ్చి కడ్డీలను పట్టుకుని "ఎందు కొచ్చావోయ్?" అన్నది నవ్వుతూ.

ఏడుస్తుందనీ — గోల చేస్తుందనీ, జైలులోంచి తప్పించమని ప్రాధేయ పడుతుందనీ నేనూహించినదంతా తలకిందులై పోయింది.

"ఏం? అలా తెల్లబోయి చూస్తావేం?" అన్నది మళ్లీ. నేనేం మాట్లాడను. భయమంటే ఏమిటో తెలియనట్లే వరలక్ష్మి మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"మీ అన్న సంగతిగాని, కాంగ్రెసు సంగతికాని తెలియదని చెప్పక పోయావా?" అన్నాను కొంచెంసేపు వూరుకుని?

"ఎందుకని?—"

"ఎందుకేమిటి, నీ ముఖం— జైల్లోంచి బైట పడడానికి."

"ఇప్పుడు చెప్పినా లాభంలేదు జానకీ! 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభమై ప్రజల్లో బాగా పాతుకుపోయింది. పదినిమిషాలు మామూలుగా దొర్లిపోతే చాలని అధికార్లు గజగజలాడిపోతున్న పరిస్థితుల్లో అన్నాయ్‌కున్న కాంగ్రెసుహోదామీద— నేనేం చెప్పినా వొదుల్తారా? నీదంతా పిచ్చి!" అన్నది.

"మరి..."

"మరేమిటి?—"

"ఈ ఇంగ్లీషు ఆఫీసర్లు కాని, పొగరుమోతు అధికార్లు గాని, చిన్నదానివని నిన్నేమన్నా..."

నామాట పూర్తి కానేలేదు. వరలక్ష్మి నవ్వింది.

"ఏమిటలా నవ్వుతావ్?—"

"ఏమీలేదు. నువు చెప్పేవాళ్లు ఏం చేస్తారా? అని—"

"బాగానే వుంది. నాలుగ్గోడల మధ్య ఏంచేస్తే — ఎవరు చూస్తారు?"

"వాళ్లేదో చేస్తారని మనం ముందుగానే భయపడితే ఎలా?"

"అది కాదు—"

"నువ్వనేది నాకు తెలుసు. ఎంతి పొగరు మోతు ఆఫీసరుకైనా భయమనేది ఒకటుంటుంది. తెల్లారడంతో నే ఈ సంగతి తెలిసి ప్రజలూ — పైఆఫీసర్లూ తనని శిక్షిస్తారని. అనవసరంగా తన అధికారాన్ని దుర్వినియోగం చేయడానికి ఎలానన్నా భయపడతాడు, అలా కాకుండా ఆడది తనంత తానే తననేమన్నా చేస్తాడేమో అని కళ్ళద్వారా భయాన్ని చూపించిందా తననేదో చేయమనే కుతూహలాన్ని భయం వంకతో కళ్ళద్వారా వెల్లడిచేస్తుందని తెలుసుకో గలుగుతాడు. అప్పుడే ఆడది మగవానికి లోకువవుతుంది"

"నీదంతా..."

"కాదు నీవింకా అంతదూరం ఆలోచించలేదు. మగవాడికి ఈ ఆడదాన్నేమన్నా చేయాలని లేకపోయినా, ఆడది మాత్రం—భయం భయంగా తననిచూసి వాడు ఆశపడలేదని బాధపడుతూ కళ్ళ ద్వారా కోరికని భయంతో చూపిస్తుంది. తననేంచేస్తాడో, తననేంచేస్తాడో అనే ఆలోచనలే లేనప్పుడు స్త్రీ భయపడేంత అవసరమే లేదంటాను. నా మనసులోకి ఇటువంటి విషయాలే రావు. నాకేం భయంలేదులేవే" అంది.

దాని మాటలూ, నిశ్చలమైన మనోనిగ్రహమూ కళ్ళముందు తిరిగినయ్. మాట్లాడకండా కొంచెంసేపు నిలుచుని వెళ్ళిపోయాను.

నాలుగు నెలలుకూడా పూర్తిగా గడవక ముందే వరలక్ష్మి నన్ను వెతుక్కుంటూ వచ్చింది ఒకనాడు.

ఈమధ్యలో నాకు పెళ్ళికావడమేగాక, ఆయనగారితో సంసారాన్ని చేసి చేసికొంటూ—స్కూలు మానడం వరకు అన్నీ జరిగిపోయినయ్.

గబగబా లోపలికివచ్చి "ఏమేవ్—జానకీ. ఎక్కడే?" అంటూ పిలిచింది.

కిటికీలోంచి మీదపడే సాయంకాలపు వెలుగులో అద్దంముందు కూర్చుని తల దువ్వుకుంటున్న దాన్నల్లా లేచి గుమ్మంలోకి వచ్చాను.

తెల్లని గ్లాస్కో—చీర కట్టుకుని, ముస్తాబై నవ్వుతూ వరలక్ష్మి లోపలికి రావటం కనిపించింది.

"ఏమిటే లక్ష్మి — వొడిలిపెట్టారా ఏం?" అన్నాను,

సాతోనే లోపలికి వచ్చి, "బాబాయేడి? అమ్మెక్కడికి వెళ్ళింది?" అని అడిగింది.

బంధువులింటికి వెళ్ళడం చెప్పాను.

వరలక్ష్మి నా ముఖంలోకి, కళ్ళల్లోకి పరీక్షగా చూసి "ఏమిటే ఇంతగొప్పగా మెరుస్తున్నావ్—పెళ్ళయిందా యేం?" అన్నది.

చెప్పాను.

"అవును. ఇరవై ఏళ్ళొచ్చినప్పటికీ బడితల్లా తిరుగుతుండటం బావుండలేదే! లోకం దృష్టిలో సంసారంచేసుకోకండా తిరిగి గొడ్లలావుంటాం. ఐతే—బావగారేం చేస్తారేం?"

"ఇంకా చదువుకుంటూనే వున్నారు,"

"నువ్వు కాలేజీకి వెళ్ళడం మానుకున్నావా?"

"ఆ"

"పెళ్ళికావటంతోనే ఆడదానికి సంసారంమీద గంగవెర్రు లెత్తుతాయిలే! నువ్వేమిటి మహామహులంతా..."

"ఈ సోదకేంగాని, అన్నాయ్ సంగతేమన్నా తెలుసా?" అన్నాను.

అడ్డంగా తలతిప్పింది.

"మరి నువెలావచ్చావ్ జైల్లోంచి"

"చాలా కథవుందిలే."

"ఏమిటది?—"

"చెబుతానుగా రాత్రికి"

నేనింకేమీ మాట్లాడలేదు. చీకటిపడే ముందు నాన్నా అమ్మా వచ్చి వరలక్ష్మిని పలకరించారు. దాని బాగోగుల

దగ్గిర్నుంచి బైట పడేనంతవరకూ పూపి రాడకండా ప్రశ్నలు కురిపించారు.

దాని జవాబులు, మాటలూ — నవ్వులూ, గాంభీర్యమూ నన్ను చాలా దూరం లాక్కుపోయాయి.

ఆ రాత్రి భోజనాలయింతర్వాత మేడమీది గదిలో నాదగ్గిరే పడుకోబెట్టు కునేందుకు తీసుకపోయాను.

పదిగంట లవుతుందేమో మెల్లగా లోకమంతా నిద్రాదేవి కౌగిల్లోకి చొరిగి పోతూవుంది. రోడ్డుమీద అక్కడక్కడ కుక్కల అరుపులు, గుర్రబ్బండ్ల టకటక ధ్వనులూ తప్ప ఇంకేవిధమైన శబ్దమూ వినపడడం లేదు. పెన్నా నదిమీదినించి వచ్చే చల్లనిగాలి మనసుకి ఉత్సాహాన్ని కలిగిస్తూ వుంది.

కొంచెం సేపు వూరుకుని "రాత్రికి చెబుతానన్నావ్. ఏమిటేది—"అన్నాను.

నావేపు తమాషాగా చూసి నవ్వింది.

"చెప్పవా ?"

"ఏముందిలే పోనిద్దూ ?" అంది.

దాని దాపరికమూ, రహస్యమూ తెలుసుకోవాలనే కాంక్ష కలిగింది.

"అయితే చెప్పవా ?" అన్నాను.

వరలక్ష్మి మాట్లాడలేదు. రేడియో సెట్ ముందు కూచుని 'మద్రాసు' పెట్టు కుంది.

నిమిషాలు గడుస్తున్న కొద్దీ వరలక్ష్మి ప్రవర్తనని గురించి నామనసు అనేక విధాల పోయింది. ఆఖరికి దాన్ని అను మానించేందుకు కూడా నేను వెనుకాడ లేదు.

"అయితే నిన్నొకటి అడుగుతాను చెబుతావా ?" అన్నాను.

నావేపు చూసింది వరలక్ష్మి.

"మాటలతో నన్ను మోసగించవు కదా ?"

"ఏం ? నిన్నెప్పుడన్నా నేను మోస పుచ్చానా ?" అంది.

"కాదుగాని, ఈ విషయంలో నువు నిజం చెప్పాలి."

నవ్వింది.

నేనింకేం మాట్లాడను ? మెదలకండా వూరు కున్నాను.

రేడియో స్విచ్ తీసివేసి నాదగ్గరికి వచ్చి కూచుంటూ "నేనెప్పుడన్నా అబద్ధం చెబితేగదా నువ్వామాట అనాలి. అడగవే చెబుతాను..." అంది.

నేను సందేహిస్తూ, సగం అయిష్టం గానే "జైల్లోంచి పారిపోయి రాలేదు కద" అన్నాను.

వరలక్ష్మి నా వేపు విచిత్రంగా చూసింది. దాని మనసులో వెంటనే ఏవేవో తిరగడం ముఖంలో వెల్లడయింది గాని నేనేమీ గ్రహించలేక పోయాను. వరలక్ష్మి చెబుతుందని, నా మాటని తోసివేయదని, నా కంటే దానికి ఆ క్లిష్ట పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ వారెవరూ లేరని వూహించి తెలివితక్కువగా అడిగాను. విచిత్రంగాచూసి, నా చేతిని విదిలించి—పక్కకు తిరిగి మంచం మీద పడుకుంది.

దాయబడుతూ, జాగ్రత్తగా కాపాడ బడుతున్న కొద్దీ, తెలుసుకోవాలనే అభిలాష ప్రతివారిలోనూ ఎలా పాతుక

పోతుందో అటువంటి దేశాలోనూ బాగా జీర్ణించుకుంది. ఆ పట్టుదల కొద్దీ—వరలక్ష్మి చేయిపట్టుకుని ఒక్క ఊపున లాగి కూర్చోపెట్టాను. వరలక్ష్మి చీదరించుకుంటూ నా చేతిని బలవంతాన వదిలించుకోవాలని ప్రయత్నించింది. నేను వదలలేదు.

"ఏమిటీ ఈ దౌర్జన్యం" అన్నట్లు వరలక్ష్మి చాలా కోపంగా చూసి "ఇంత పిరికిదాని వవుతావనుకోలేదు జానకీ! పారిపోయివస్తే ఈపాటికి ఎప్పుడో ఈ ఇంటిని సి. ఐ. డీలు చుట్టుముట్టేవారు; నా ప్రవర్తనమీదా, మాటల మీదా ఆఖరికి నీక్కూడా విశ్వాసంపోయిందన్న మాట. నీకు నేనెప్పుడూ అబద్ధం చెప్పను జానకీ! నువ్వేమీ భయపడకు" అంది.

పోనీలే అని మెదలకుండా పడుకున్నాను.

ఆ మర్నాడు పదిగంటలకల్లా వరలక్ష్మి వెళ్ళిపోయింది. నాన్నతోనూ అమ్మతోనూ చెప్పనేలేదు సరిగదా ఆఖరికి అది నాతోనన్నా ఏమీ చెప్పలేదు.

రెండు నెలలు గడిచినయ్.

ఈ రెండు నెలల్లోనూ వరలక్ష్మిని అనుకోనిరోజులేదు. వూళ్ళోని దాని ఇంటికి వేసిన తాళపుసీలు, వేసినట్లుగనే వుంది. అనుకోకుండా అది ఓ నాడు అకస్మాత్తుగా రావడం, మళ్ళీ అలానే చెప్పకుండా చేయకుండా వెళ్ళిపోవడం నా మనసులో బాగా నిలబడి పోయినయ్. జైల్లోకి వెళ్ళకుండావుండినట్లయితే దాని భవిష్యత్ జీవితం ఎలా వుండేదో కాని రాజకీయాలతోనే ఆ కుటుంబమంతా జీవించడం చేత అది ఏ అజ్ఞాత వాసంలోకి అన్నకు తోడుగా వెళ్ళిపోయిందో నేనూహించలేకపోయాను.

వరలక్ష్మికీ నాకూ పరిచయం కొన్ని నెలలే అయినా నారాయణరావుని ప్రేమిస్తూ బురదలోకి జారిపోయేందుకు సిద్ధమైన నామనసు నది సక్రమమైన మార్గం మీదికి తిప్పి కాపాడింది. లేనట్లయితే నాబతుకు ఏవిధంగా నాశనమయేదో చెప్పలేను.

అది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా పరోక్షంగా అది నా జీవితానికెంత వుపకారం చేసిందో నేను మరిచిపోలేకపోయాను. చాలా స్వల్పకాలమే మా పరిచయాలు సాగినప్పటికీ దాని తెలివితేటలూ, సూక్ష్మబుద్ధీ, మనోనిగ్రహమూ అన్నీ కళ్ళముందు తిరుగుతూనే వున్నయ్.

మా ఇద్దరికి కలిగిన స్నేహాన్నీ ప్రేమనీ అభిమానాన్నీ గురించి ఆలోచిస్తూ ఎంతసేపు కూర్చున్నానో ఏమో— నాన్న గదిలోకి వచ్చి "ఇదుగోనమ్మా నీకు ఉత్తరం వచ్చింది." అంటూ టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

లేచి గబగబా చించి విప్పి చూసాను.

"...నువ్విప్పుడు గృహిణిగా ఎంతో అనుభవాన్ని సంపాదించుకొని వుంటావు. నీకు నేనేమీ చెప్పక్కర్లేదు. ప్రకృతి ధర్మాన్ని మనం జరిగిపోనీయాలి. దాన్నాపేందుకు మహామహులకే చాతకాలేదు. అటువంటప్పుడు ఏకొద్దో విజ్ఞానాన్ని సంపాయించుకున్న మనశ్శక్తి సామర్థ్యాలు ఆ ప్రవాహం ముందు నిలబడగలుగుతాయా? మానవ జీవితా

లకు పరమావధి అదే! పేరు ప్రతిష్ఠలు మనకు ఎన్ని వున్నప్పటికీ వాటితోనే మనం కాలాన్ని సరిపుచ్చుకోలేము కదా!

“అన్నాయ్‌తో పాటు రాజకీయాల్లో ప్రవేశించి రాజకీయాల్ని నాబుర్ర నిండా నింపుకుని మీటింగులతో, సత్యాగ్రహాలతో బ్రిటిషు సింహం మీదకి నలుగురిలానే వురికాను. దేశంకోసం ముందుకురికి రాజకీయాల్లో ప్రవేశించిన నాజీవితానికి జైలు వాతావరణం నా కళ్ళను తెరిపించింది.

“మా వార్డులోని నాయకులూ, ఉపనాయకులూ, దేశభక్తులూ, మెంబర్లూ అంతా— ‘ఎంత తెలివి తక్కువగా జైల్లోకి వచ్చామురా భగవంతుడా!’ అన్నట్లు ఒకర్నొకరు చూసుకుంటూ బాధపడేవారు. వాళ్ళ మనసంతా ‘విడుదలైపోయి ఇంటి పట్టున హాయిగా కూచుంటా’మనే దిగులుతో నిండిపోయేది. ‘యెందుకొచ్చిన ఆగష్టు విప్లవం’ అన్నట్లు నిరుత్సాహాన్ని చూపించేవారు. ఒకరికి తెలియకుండా ఒకరు రాజీనామాలిచ్చి జైల్లోంచి బైటపడేందుకు సిద్ధమయ్యారు.

“స్వరాజ్యం సంపాదించేందుకు ఆగష్టు విప్లవం తోడు పడుతుందనే నమ్మకం యేనాడో వాళ్ళకి పోయింది. గాంధీజీ మీద వున్న భక్తితో వాళ్ళు కాంగ్రెసులో మెంబర్లయారు గానీ మాటిమాటికీ ఇలా జైల్లోకి వెళ్ళవలసొస్తుందని ముందుగా తెలిసుంటే ఈ మహాప్రవాహంలో ఇరుక్కునేవారు కారేమో!

“నేనుకూడా చాలా కాలం ఆలోచించాను. జైల్లోని ప్రతి నిముషం నా మనసుని వేధించింది. ఇంతమంది నాయకులు పొరపాటుగా జైల్లోకి వచ్చామని మథన పడుతూ వుండడం నాకు సహజంగానే కనిపించింది. దేశం మొత్తానికి ఒక విధమైన పథకం లేకుండా ‘ఆగష్టు విప్లవం’తో బ్రిటిషు సింహం జూలు పట్టుకుని వూగడం నవ్వులాటగనే కనిపించింది.

“అన్నాయ్‌తో పాటు తిరుగుతూ అనవసరంగా జైల్లో ఇరుక్కుపోయానే” అని బాధపడ్డాను.

“నిజంగానే బాధపడ్డాను. ఇరవై ఏళ్ళ జీవితంలో సుఖమనేది, సంతోషమనేది లేకండా ‘దేశంకోసం’ అన్నిటినీ వొదిలిపెట్టుకుని, జీవితసాఫల్యమనుకుంటూ రాజకీయాల్లోకి ప్రవేశించడం నా మనసుకి బాధని కలిగించింది. కానీ, ఒక విధంగా జైలుజీవితం నా ఆనందానికి తోడుపడింది కూడా!

“అక్కడే జైలుఅధికారిని నేను ప్రేమించాను. నా సర్వశక్తులూ ఆయనకోసం వెర్రిగా పరుగెత్తేవి! ఆ బూట్ల చప్పుడుకి, ముప్పైసంవత్సరాల వయసులో అధికారాన్ని చలాయిస్తుకూడా జైల్లోని మనుషులమీద చూపించే గౌరవానికి, మాటలతీరుకి, నేను నిజంగా ముగ్ధురాలి నయాను!

“ప్రేమకథలూ, సినిమాలు నా కళ్ళ ముందు ఎన్నో తిరిగినయ్...

“అంతే!

“ఒకనాడు ఉద్యోగానికి శలవుపెట్టి అతనూ, కాంగ్రెసుకి రాజీనామా యిచ్చి

నేనూ బైటపడి ప్రపంచంలోకి వచ్చాం. అప్పుడే నువ్వు నా విషయాన్ని 'అనుమానించి' గుచ్చి గుచ్చి అడిగావ్, గుర్తుందా? ఇదంతా నీకు చెప్పడానికి నాకు తగని సిగ్గు కలిగింది. ఆఖరికి "జైల్లోంచి పారిపోయి రాలేదు కదా?" అని అడిగావ్.

"కోపంతోపాటు నవ్వు కూడా వచ్చింది. అటువంటిపని చేయననీ; చేస్తే ఈపాటికి ఇంటిని సి. ఐ. డీలు సోదా చేసేవారనీ, భయపడవద్దనీ" అన్నాను. నువ్వేమీ మాట్లాడకండానే నిద్రపోయావు.

"ఆ మరువాడు అనుకొన్నట్లుగానే ఆయనతో వచ్చేసాను. ఆఖరికి నీతో కూడా చెప్పనేలేదు. ఐనప్పటికీ నువ్వు నన్ను ప్రేమిస్తూనే వుంటావనే నమ్మకం నాకుంది. ఇదేమంత పెద్దతప్పుగా తీసుకోవు — తీసుకోలేవుకూడా. నాకు నీకన్నా చెప్పుకోదగ్గ ఆప్తులు లేరు. అన్నాయ్ ఎక్కడున్నదీ తెలియనేలేదు. మనస్నేహాన్ని మరిచిపోవనే అనుకుంటాను?"

ఒక్కసారి జరిగిపోయినవన్నీ కళ్ళముందు తిరిగినయ్ ... జీవితంలో మేమిద్దరం ఎలా కలుసుకున్నామో — ఎంత కలుపుగోలుతనంగా మా స్నేహం సాగిందో, ఒకరికొకరం పరస్పరంగా ఎలా వుంటూవచ్చామో, స్కూల్లో, ఇంట్లో, గదిలో ... ఊహించుకోలేకపోయాను.

ఆ ఉత్తరం పూర్తిగా నా మనసుని మార్చిపారవేసింది. ఈ రెండు సంవత్సరాలూ నేను వరలక్ష్మిని మరిచిపోనేలేదు. ఏదో ఒక విషయంలో, ఎప్పుడో ఒకప్పుడు అది నా మనసులో మెదుల్తూనేవుంది. కాలపు పొరలమడతల్లో చిక్కుకొని నా హృదయంలోంచి దాన్ని తొలగించిపారవేస్తే నాది మనిషి జన్మే కాకపోను.

సాయంకాలమైంది. చెట్లవెనక ఎర్రని మబ్బుల్లో సూర్యుడు అస్తమించాడు. రోడ్డుమీద, గదుల్లో నూ ఎలక్ట్రిక్ లైట్లకాంతి మెల్లగా పరుచుకపోయేందుకు ప్రయత్నిస్తూ వుంది. నా మనసంతా వుత్తరంలోని సంగతులకి బాధపడుతూ - ఆందోళన చెందుతూ వుంది. ఈ రెండేళ్లల్లోనూ ఒక్కక్షణమైనా వరలక్ష్మి నన్ను మరిచిపోయినట్లు లేదు.

రావడంతోనే ఆయనగారు "అలావున్నావేం జానకీ" అన్నారు.

ఆయనగారు గదిలోకి వచ్చిందికూడా నేను తెలుసుకోలేకపోయాను. నా మనసంతా వరలక్ష్మి ఉత్తరంలోని సంగతులకు కొట్టుకులాడిపోతూ వుంది.

"జానకీ, ఏమిటి అలావున్నావ్?" అన్నారు ఆయన మళ్ళీ. మాట్లాడలేకపోయాను. కళ్ల వెంట నీళ్లు తిరిగినయ్.

"ఏమిటి జానకీ చిన్నపిల్లలా బాధపడతావ్?" అన్నారు. చేతిలోని ఉత్తరాన్ని ఆయనగారికిచ్చాను.

"ఎక్కణ్నుంచి వచ్చింది? ఎవరు రాసారు." అన్నారు నేను మాట్లాడనేలేదు.

"...చాలా కాలమైంది జానకీ నీకు ఉత్తరాన్ని రాసి. ఈ మధ్యలో కాంగ్రెసు నాయకులు పదవుల్లోకి వచ్చి దేశాన్ని మరామత్ చేసేందుకు ఎన్నో పనుల్ని నిర్వహించారు. గాంధీగారు

పోయారు. రెండేళ్ల వ్యవధిలో అనుకోనివెన్నో జరిగిపోయినయ్.

కాల ప్రవాహంలో నేనూ కొట్టుకపోయాను. జైలునించి విడుదలై నీదగ్గరకి వచ్చినపుడు ఈ విషయాన్ని చెప్పినట్లయితే — నువ్వేదో నాకు తగిన సలహా ఇచ్చే దానివి; కానీ — నేనా వీలును కలిగించలేక పోయాను.

ఆయనతో నేను ఆరు నెలలపాటు సుఖంగా జీవితాన్ని గడిపాను. స్త్రీ జీవితానికి కావలసిన ఆనందమేదో నేనాయనవల్ల తెలుసుకోగలిగాను. జీవితంలోని తపశ్చర్యలన్నీ మూర్తివంతమై నా కళ్ల ముందు ప్రత్యక్షమయేవి! తృప్తి, సంతోషమూ, ఆనందమూ పొందాను.

మానవుల జీవితంలో కలిగే బాధల్ని, విచారాల్ని, అవమానాల్ని, సుఖమయమైన సంసారం ఏవిధంగా మరిపించగలుగుతుందో తెలుసుకోగలిగాను. జీవితంలోని ఆ క్షణాల్ని చూస్తే నామీద ఎవరికైనా ఈర్ష్య కలిగేది.

ఉన్నట్టుండి ఆయన మోసం చేసి పారిపోయాడు. ఆయనకు భార్యా పిల్లలున్నారని తెలుసుకుని కూడా నేనాయన్ని వొదిలి పెట్టి వుండలేక పోయాను.

నీకు దూరంగా వున్నప్పటికీ ఈ రెండేళ్లలోనూ నువు నాస్మృతిపథంలోకి ఎన్నిసార్లు వచ్చావో నేను రాయలేను. అదంతా వ్రాస్తే పొగడ్త కింద తీసుకుంటావనే భయం నాలో వుంది.

నారాయణరావిప్పుడు కనబడుతున్నాడా? —

అన్నట్లు మీ 'ఆయన' ఇంకా చదువుకుంటూనే వున్నాడా? ఏంచేస్తున్నాడు?

లోకంలో నాకింకే విధమైన భయమూ లేదని ఆశించి, జీవితాన్ని సుఖంగానే గడుపుతాననీ, నా దోవకి ఏవిధమైన అడ్డంకీ లేదని, ఏదారిమీద నడుచుకుంటూ పోయానో, ఆదారిమీద ఎదురుదెబ్బ తగిలి పడిపోయాను.

ఏ ఆకర్షణాశక్తి ప్రభావంతో ఆయనకి నేను లొంగిపోయానో — ఆ ఆకర్షణా ప్రభావంలోంచి అంత ఉద్వేగంతోనే బైటపడ్డాను.

ఏంచేయను? ఎవరున్నారు?

మెల్లిగా ఇంటికి వచ్చేప్పటికి అన్నాయ్ ఇంట్లో వున్నాడు. గుండెలన్నీ గజగజలాడినయ్.

"ఏమిటమ్మా ఇది?" అన్నాడు అన్నాయ్.

నేనేమీ మాట్లాడ లేకపోయాను.

"ఎంత చెడ్డపేరు తెచ్చావమ్మా! తలిదండ్రులు లేకపోయినప్పటికీ — చదువు చెప్పించి, స్వాతంత్ర్యమిచ్చి నావెంట తిప్పుతూ లోకజ్ఞానాన్ని కలిగించినందుకు మంచి పేరే తెచ్చావ్—! ఇందుకోసమేనా నిన్ను నేను చదివించింది?" అన్నాడు.

పొంగి వచ్చే వెక్కిళ్లను ఆపుకుంటూ అన్నాయ్ పాదాల మీద పడ్డాను. క్షమించమన్నాను.

ఆయన లేవదీస్తూ "ప్రేమనేది యెల్లప్పుడూ సత్యం శివంసుందరంలాంటిది కావాలమ్మా! నిలబడలేక కాలంలో అది ఎప్పుడైతే జారిపోయి శాంతినిభగ్నంచేస్తుందో ఆదోషం ప్రేమది మాత్రం కాదు! మనదే! ఇంతకాలం నీవెంట వున్న మనిషి నిన్నెందుకు వదిలిపెట్టి వెళ్ళిపోయాడో

పూర్తిగా అవగాహన చేసుకున్నప్పుడే నీహృదయం పక్వమవుతుంది. క్షమించేందుకు నేనెవర్ని? ప్రతి మానవుడి హృదయంలోనూ క్షమనేది వుంది. దాన్ని మన మీద నుంచి పోగొట్టుకోకుండా యెదుటి వాళ్ళని విశ్వాసపాత్రుల్నిగా చేసుకున్నప్పుడే మనం మానవుల మవుతాం. ఈ మాటల్ని మరిచి పోకు. సమాజంలో వుంటూ, సమాజంలో తిరుగుతూ మన చరిత్రని జాగ్రత్తగా కాపాడు కోవడం ధర్మమని మాత్రం మరిచిపోకు" అన్నాడు.

అన్నాయ్ మాటలు నా హృదయంలో బాగా చొచ్చుకు పోయినయ్. నా తప్పుల్ని ఆయన క్షమించాడు. కానీ, లోకం దృష్టిలో నేను చెడిపోయిన దాన్నయాను. సమాజానికి వెలి అయాను.

సంవత్సరమున్నర గడిచిపోయి నప్పటికీ నాగరికత వాతావరణంలో తిరుగుతున్నా మనుకునే ప్రజలంతా నావేపు విచిత్రంగా చూసి జరిగిపోయిన విషయాల్ని జ్ఞప్తికి తెస్తున్నారు.

ఏం చేయను?

నే నిప్పుడొక విధమైన కొత్త జీవితాన్ని అలవాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. అన్నాయి కింకా పెళ్ళి కాలేదు. రాజకీయ జీవితంలో శతమతమై నానా బాధలు పడిన అన్నాయిని గురించి ఏ నాయకుడు కూడా ఇప్పుడు పట్టించుకోవడమే లేదు. అంత దయాక్షమాగల అన్నాయి బాగు పడడమే నాకు కావాలి. నేనున్నంత వరకూ ఆయన జీవితం మారదు.

రోజులు గడుస్తున్న కొద్దీ ఈ నాగరికత మధ్య నాకు తాత్కాలిక స్థానమే కాని నీలా సంసారిగా వుండటానికి అర్హత లేదా? రోజూ చూసే సంసారి స్త్రీలతో నేనెప్పటికీ సమానం కానా? తమ తమ భర్తలవెంట ఈ ఆడవాళ్ళంతా యెక్కడికైనా వస్తారు, గౌరవాన్ని పొందుతారు. మరి నేనో? నేనో—? నేనో?

ఇటువంటి ప్రశ్నలే మనసునిండా మెదుల్తున్నయ్. పొరబాటున తెలిసో తెలియకో బురదలో పడిన కాలును కడుక్కోకుండా వుంటేనే మంచిదా?

చుట్టూవున్న ప్రపంచాన్ని చూస్తూ, "సినిమాల్ని చూస్తూ మరిచిపోయిన ప్రేమని గుర్తుకు తెచ్చుకుంటున్నాను. కానీ, ఇది మునుపటి గుడ్డి ప్రేమకాదు. నా శరీరం మీద ఇంకా మెరుగులు వున్నయ్. అందం వుంది. ఇరవైరెండు సంవత్సరాల వయసుతో ఆరోగ్యంగా వున్నాను. నాకిప్పుడు భర్తనే మనిషి కావాలి! జరిగిపోయిన జీవితంలోని నా పొరపాట్లని తెలుసుకుని ఏ అనుమానాలూ లేక పరిపూర్ణంగా నన్ను ప్రేమించ గలిగిన మనిషి కావాలి. అటువంటి వాళ్ళెవరన్నా ఈ జీవితంలో తోడు నీడగా దొరికే వట్లయితే—అయోమయంలో నేను మళ్ళీ పడిపోతాననే భయం నాకు లేదు.

ఆయనగారు చదివి నావేపు చూశారు. ఆకళ్ళనిండా వేదనతో కూడుకున్న బాధ కనిపించింది; ఒకక్షణమైనా వరలక్ష్మి నన్ను మరిచిపోయినట్లు కనపడలేదు. దాని ఆవేదనంతా నాముందు వెళ్ళబోసుకుంది.

వరలక్ష్మికి నేనేం రాయను?

★



# దాంపత్యం : వయోభేదం

విరుద్ధజాతుల మధ్యవున్న వయోభేదంవల్ల వారి దాంపత్య జీవనం ఎలా వుంటుంది? వయస్సులో ఎక్కువ భేదంవున్న వ్యక్తులు వివాహమాడ వొచ్చు? ఇది అతిముఖ్యమైన సమస్యగా చూడబడుతోంది. దాంపత్యాన్ని సౌఖ్యమయం చేసుకునేందుకు వయస్సు వొక ముఖ్యాంగం. వివాహమాడ బోయ్యే వారికి యీ చర్చ ఎంతో ఉపయోగంగా వుంటుంది. పొరపాటుపడి దాంపత్య జీవితంలో ప్రవేశించిన వారు, దంపతుల మధ్యవున్న వయోభేదాన్ని నిందించటం మనకు కొత్తకాదు.

దాంపత్యాన్ని గూర్చి సలహాలివ్వగల సమర్థులంతా ఒక విషయాన్ని ఆమోదిస్తారు. ఒకే నాగరికతకు అలవడి, దాదాపుగా ఒకే ఆర్థికస్థితిలో వుండి, చదువు సంధ్యల్లోకూడా పెద్దభేదంలేని — దాదాపు ఒకే వయస్సువున్న దంపతులకు సౌఖ్యమయమైన దాంపత్యాన్ని గడిపే అవకాశాలు ఎక్కువ. ఐతే జాతి, మత భేదాలు వున్నవారిమధ్య, ఆర్థికస్థితుల్లోనూ, వయస్సులోనూ విభేదంవున్న దాంపత్యాలు విధిగా దుఃఖమయ మౌతవనికాదు. కాని వుభయులమధ్యా మంచి కలయిక తెగని సంబంధం ఏర్పడేందుకు పైన చెప్పుకున్న భేదాలు ఎంత తక్కువగా వుంటే ఆ దాంపత్యం అంత విజయవంతంగా వుంటుందనిమాత్రం చెప్పగలం.

ప్రణయం— ఎదుటివ్యక్తి మీది అభిమానంతో కూడిన ఉద్రేకానికి ఒక రూపమని చెప్పవొచ్చు. యీ అభిమానం కనదనే భావనకు అనేక కారణాలుంటవి; యెక్కడో అడపా దడపా ఒకే ఒక్క కారణం కూడా ఉండొచ్చు వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలు, అభిరుచుల్లో భేదం అర్థంచేసుకోటంలో తేడాలు ఎన్నో వుండొచ్చు. ఏదో వున్నా దాంపత్య జీవితంలో ప్రవేశించాక వధూవరు లిద్దరూ కూడా ఒకరినొకరు అర్థంచేసుకుని, ఉభయులకూ సంబంధించిన అనేక విషయాల్లో కలిసి మెలసి పోవటంలోనే దాంపత్య జీవితపు విజయం ఆధారపడి వుంటుంది. ఇది కారణంగానే వియోగం వల్ల దంపతుల మధ్యవున్న సంబంధం మరింత బలపడటం లాటిది జీవితంలో అనుభవంలోకి వొస్తోంది. ఎందుకనంటే— వియోగమనేది ఒకే వ్యక్తికి సంబంధించింది కాదు. ఉభయులూ అనుభవించటం వల్ల ఇద్దరిలోనూ ఒకేరకం మార్పునూ, బాధనూ తెచ్చేందుకది ప్రయత్నిస్తుంది.

విశదీకరణ చూద్దాం— ఉదాహరణకు భార్య దూరప్రదేశంలో ఉన్నట్లయితే తామిద్దరూ కలిసి భాగస్వాములుగా అనుభవించిన అనేక అనుభవాలు గుర్తుకొస్తవి. తనను గూర్చి అడిగే వ్యక్తి లేనట్టు, తనను ప్రేమతో పలకరించే వ్యక్తి లేనట్టు తోస్తుంది, తనను అర్థం చేసుకో గలిగిన వ్యక్తికి దూరమవటం వల్ల కలిగిన బాధ తెలిసొస్తుంది. ఆ దంపతులు అంతకు పూర్వం ఏ చిన్న విషయంలోనో తగవులాడినప్పటికి ఎవరికి వారుగా తమదే పొరపాటని గ్రహించేందుకూ, ఎదుటి వ్యక్తిని క్షమకోసం అర్థించేందుకూ ఎక్కువ కాలం పట్టదు. ఇక్కడ రతిని గూర్చిన ప్రశ్న కాదు. తన భార్య దగ్గర భర్త పొందగలిగిన కామతృప్తిలాటిది ఏ ఇతర స్త్రీ నుంచైనా పొందగలడు. ఆయా పనులు, సందర్భాలు, ఆయా ప్రవర్తనలు— ఇలాటివి యెన్నో కలిసి ఆ దాంపత్యాన్ని శాశ్వితం చేయకలిగినవి. వాటినుంచి దూరమవటం బాధాకరమే అవుతుంది. ఒకరినొకరు అర్థంచేసుకోగల వేరొక దాంపత్యం ఏర్పడాలంటే అంతా ప్రతి విషయమూ మళ్ళీ మొదలవ వలసి వుంటుంది. అప్పటికీ అది విజయవంత మౌతుందనే నమ్మకం లేదు.

వయో భేదాన్ని గూర్చి చర్చించవలసి వొచ్చినప్పుడు దాంపత్యానికి వయోభేదం ఒక ముఖ్యాంగం కనుక దాన్ని ఇతర విషయాలతో కలిసే చూడవలసి వుంటుంది. దంపతుల ఉభయులకూ సంబంధించిన అనేక విషయాలమీద వారి దాంపత్యం యెలా నడుస్తుందో చూడబడుతుంది. ఒకానొక దాంపత్యం విజయవంత మయేందుకు వేరొక దాంపత్యం దుఃఖమయమైనందుకూ గల కారణాలు విచారించబడుతవి.

వయోభేదమనే దాన్ని కేవలం సంవత్సరాల్లో చూడటం కుదరదు. ఉదాహరణకు — ఇద్దరు వ్యక్తుల మధ్య వయస్సులోని తేడా ఎప్పుడు ప్రమాదిస్తుందంటే — వారి విజ్ఞానాల్లోనూ శారీరక మానసిక స్థితిగతుల్లోనూ పెద్దతేడా వున్నట్టయితేనే! కనుక వయోభేదాన్ని మరింత విశాల దృక్పథంతో చూడవలసిన అవసరం వుంది మొత్తంమీద వధూవరుల మధ్య ఏ పది సంవత్సరాల వయోభేదమో ఉన్నట్లయితే అప్పుడే, వారి మధ్య పెద్దతేడా వున్నట్లు చెప్పగలుందాం; అంతకన్న తక్కువ భేదం లేదా ఎక్కువ తేడాలను గమనించకూడదని కాదు. వాటిమీదకూడా దాంపత్య జీవితపు విజయం ఆధారపడి వుండొచ్చు. అలాటివి తక్కువ కేసులు కనుక వాటిని గూర్చిన చర్చకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇవ్వటంలేదు. దీనికి తోడుగా వారి వారి ఆర్థిక పరిస్థితులూ, నాగరికత, విజ్ఞానం మొదలైనవి కూడా పరిగణించబడవలసి వుంది.

దాంపత్య జీవితానికీ, వయోభేదానికీ పెద్ద ప్రాముఖ్యత లేదని కొంతమంది నమ్మకం; కాని యీ అభిప్రాయం పొరపాటు. రెండో పెళ్లి మూడో పెళ్లి చేసుకున్న మహాపురుషుల దాంపత్యాలు ఎంత సౌఖ్యమయంగా ఉంటూన్నవో మనం చూస్తూనే వున్నాం. అలాగే వయస్సులో కొద్ది భేదం వున్నప్పటికీ శారీరకంగానూ మానసికంగానూ భర్త తక్కువ పెరుగుదలను పొందినా కూడా ఆదాంపత్యం కుంటి నడక సాగిస్తుంది.

18 సం. ల యువతి, 50 సం. ల పురుషుణ్ణి వివాహమాడినట్లయితే వారి మధ్య ఒక తరం భేదం ఉంది; ఆమె తన వయస్సుకూ, భావాలకూ తగినట్లుగా తన భర్తను వయస్సు తగ్గించుకొని భావాలలో మార్పు తెచ్చుకొని వెనక్కు రమ్మని కోరుతుంది. ఈ భేదాన్ని మనం ఏవిధంగా సమర్థించేందుకు ప్రయత్నించినప్పటికీ తరానికీ, తరానికీ మధ్యా అభిరుచుల్లో, నాగరికతలో, దృక్పథంలో ఎంతో భేదం ఉంటుంది. అందుకనే ఈతరం వాళ్ళకూ, కిందటితరం వాళ్ళకూ ఒక విరోధభావం ఎప్పుడూ ఉండనే వుంటుంది.; కుటుంబంలోని తండ్రి కొడుకులమధ్య జరిగే మానసిక సంఘర్షణలు ఇందుకు నిదర్శనం. కాలంతోపాటు కదలలేనిస్థితి ప్రతి జీవితంలోనూ ఉంటుంది. ఆ స్థితినుంచీ మానవునిలో పెరుగుదల తగ్గటంవల్ల తనముందు తరం వాళ్ళతో కలవటం కుదరదు.

ఇది సర్వ సాధారణంగా జరిగేది. కాని పుట్టి పెరిగిన వాతావరణం వల్ల నైతేనేం, పొందిన సంస్కారంవల్ల నైతేనేం విశాల భావాలుగల కొద్దిమందిలో కాలంతోపాటు పెదగటం కనిపించకపోదు. అలాటివ్యక్తి తనకన్న వయసులో చాలా చిన్నదాన్ని పెళ్ళాడినప్పటికీ వారి మధ్య స్నేహం పెంపొందే అవకాశం ఉంటుంది. ఐతే వివాహానికి ముందుగానే వారు ఒకరొన్నొకరు అర్థంచేసుకొని, తమ దాంపత్యం సక్రమంగా తృప్తికరంగా సాగుతుందనే నమ్మకాన్ని ఏర్పరచుకోవటం అతి ముఖ్యం.

శారీరకంగా కూడా యీ భేదాలు కనిపిస్తవి. ఉద్రేకాల్ని పొందటం మాట అటుంచినప్పటికీ మధ్యవయస్సునుంచీ శారీరకంగా అనేక భేదాలు సంభవిస్తవి. స్త్రీ కామజీవితం ఆమె 20–30 సం. ల మధ్య ఉధృతంగా వుండటం సర్వ సామాన్యం. పైన మనం చెప్పుతున్న దాంపత్యం లాటిది – వరుడు 50 సం. ల వాడై వధువు 18 సం. ల వయస్సు దైనట్లయితే—ఆమె వయస్సు 25 సం. లు ఐనప్పుడు భర్త వయస్సు 57 సం. లు అవుతుంది. 50 సం. లు దాటాక శారీరకంగా శక్తిని క్రమంగా కోల్పోవటం, ముసలితనం ఆవరించటం జరుగుతుంది. భర్త అసామాన్యమైన శక్తివంతుడైనట్టయితే మరి కొన్నాళ్ళపాటు వారి దాంపత్యం సుఖంగా గడుస్తుంది. కాని వారి మధ్య ఏర్పడిన ఇంత పెద్ద భేదాన్ని కప్పిపుచ్చ గలగటం దాదాపు అసంభవంగానే పరిణమిస్తుంది.

యీ వయో భేదం ఏ 15 సం. లో వుండటం సామాన్య సంఘటన; మన దేశంలో కూడా ఇలాటి కేసులు ఎన్నో వున్నవి. ఇక్కడ కూడా శారీరకమైన సమస్యలు లేకపోలేదు. యవ్వన ప్రారంభం నుంచే పురుషుని కామజీవితం ఆరంభమై కాలం వరకూ సాగుతుంది. స్త్రీ కామజీవితం అంత సుదీర్ఘంగా ఉండదు. సంస్కారాన్ని పెంపొందించుకోవటంలో కూడా స్త్రీ పురుషుల మధ్య ఎంతో భేదం కనిపిస్తుంది.

15 సం. ల వయోభేదమున్న దాంపత్యంలో కూడా ఒకనాటినుంచీ స్త్రీ యవ్వన మధ్యంలో ఉండగానే, పురుషుడు తన వయోభేదంవల్ల క్రమంగా దిగజార నారంభిస్తాడు. యీ సమయంలో ఆమె తగినంత విజ్ఞానవంతురాలై, యీ సందర్భాన్ని సద్భావంతో చూడగలిగి సర్దుబాటు చేసుకోగలుగుతే ప్రమాదంలేదు. మానసికంగా పెరగటంమీదనే ఆ దాంపత్యంలోని సౌఖ్యంలోని అధిక భాగం ఆధారపడి వుంటుంది. దీనికి జతగా శారీరకమైన అవసరాలు, తత్వాలు కూడా లెక్కలోకి వొస్తవి. లైంగిక అవసరాల విషయమై వ్యక్తిగతమైన భేదాలు ఎన్నో ఉంటవి; ఇవి సరిగా వయసుతో నివృత్తిని కలిగి ఉండకపోవొచ్చు. అది ఆయా వ్యక్తి తత్వం కిందనే పరిగణించబడుతుంది.

ఒకవేళ వధువువయసు, వరునివయస్సుకన్న చాలా ఎక్కువైనప్పుడు ఆదాంపత్యం ఎలా వుంటుంది? పైన చెప్పుతున్న ఇబ్బందులు ఇక్కడా ఉంటవి — అంతకన్న మరికొన్ని కొత్త ప్రమాదాలు కూడా ఏర్పడుతవనేందుకు సందేహంలేదు. స్త్రీ బహిష్టు ఆగిపొయ్యే వయస్సునుంచీ ఆమె కామజీవితం క్షీణించనారంభిస్తుంది. ఆమె శరీరంలోని సెక్స్ గ్రంధులు సరిగా పనిచేయవు; అదే వయస్సులో వున్న పురుషునికన్న ఆమె కామవాంఛలు చాలా తక్కువగా ఉంటవి. పురుషుడు క్రమంగా తన శక్తిని కోల్పోతాడు; కాని స్త్రీ జీవితంలో ఆతాత్తుగా ఈ మార్పు ఒచ్చిపడుతుంది. ఎండోక్రైన్ గ్రంధులన్నిటినీ కంట్రోల్ చేసే పిట్యూటరీ గ్రంధితో సరిపెట్టుకోవటం కుదరదు. ఇదే సమయంలో ఆమె ఓవరీలు శక్తిహీన మౌతవి. యీ మార్పులో ఆమె ఒక్కసారిగా ఎంతో కామవాంఛను నిరూషించి, తరువాత పూర్తిగా చల్లబడి, వాంఛారహిత జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఈ అవస్థలో ఆమె భర్త వయస్సు ఆమె వయస్సుకన్న చాలా తక్కువ కావటంవల్ల తన భార్యలోని మార్పుకు తగినట్లుగా సర్దుకోలేడు. తన కామవాంఛ తీర్చుకునేందుకు వేరు మార్గాలను వెతుకుతాడు. తన భార్యను అగౌరవ పరచలేడు; బలాత్కరించి ఆమె పట్ల క్రూరత్వాన్ని వహించలేడు; పోగా మిగిలిందల్లా వేరొక స్త్రీతో సరిపెట్టుకోవటం— ఆ సంగతి తన భార్యకు తెలియకుండా ఉంచటమూను. కాని ఈ స్థితిలో ఆ దాంపత్యము తలక్రిందులవక మానదు.

వధూవరుల వయస్సులో వధువు వయస్సు తక్కువ కావటం కన్న వరుని వయస్సు తక్కువ కావటంలో ఎక్కువ ప్రమాదాలుంటవని చాలామంది అభిప్రాయం. పైన వివరంగా చర్చించిన విషయాలు యీ సత్యాన్ని నిరూపిస్తునే ఉన్నవి. పోతే సామాజికంగా–వధువు వయస్సు తక్కువ కావటాన్ని సమాజం అంగీకరించింది కాని, వరుని వయస్సు తక్కువ కావటాన్ని అంగీకరించలేదు. అనాది నుంచీ పురుషుడిది సమాజంలో పైచేయి కావటం స్త్రీని కేవలం తన కామ తృప్తి కోసం ఉపయోగించుకోవటం జరుగుతూనేవుంది. తనకన్న తక్కువ వయసుది

భార్యకావటంతో ఆమె మీద అధికారాన్ని మరింత తేలిగ్గా చలాయిద్దామనే ఉద్దేశం ఆదిమ మానవుని నుంచీ మనదాకా వచ్చింది. ఇది కారణంగానే బహు భార్యాత్వం పురుషుని పట్ల అంగీకరించ బడింది. కాని స్త్రీ పట్ల బహు భర్తృకతను సమాజం తేలిగ్గా అంగీకరించినట్లు చరిత్ర చెప్పదు. అంతేగాక వధువు వయస్సు ఎంత తక్కువైతే ఆమె విలువ అంత ఎక్కువగా ఉండటం, ఆమె శీలానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం చాలా కాలంగా జరుగుతూనేవుంది.

సౌఖ్యమయ దాంపత్య జీవితానికి వయస్సొక్కటే కాదు; ముఖ్యంగా సంస్కారమూ ఆర్థిక పరిస్థితులు కూడా ఆలోచించ వలసే వుంటుంది. యీ రెండూ అతి ముఖ్యమైనవనే విషయాన్ని తరతరాలుగానూ వొస్తూనే వుంది. తరానికీ తరానికీ మధ్యవున్న సంబంధాన్ని సంస్కారమూ ఆర్థిక పరిణామాలు నిర్ణయించి బలపరుస్తవి. వీటికి ఎన్నో ఉదాహరణలు చెప్పవొచ్చు. దంపతులిద్దరూ బీద కుటుంబాలనుంచి వొచ్చివున్నట్లయితే వారా బీదతనాన్ని భాగించుకొని ఒకరి కొకరు చేదోడు వాదోడుగా ఉంటారు. అలా కాకుండా వయసు ముదిరిన ధనికుడు చాలా తక్కువ వయస్సున్న బీదకన్యను వివాహమాడినట్లయితే—వారి వయోభేదమే కాకుండా ఒకరి ఎక్కువ ఒకరి తక్కువల వల్లకూడా అనేక అభిప్రాయ భేదాలు ఏర్పడుతవి. ఐతే సరిసమానంగా పరితూగే దాంపత్యాలు ఎలా ఏర్పడుతవనే సమస్య ఉండనే ఉంది. ఆసరిపెట్టుకోవటమనేది దంపతులు ఉభయుల్లోనూ ఉండి; వారి శిక్షణ సంస్కారం మొదలైనవన్నీ అందుకు సహాయపడాలి.

దంపతులు ఒకరి నొకరు అర్థంచేసుకోగలిగి వారి భావపరిణామాలు పరిపూర్ణతను పొందినట్లయితే వారు ఒకరి కొకరు మనసిచ్చి మాట్లాడుకోవటం, నిజాన్ని ఎదుర్కొగలగటం వారివారి సమస్యల్ని కలిసి ఛేదించుకొని, తమ జీవితాన్ని సౌఖ్యమయం చేసుకునేందుకు అవకాశాలు ఏర్పడుతవి.

ఉదాహరణకు లైంగికంగా తృప్తిపడని ఒకానొక దంపతుల్లో – వారి వయోభేదం ఒక గొప్ప కారణంగా కనిపిస్తుంది. అంత మాత్రం చేత ఆదాంపత్యం విచ్ఛిన్నం కాదు; ఎందుకంటే ఇతర కారణాలవల్ల ఆ వివాహం జరిగింది. ఉదాహరణకు భర్త ఆస్థిపరుడు కావటం; ఆమెకు కావలసినంత డబ్బు వుంటుంది: దాన్ని వొదులుకోలేదు. మరి కామతృప్తి లేకుండటాన్నీ భరించలేదు. అప్పుడామె వేరు విధానాల్లో వ్యభిచరించి తృప్తిపడి, తనవంశ గౌరవాన్ని కాపాడుకుంటూ తనకు ఏ విధమైన అపాయమూ లేకుండా చేసుకున్నానని తృప్తి పడుతుంది. కాని ఆమె నిజంగా విజ్ఞానవంతురాలైనట్లయితే వేరొక విధంగా జరిగివుండాలి. ఉదాహరణకు తన అవస్థను తన భర్తకు ఎరుక పరుస్తుంది; అప్పుడు వారిద్దరూ కలిసి ఆ సమస్యను ఛేదించేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడు యీ మోసం అక్కర్లేదు; యీ దొంగతనం అంతకన్నా అక్కర్లేదు; అదే దాంపత్యం సుఖంగా గడవనూ గడుస్తుంది. లేదా ఆమె

తన దృష్టిని మరికొన్ని ఇతర కళల మీదికి మరల్చుతుంది. అందువల్ల ఆమె కామాగ్ని కొంత వరకూ చల్లారుతుంది; ఇదే సమయంలో భార్యను తృప్తి పరచటం తన విధి కనుక, భర్త తన డాక్టర్ను, మనస్తత్వ వేత్తను కలుసుకుంటాడు. దాంపత్యం తాలూకు టెక్నిక్‌ను కొత్తగా తెలుసుకుంటాడు. ఆ సుళువైన మార్గాల ద్వారా ఆమెను తృప్తి పరుస్తూ తాను మరింత ఆనందాన్ని పొందుతాడు. ఇదంతా వారిద్దరూ విజ్ఞానవంతు లైనప్పుడు.

అలా కానప్పుడు భార్యచేసిన ఫిర్యాదుకు భర్త మండిపడతాడు; తన పురుషత్వాన్ని అనుమానించిందని ఆమె పట్ల విపరీతమైన ద్వేషాన్ని పెంచుతాడు. కాని మరోపక్క తన భార్య తన పురుషత్వాన్ని హేళన చేయటం వల్ల ఏర్పడ్డ భయం మరింత గాఢంగా పనిచేస్తుంది. అందువల్ల అంతకు పూర్వం నిరూపించిన పురుషత్వాన్ని కూడా ప్రదర్శించలేక మరింత కుంగిపోతాడు. లేదా ఆమెకు గుణపాఠం బోధించాలనే ఉద్దేశంతో కావాలని బ్రహ్మచర్యాన్ని అవలంబించి ఆమెను మరింత బాధ పెడతాడు. ఇలాటిది స్త్రీ తాను కోరింది నెరవేర్చుకునేందుకు గాను అమలు జరపటం సర్వసామాన్య విషయం. కాని యీ పద్ధతివల్ల విషమ ఫలితాలు వొచ్చిపడుతవి. యెందుకంటే యీ విధానాలవల్ల సమస్య తీరదు సరికదా మరింత భయంకర రూపాన్ని దాలుస్తుంది. ఇతరత్రా తన కామవాంఛను తీర్చుకునే ప్రయత్నం జరుగుతుంది కూడాను.

పైన చెప్పుకున్నలాటి స్వల్పవిషయాలే దాంపత్యాలను తలక్రిందులు చేస్తవి. దంపతులమధ్య తగినంత గాఢమైన స్నేహం ప్రబలి ఉన్నట్లయితే ఒకరి లోటుపాట్లను వేరొకరు సర్దుబాటు చేసుకో గలుగుతారు; అప్పుడు దాంపత్యంకూడా వొడిదుడుకులు లేకుండా సాగుతుంది. అపార్థాలకు తావిచ్చేయడంవల్ల ఆ దాంపత్యం విచ్ఛిన్నం కావటం మినహాగా వేరొక మార్గమే ఉండదు.

మానసికంగా పెరగనట్లయితే దంపతులమధ్య వయస్సులో పెద్ద భేదం లేకున్నప్పటికీ ఒకరి నొకరు అర్థం చేసుకోలేక బాధపడటమే జరుగుతుంది; దీనికితోడుగా వయోభేదంకూడా ఎక్కువగా ఉన్నట్లయితే మరింతగా ప్రమాదాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.


ఏ పరిస్థితు లైనప్పటికీ వైవాహిక జీవితంలో ప్రవేశించిన వ్యక్తులు యెవరైనప్పటికీ దాంపత్యమనేది గొప్ప సమస్యగానే చూడబడాలి. సంతానం ఉండనీ లేకపోనీ దాంపత్య బంధనంలో చిక్కుకున్నాక దాన్ని చక్కబెట్టుకోవాల్సిన బాధ్యతలు దంపతులకున్నవి. ఇక సంతానం ఉన్నట్లయితే దంపతులమధ్యవున్న వయోభేదానికి మరింత ప్రాముఖ్యతవుంటుంది. మరీ పెద్దవయస్సులో సంతానం కలిగినట్లయితే ఆ సంతానానికి తగిన రక్షణ, శిక్షణలు ఉండవు. తల్లిదండ్రుల మధ్యవున్న వయోభేదం ఎక్కువైనట్లయితే ఆ సంతానంలో విపరీతపు తత్వాలు వృద్ధపటం సామా

న్యంగా జరుగుతుంది. ఎందుకనంటే రెండు తరాల వ్యక్తులు విభిన్న అభిప్రాయాలను తమ సంతానంలో ప్రవేశ పెట్టేందుకే ప్రయత్నం జరుగుతుంది. ఆ సంతానం తాలూకు మానసిక పరిణామంలో విభిన్న ప్రకృతుల సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. తల్లిదండ్రుల వయస్సులో పెద్దభేదం లేనట్లయితే కాలానికి తగినట్లుగా వారు ఉభయులూ దాదాపు ఒకే రకపు ఆలోచనల్ని కలిగివుంటారు. తమ సంతానానికి ఇచ్చే శిక్షణలో ఉభయులూ దాదాపు ఒకే పద్ధతిని అవలంబిస్తారు. ఇక శారీరకంగా చూసినట్లయితే దాదాపు దగ్గిర వయస్సులోవున్న దంపతుల తాలూకు సంతానం పెద్ద వయోభేదంవున్న దంపతుల తాలూకు సంతానంకన్న బలంగా వుంటుంది.

పోగా మిగిలిందల్లా భర్త భార్యకు లొంగిపోవటమో లేదా భార్య భర్తకు లొంగిపోవటమో! ఇందులో ఏది జరిగినప్పటికీ వారిద్దరి మధ్యా తగినంత స్నేహం లేదని ఒకరినొకరు అర్థంచేసుకోలేక ఏదోవిధంగా వెళ్ళబుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనీ చెప్పవలసి వుంటుంది. యీ విధంగా ఏ వొక్క వ్యక్తో తన ఇష్టానుసారంగా ప్రవర్తించే అవకాశం ఏర్పడటంతో, సంతానంలో కూడా ఆ వ్యక్తి తాలూకు ఆధిక్యత కనిపించక మానదు. అంతేగాక సంతానంలో విపరీతపు అభిప్రాయాలు ఏర్పడి, వారి తత్వాలలో కూడా ఆ మార్పులు స్పష్టమౌతవి.

వయోభేదం ఎక్కువగా వున్న దంపతులు ఆనందంగా గడిపిన కేసులున్నవి; వారి సంతానం శారీరకంగానూ, మానసికంగానూ ఆరోగ్యకరంగా వుండటం కూడా జరిగింది. యీ విధంగా జరగటానికి అవకాశాలూ ఉన్నవి; వాటిని అమలు జరుపుకోనూ వొచ్చు. అది కేవలం ఒకరి నొకరు అర్థం చేసుకోవటం మీద ఆధారపడి వుంటుంది. దాంపత్యంలో ప్రవేశించేందుకు ముందుగానే వ్యక్తిగతమైన పోలికలు, అభిరుచులు సరిపడటం మొదలైన వాటిల్లో కలయిక ఎక్కువగా వుంటే ఆదాంపత్యం విజయవంతమయే అవకాశాలు ఎక్కువగానే ఉంటవి. విరుద్ధ భావాలు కొద్దిగానో, గొప్పగానో లేని దాంపత్యమంటూ వుండదు. ఏ ఇద్దరు వ్యక్తులు సరిగా ఒకే మాదిరిగా ఉండదు; వారి అభిరుచులు సర్వదా ఏకీభవిస్తూనే వుంటవని కూడా చెప్పలేము. ఇక తరానికీ, తరానికీ మధ్య యీ అభిప్రాయాల్లో ఎంతో భేదం కనిపిస్తుంది. ఆ పరిస్థితుల్లో వయోభేదం ఎంతో ప్రాముఖ్యతను కలిగివుండక తప్పదు. వయోభేదం వల్ల దాంపత్యంకన్న, సంతానంమీద తన ప్రభావాన్ని ఎక్కువగా చూపుతుంది. కనుక. దాంపత్యంలో వయస్సునుగూర్చి విచారించక పోవటం మౌఢ్యమే అవుతుంది.

★



# కొడిగట్టిన దీపాలు

రచన: రాం షా

కామేశం వ్రాసిన ఉత్తరాన్ని సరోజ చదువుతోంది....

"నువ్వు లేకపోతే నేను లేనట్టే. దుర్భరమైన నా ఒంటరి జీవితాన్ని తలుచుకొని కుమిలిపోతూ ఆ అంధకారంలో నువ్వే ఒక్క ఆశాజ్యోతి వనుకుంటున్నాను...నాకు నువ్వుకావాలి ... నాకు ఊపిరికావాలని, ప్రాణంకావాలని, జీవం కావాలని ఎంతసహజంగా వాంఛిస్తానో అలాగే నువ్వు కావాలని కూడా....అవి లేకపోతే నేనెల్లా బ్రతకలేనో నువ్వులేకపోతే కూడా అల్లానే. ఈచీకట్లో .... ఈ దోమలతో...."

కామేశం వ్రాసిన ప్రతీ అక్షరమూ అతని గుండెల్లో రగిలిన దుఃఖాన్ని వ్యక్తంచేస్తున్నాయి. కామేశం మోకాళ్ల మీద తలపెట్టుకొని కళ్లనీళ్లు పెట్టుకొన్నట్టు, భోజనంమాని సత్యాగ్రహం చేసి కృశించి పోతున్నట్టు, ఇకనైనా ఆమె తన జవాబుతో ఓదార్చి అతను కోరినట్టుగా లేచిపోక పోతే ఆ అమాయక హృదయం చటుక్కున ఒక్కసారి ఆగిపోనున్నట్టు ఆ అక్షరాలు సరోజకు చెప్పాయి.

సరోజ ఆ ఉత్తరం చెప్పిన మాటలు విని కొంత నవ్వుకొంది; కొంతగర్వపడింది; కొంతజాలిపడింది. ఈసమస్యను ఎలాగో తేల్చక తప్పదనుకొంది.

ఉత్తరం అడుగున చేవ్రాలుకేసి చూసింది. పేరేమీలేదు. ఆ ఉత్తరం ఎవరు వ్రాశారో తనకు తెలియనిదికాదు; ఇది వరకు అదేదస్తూరి ఉత్తరాలు ఆమె కెన్నో వచ్చాయి.

సరోజ ఆ ఉత్తరాన్ని పట్టుకొని పరధ్యానంగా ఆలోచిస్తూంటే ఆమెభర్త వచ్చాడు. వస్తూనే నాగేంద్రం 'ఉత్తరం వచ్చిందా?' అన్నాడు.

ఏదో ఆలోచిస్తూనే సరోజ "ఊఁ" అంది.

"ఏదీ ఇలాతే" ఏదోఆలోచిస్తూన్న సరోజ ఆ ఉత్తరాన్ని భర్తచేతి కందించింది. భర్త యాదాలాపంగా అందుకుని ఆమెకేసిచూస్తూ

"ఇంకా తల దువ్వుకోలేదేం?" అన్నాడు.

సరోజకు అప్పుడే మెలకువవచ్చింది. భర్త, అతని చేతిలోని ఉత్తరం — రెండూ ఆమెకేసి చూస్తున్నాయి. సరోజ ముఖంచిట్లించుకొని

"ఆఉత్తరం చూశారా?" అంది.

"ఏం"

"ముందుచూడండి. మనిషి జన్మ ఎత్తిన తరవాత బుద్ధిఉండాలి. బుద్ధిలేని తుంటరులికి బుద్ధిచెప్పలేని మగాళ్లు ఛస్తే నయం."

ఉత్తరం పూర్తిగా చదివి భర్తకుంచుకున్న కళ్లతో నవ్వాడు. ఎవడో వెర్రి వెధవ తనభార్య పాతివ్రత్యాన్ని గ్రహించకుండా తన లుచ్ఛాతనం బైటపెట్టుకున్నాడు.

"ఎవరంటావ్?"

"ఇంకెవరు? ఆశేషువెధవ. కిటికీలోంచి లోపలికి విసిరేశాడు....వెర్రివాడి పెళ్లాం వాడకంతా వదినె అని."

"బుద్ధి చెప్పిస్తానులే."

"ఇంకా మెల్లగా అంటున్నారు! వీపు చిట్లకొట్టక. మన ప్రయోజకత్వం ఇలా ఉండబట్టే...."

భర్త ఆరాత్రి చాలా పేపటిదాకా శేషువెధవని ఎలా శిక్షించటమా అని ఆలోచిస్తున్నాడు. పతివ్రతల జీవితాల్ని, మానధనాన్నీ రచ్చబండ కీడ్చాలని వాళ్ల ఆశయం కావొచ్చు. రావణున్ని శ్రీరాములవారు మర్దించినట్టు, కీచకుణ్ణి భీములువారు తాడించినట్టు ఈ కలియుగంలో తను ధర్మసంస్థాపనార్థాయ నడుము బిగించక తప్పదు. ఆ దృఢ సంకల్పంతోనే చివరికి నిద్రపోయేసరికి రాత్రి పన్నెండుదాటి ఉంటుంది.

*   *   *   *

సరోజ వ్రాసిన ఉత్తరాన్ని కామేశం చదువుతున్నాడు.

"....మీరు వ్రాసినఉత్తరాన్ని చదివి వెర్రిదానిలా, చంటిపిల్లలా వెక్కివెక్కి ఏడ్చాను. తలగడ యావత్తూ కన్నీటితో తడిసిపోయింది. చివరికి మావారు కూడా నన్ను ఓదార్చవలసి వచ్చింది. కారణం ఏమిటని ఆయన అడిగారు. చచ్చిపోయిన మాఅమ్మ జ్ఞాపకం వచ్చిందని చెప్పాను. నాతోబాటు ఆయన కూడా ఏడ్చారు. మీరు తెల్లారకట్ట మూడు గంటలకి బండి తెచ్చి వీధిలో ఉంచండి. చడీచప్పుడూ లేకుండా బండిలో పడతాను. ఆతరవాత మీరన్నట్టే కలకత్తాకి..."

ఆ తరవాత సంగతి కామేశానికి తెలుసు. అయితే ఈఉత్తరం పూర్తికాకుండానే కామేశం దుఃఖపడ్డాడు. సరోజ

గాని, ఆమెభర్తగాని — ఇద్దరూ గాని ఏడ్చారనికాదు. ఆడవాళ్ళకి ఆడవాళ్లని ప్రేమించే మగవాళ్ళకి నీళ్ళకడవనెత్తి మీదనే ఉంటుంది. ఆ సంగతి కామేశానికి తెలుసు. అయితే కామేశం బాధల్లా

"...ఈదొంగముండ వస్తానంటోంది సరే. చేతిలో కానీ డబ్బు లేకుండా నా ప్రాణానికి గుది బండలా తయారైతే ఎట్లా? ఉన్నపీడతోనే ఛస్తూంటే ఇదో శనిగ్రహం కూడానా?"

మొన్న మొన్ననే తనకి పుట్టిన కూతురు, ఇంట్లో ఇదిలేవని అదిలేవని అను నిత్యం సాధించే పెళ్లాము, ఎన్నటికీ ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగం అన్నీ కామేశానికి జ్ఞాపకం వచ్చాయి. ఆజ్ఞాపకంతో కళ్లు తడిచేసుకొన్నాడు కామేశం.

* * * *

సరోజ వ్రాసిన ఉత్తరాన్ని ఆమెభర్త చదువుతున్నాడు. "...నేను మిమ్మల్ని విడిచి వెళ్లిపోవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను. మనంగడిపిన ఆరేళ్లల్లోనూ మన దినచర్యలో మార్పురాకపోవటమే దానిక్కారణం. ఆవంటిల్లు, పొయ్యి, పడకగది చదివినపుస్తకాలే చదవటం, పీల్చినగాలినే విడవటం — ఇవేనాకు దుర్భరాలయ్యాయి వాటన్నిటినీమార్చుకోవాలంటే మిమ్మల్ని కూడా మార్చకతప్పలేదు. విశేషమైన ప్రేమతో మిమ్మల్ని విడవలేక విడిచివెళ్లిపోతున్నాను. మీ ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోండి. వేళపట్టున భోజనం చేస్తూండండి. చిరుతిళ్లకి దురలవాట్లకి లోనుగాకండి. లోనయితే నామీదఒట్టు. మీకు నా ముద్దులు."

ఉత్తరం చదువుకొని ఆమెభర్త అనుకున్నాడు.

"పాపం ఆవెర్రిదానికి నేనంటే ఎంత ప్రేమ! నన్ను విడవలేక ఎంతదిగులు! ఎవడో దొంగ వెధవ ఆవిణ్ణి మోసగించి లాక్కుపోతున్నా కూడా నామీదనే ప్రాణంపెట్టుకొంది పాపం. వెర్రిది కాకపోతే తెల్లనివన్నీ పాలూ నల్లనివన్నీ నీళ్లూ అనుకుంటుందా? తన వియోగం భరించలేక ఏబజారు సరుకు వెంబడోపడి వళ్లుకుళ్ల బెట్టుకుంటానేమోనని దాని భయం."

అనుకుని ఆ ఆలోచనకి గుండెకరిగి కన్నీళ్లు కార్చాడు. తన ఈ దుఃఖాన్ని ఓదార్చటానికి ఆవిడలేదని మరీ దుఃఖపడ్డాడు. ఆవిడేలేకపోతే ఆవిడలేచిపోయిన దుఃఖాన్ని తాను ఎవరితో చెప్పగలడు?

ఆంజనేయులు కామేశం ఉత్తరం చదువుతున్నాడు:

"....ఇవాళనేను చాలా విపత్తులో ఉన్నాను. నన్ను ప్రేమించిన ఫలానా వారి భార్య నేటినుంచి నాకు భార్యకాబోతోంది. ఆ అమృతమూర్తి నావియోగం భరించలేక ఏమైనా నాతో కలకత్తా పోతానంటోంది. ఆవిడదగ్గర డబ్బు పుష్కలంగా ఉంది. కాని, ఎటొచ్చీ కానీ

కూడా దగ్గరలేని వాణ్ణినేనే. ఈదుస్థితిలో మొదటి నాడే ఆవిణ్ణి నేను డబ్బు అడగటం నాకు మంచిదిగా తోచలేదు. అడిగితే ఆవిడ ఏమనుకుంటుందో. అందుకని ఈ ప్రేమ ఆపత్తు సమయంలో నాకు నువ్వొక ఉపకారం చేయాలి. ఒక్క ఏభై రూపాయలు. ఈ నెలాఖరికి పంపించివేస్తాను. అప్పటికి పాతబడుతుంది కనుక ఆవిడదగ్గర్నుంచి పుచ్చుకోవచ్చు...ఇది నాజీవితరహస్యం! ఈరహస్యాన్ని కాపాడగల ఆప్తమిత్రుడివి నువ్వొక్కడివే. ఈక్షణంలో నువ్వు బదులిచ్చిన మొత్తం నీకు కాఫీఖర్చంత. దురవస్థలో ఉన్న ఒక స్నేహితుడికి ఆమాత్రం నువ్వుచేయక తప్పదు. ఈ సంగతులేమీ నువ్వు సత్యంతోగాని, సుబ్బారావుతోగాని, శేషాద్రితోగాని చెప్పవద్దు. ఆమెనాకు దుర్భర మైనప్పుడు నీఆజ్ఞ ప్రకారమే వర్తిస్తాను."

ఇదేఉత్తరాన్ని, ఆఖర్నున్న పేర్లలో మార్పులతో సత్యం, శేషాద్రి, సుబ్బారావు గార్లు కూడా పదేసిసార్లు చదువుకున్నారు.

చదువుకొని నల్గురూ నిట్టూర్చారు. చదువుకొని నల్గురూ తమ ఔదార్యాన్ని ప్రకటించారు. దాని ఫలితం రెండు వందలై కామేశం సపత్నీ సమేతంగా కలకత్తా చేరాడు.

ఆంజనేయులు ఒక్కడూ కూర్చున్నప్పుడు అనుకున్నాడు.

"ఒక పందికి పన్నీరుబుడ్డి దొరికింది; ఒక మొండి వాడికి మొగలిపువ్వు దొరికింది.

"పోనీ. కాని, ఆ స్థానంలో ఏదీ ఎక్కువ కాలం ఉండలేదు. నీరు పల్లానికి ప్రవహించినట్టు, సూర్యుడు తూర్పున ఉదయించినట్టు — ఆఖరికి అంతాసవ్యం కాకతప్పదు.

"ఒక్కచచ్చు ఏభైరూపాయలతో ఒక స్త్రీ ప్రియుడి పౌరుషాన్నీ, ఆస్త్రీ జీవితాన్నీ నేను కొనేసినట్టే. లేకపోతే తన్నుమాలిన ధర్మమూ, మొదలుచెడ్డ బేరమూ ఉంటుందా?"

ఆంజనేయులు అనుకున్నదే సత్యం అనుకున్నాడు సత్యం అనుకున్నదే శేషాద్రి అనుకున్నాడు; శేషాద్రి అనుకున్నదే సుబ్బారావు కూడా అనుకున్నాడు.

ఈవిషయంలో ఆ నల్గురూ ఒక్కత్రాటిమీద నడిచారు.

* * * *

ఆనల్గురు మిత్రుల మాటా ఏమోకాని సరోజ వేరొకలా అనుకొంది:

"...ఎంతకాలం నూతిలో కప్పలా మ్రగ్గిపోతానుకనుక! మనిషికి విలువలు రావాలంటే ముందు ముఖ్యమైనది డబ్బు. ఆ తరువాత అందం. డబ్బులేని వాళ్ళు అందాన్ని అమ్మి డబ్బు సంపాదించుకోవాలి. డబ్బు సంపాదించుకున్నాక అందాన్ని ఆనందించవచ్చు. ఈరోజుల్లో

డబ్బుకు దగ్గిరదారి సినీమా. దారి పొడుగునా — దుష్ట కాలంకనుక — ఒక ఎస్కార్ట్ ఉండాలి. మనకామేశం ఉండనే ఉన్నాడు. సరేచూద్దాం."

* * * *

కామేశం వ్రాసిన ఉత్తరాన్ని అతని భార్య చదువుతోంది.

"...ఈపాటికి మనవూళ్లో ఒక చిన్న గందరగోళం లేచేఉంటుంది. తద్వారా నేను చేసిన అపచారం నీకీపాటికి తెలిసే ఉంటుంది...నువ్వే చెప్పు ఏంచేయ మంటావో. వెధవజీతం డబ్బులన్నీ నీరోగాలకీ రొష్టులకీ చాలటంలేదాయె. ఇక సంసారం గడిచేదెట్లా. మనమిద్దరమూ సుఖంగా బ్రతకాలంటే మనకు డబ్బు కావాలి. అప్పన్నంగా డబ్బు రావాలంటే డబ్బున్న ఆడదిరావాలి. అది వచ్చింది. అంటే వెయ్యిరూపాయలన్న మాట. ఆడబ్బున్న ఆడది అందమైనదైతే డబ్బున్న స్నేహితులు కూడా వస్తారు దాని ఫలితం నాలుగు ఏభైలు రెండువందల రూ పా య లు. పోగా మామూలు జీతం వంద. మొత్తం పదమూడు వందలు. దాన్నివదులు కున్నందుకు లంచం రెండు వందలు. మొత్తం పదిహేను వందల ఆదా. నాకు శ్రీకాకుళం ట్రాన్స్ఫర్ అయింది. నువ్వూ పాపాయీ ఈనెలాఖరుకు రండి. ఖర్చుల నిమిత్తం వందరూపాయలు పంపిస్తున్నాను....ఉత్తరం ఆలస్యంగా వ్రాసినందుకు క్షమించు."

ఆ ఉత్తరాన్ని చదువుకొని అతని భార్య నిట్టూర్చింది. ఈఉత్తరం ఒక్కరోజు ఆలస్యంగా అంది ఉన్నట్టయితే శ్రీనివాసరావు ఆమెకు వ్రాసిన ఉత్తరం పనిచేసిఉండేది.





# వివాహాల్లో విచిత్రపద్ధతులు

వైవాహిక జీవితానికిముందుగానే ప్రణయం ప్రతి జీవితంలోనూ ప్రవేశిస్తుంది. హృదయమారా కోరిన ప్రియుడు లేదా ప్రియురాల్ని పొందేందుకుగాను, ఒక వ్యక్తి పడే బాధలు, ఎదుర్కొనే కష్టాలు, ఆరని ఆశల్తో చేసే అనేక ప్రయత్నాలు.—అనాదినుంచీ మానవ జీవితంలో జరుగుతూనే ఉన్నవి. వివాహంగా మారటంతో యీ పరిణామాలు అంతమై, వేరొకరకం జీవితం ఆరంభ మౌతుంది.

నాగరికతా ప్రపంచంలో ఆయా పద్ధతులు అనేక విచిత్ర రూపాల్ని దాల్చినవి. ఉదాహరణకు— ఎక్కువ శ్రమలేకుండా వివాహమాడే పద్ధతులు—ఏ పత్రికలోనో ప్రకటన వేయటం ద్వారా భర్తను, లేదా భార్యను నిర్ణయించు కోవటం లాటివి అమల్లోకి వచ్చినవి. యీ ప్రణయం ఆధారంగానే ఎన్నో కథలు, నవలలు, చిత్రాలు నాటకాలు, ప్రబంధాలు, ఇంకా వివిధ శాఖల సాహిత్యం వూడిపడింది. యువకుడు యువతిని కలుసుకోవటంతో మొదలైన కథలెన్నో చిత్రాలకు కథావస్తువులుగా ఉండటం మనకు తెలుసు. యీ కథలు కేవలం సాహిత్యానికి సంబంధించినవి మాత్రమే కాదు. మనం నిత్యా చూస్తూనేవున్న సాధారణ సంఘటనలని చెప్పవొచ్చు. మొదట్లో హృదయాల్ని కదిపి, ఎంతో ఆశలతో ప్రారంభమై సుఖాంతంగా పరిణమించటం, లేదా, వివిధ పరిణామాల్లోకి దిగి దుఃఖాంతాలుగా పరిణమించటం మనకు తెలియని విషయాలు కావు.

వ్యాపారాలు, పరిశ్రమలు ప్రణయం తాలూకు వివిధపరిణామాల మీదనే ఆధారపడి నడుస్తున్నవి. ఆభరణాలు, ఫాన్సీ వస్తుసామగ్రి, వివిధ పరిమళ ద్రవ్యాలు, లలిత కళలు మొదలైనవన్నీ ప్రణయానికి వస్తు సామాగ్రులుగానే ఉన్నవి. ప్రణయమే లేనట్లయితే, దాని అవసరం కలగనట్లయితే యీ పరిశ్రమల్లో నూటికి తొంభైపాళ్ళు మూసుకోవాల్సి వుంటుంది.

కాని ప్రణయం అమలు జరుపబడే విధానం ఎప్పుడూ ఒకే విధంగాలేదు; అనాది నుంచీ అనేక పరిణామాలను పొందింది. దేశకాలాను సారంగా సామాజిక ఆచారాల

రూపంగా అది ఒకో జాతిలో ఒకో విధంగా వుండిపోయింది. యీ ఆచారాల ఆధారంగానే స్త్రీ పురుషుల కలయిక, ఆ యా విధానాలు మారుతూ వొచ్చినవి.

ప్రణయంతో పాటే వివాహ కాండలు కూడా మారినవి. ఒకో జాతి ఒకో విధానంలో వివాహాన్ని నిర్ణయించినవి. కాలాను సారంగా, ఇతర పరిస్థితుల్ని కూడా గమనిస్తూ అందుకు అనుగుణంగానే యీ విధానాలు ఏర్పడినవి. వివాహం — సాంఘిక రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్ని ఆధారం చేసుకునే నిర్ణయించ బడినవి. వివాహం ద్వారా సంతానాన్ని బడయటమనే దానికి ఎంతో ప్రాముఖ్యత వుండటం వల్ల వివాహం వ్యక్తిగతమైనదేగాక సామాజిక మైనదిగా కూడా గుర్తించ బడింది.

ఆదిమ మానవుల్లో ఒక విశిష్ట రూపంలో స్త్రీ పురుషుల కలయిక జరగలేదు. అనేక రూపాలు ధరించి, విరుద్ధ భావాలను వ్యక్త పరిచే పద్ధతుల్లో యీ కలయికలు జరిగినవి. కొన్ని జాతుల్లో బహుభార్యాత్వం అంగీకరించబడింది. మరికొన్ని జాతుల్లో వివాహం — సంతానం కలిగే వరకూ ఏర్పడిన తాత్కాలిక సంబంధమనే నమ్మకం వుండేది. వివాహాన్ని గూర్చిన వివిధ భావాలు మానవుని బుర్రలో మెరిసినవి.

సామాజికంగా ఉన్నత భావాలు పెంపొందసాగాక, వివాహానికి వేరువేరు అర్థాలు ఆపాదించబడినవి. వివాహం కేవలం స్త్రీ పురుషుల కలయిక కొరకే ఏర్పడలేదు; వైవాహిక జీవిత పరిణామం – సంతానాన్ని పొందటమనే భావన కనిపిస్తుంది. సంతానాన్ని పొందటంతో సరికాదు; ఆ సంతానాన్ని పెంచి, వారికి మంచి రక్షణ, శిక్షణలను ఇచ్చి వారిని సమాజానికి పనికి వొచ్చే రీతిని తయారు చేయటం దంపతుల ధర్మంగా గుర్తించబడింది; అందుకనే దంపతులు వేరే కాపరం పెట్టి, ఒకటిగా జీవించవలసిన అవసరం ఏర్పడింది. యీ పద్ధతులు సక్రమంగా అమలు జరుపబడేందుకుగాను, ఏక పత్నీత్వం, ఏక భర్తృకతలు అవసరమైనవి; నేటి నాగరికతలో దాంపత్యం యీ పద్ధతుల్లోనే అమలు జరుపబడుతోంది.

విశాలంగా చూస్తే 'వివాహం' ముఖ్యమైన మూడు పరిణామాల్ని పొందింది. యీ పరిణామాల తాలూకు చిహ్నాలు నేటి వివాహ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తవి. రాక్షస వివాహ పద్ధతి మొదటిది. యీ పద్ధతిలో బలాత్కారంగా ఒక తెగలోని పురుషుడు వేరొక తెగలోని స్త్రీని తెచ్చుకుంటాడు. వధువు చేతిని పట్టుకొని వరుడు నడవటంలాటి ఆచారం ఇందుకు చిహ్నంగా గుర్తించవొచ్చు.

స్త్రీలను అపహరించటం సాగాక ఒక తెగ మరొక తెగమీద ప్రతీకారాన్ని తీసుకునేందుకుగాను యుద్ధాలు జరిగినవి: యుద్ధానికి పర్యవసానం శాంతి. ఓడిన తెగ కొంత పరిహారాన్ని చెల్లించటం జరిగేది. ఇక్కడే కొనుగోలు వివాహాలు ఉద్భవించినవి. ముందుగానే నష్టపరిహారం చెల్లించుకొని శాంతియుతంగా వధువును కొనుక్కోవడం ఉత్తమ పద్ధతిగా అమలు జరుప బడుతూ వొచ్చింది. సామాజికంగా పెళ్ళిళ్ళలోని కట్నాలూ, కానుకలూ సమర్పించటం యీ కొనుగోలు వివాహాల తాలూకు చిహ్నాలుగా గుర్తించవొచ్చు.

వధువును అప్పగించటం—అప్పగింతల ఘట్టం—కొనుగోలు వివాహంలో, వరుడు కొనుక్కున్న సరుకును విడుదల చేసెయ్యటం; హనీమూన్‌లో వరుడు వధువుతో కొన్నాళ్ళపాటు వేరు వేరు ప్రదేశాల్లో కాలం గడుపుతాడు; రాక్షస వివాహంలో దొంగిలించబడిన స్త్రీని కొన్నాళ్ళపాటు ఎవరికీ తెలియకుండా దాచేసే పద్ధతికి ఇది నేటి చిహ్నం. ఇదే విధంగా చరిత్రలో పెళ్లి పొందిన రూపాంతరాలు, ఆధునిక వివాహ పద్ధతుల్లో స్పష్టంగా కనిపిస్తవి.

వధూవరుల మధ్య ప్రణయం అధికమై పరిణయానికి దారి తీయటం — ప్రేమ పెళ్లిళ్లు మూడో పరిణామం. ఇక్కడ కామవాంఛకన్న వేరైనది — ప్రణయంగా గుర్తించబడింది. అనేకమంది కవులకూ, గాయకులకూ, లలిత కళాకారులకూ ప్రణయం ముఖ్యమైన వస్తుసామగ్రిగా వుంది. జీవశాస్త్ర రీత్యా స్త్రీ పురుషుల కలయిక అవసరమైనప్పటికీ, ఇందులో ప్రణయానికి స్థానం ఏర్పడటం, మానసికమైన వికాసంతో పాటే మానవునిలో వృద్ధయిందని చెప్పవొచ్చు. లోగడ 'అభిసారిక'లో వెలువడిన వివిధ వ్యాసాలలో వివిధ వివాహ పద్ధతులు, వాటి పరిణామాలు చర్చించబడినవి. మరికొన్ని విచిత్ర పద్ధతులు యీకింద చర్చించబడుతవి.

వదరన్ స్లావ్సలోనూ, బాల్కన్ ద్వీపకల్పంలోనూ విచిత్రమైన వివాహ పద్ధతులున్నవి. వధువు, మరిద్దరు స్నేహితురాండ్రతో, వివాహమయాక, తన దగ్గరి బంధువు లింటికి పంపబడుతుంది. అక్కడ మొదటి రాత్రి ఆమె అంతకు పూర్వం చూడని వ్యక్తితో గడపాలి. ఇందువల్ల ఆమె ఆ వ్యక్తినేగాక, ఏ పరపురుషుణ్నీ కోరదనీ, అసంతృప్తి జెంది, పరపురుషులయెడ ద్వేషభావాన్ని కలిగి, తన భర్తనే ఎక్కువగా ప్రేమించగలుగుతుందనీ వారి నమ్మకం. ఇక భర్త యింట ఆమె అత్తమామలకు ఎంతో లొంగి వుండాలి. ఆమె సరాసరి భర్తను జేరరాదు. దాంపత్యం ద్వారా తాను అపవిత్రురాలయిందనే భావనలో ఆమె సిగ్గుపడుతూ, భర్తను తప్పుకు తిరుగుతూండాలి; నలుగురిలో భర్తతో మాట్లాడరాదు; ఆమె మాతృత్వాన్ని పొందినా యీ సామాజికాచారాలను అతిక్రమించకూడదు. దంపతుల మధ్య రతి జరగటం తప్ప, ప్రణయం వృద్ధిజెందటమంటూ వుండదు. భర్త చనిపోయ్యాక కూడా, భార్య అతనికోసం ఏడ్వేందుకు సిగ్గుపడుతుంది.

భర్త విషయంలో యీ నిబంధనలు అనుసరించాల్సి వున్నా, ఇంట్లో భర్త అన్నదమ్ములతో ఆమె స్వేచ్ఛగా ఉండొచ్చు. అన్నదమ్ముల్లో పెద్దతనికి మాత్రం ఆమెతోడి స్నేహాన్ని అభివృద్ధి చేసుకునే ఆచారాన్ని ఆ జాతులు ఒప్పుకుంటవి. అల్బేనియాలో కుటుంబంలోని పెద్దకొడుకుపట్ల అతని తమ్ములు ఎంతో భక్తిని చూపుతారు. తమ్ముడు ఏదైనా ప్రయాణం చేసి తిరిగి వొస్తూ తన భార్యకుగాక, అన్నగారి భార్యకు ఏదైనా బహుమతి తెస్తాడు. పూర్వం ఆ జాతిలో వివాహమవగానే కామజీవితం ప్రారంభమయే ఆచారం ఉండేదికాదు. వరుని అన్నలు

ఆ మొదటి రాత్రి అనుభవాల్ని పొందేవారు. ఆ సమయంలో వరుడు, తన భార్య పట్ల విధిగా నిర్లక్ష్యాన్ని చూపాలి. సైబీరియాలో వివాహమైన సంవత్సరంలోగానే మాతృత్వాన్ని పొందిన స్త్రీని తక్కువ దృష్టితో చూసే ఆచారంవుంది.

లోకంలోని కొన్ని జాతుల్లో వేరొక విచిత్రమైన ఆచారంవుంది. కాన్పు సమయంలో భర్తకూడా పడకవేసి భార్యపొందే నెప్పులు అనుభవించినట్లు నటిస్తాడు. కాన్పయాకకూడా తన భార్యవలెనే పక్కలోవుండి నీళ్ళు పోసుకునే వరకూ పురిటి సేవల్ని పొందుతాడు. నేటి ప్రపంచంలో యీ పద్ధతి అంతరించినా, చరిత్ర కందని కాలంనుంచీకూడా ఇది అమల్లోవుండి నిన్న మొన్నటిదాకా వివిధ ప్రాంతాల్లో ఒక ఆచారంగావుంది. నైల్ నదీ ప్రాంతంలోనూ, ఇండియా, చైనా, జపాన్, టర్కీ దేశాల్లోని కొన్ని భాగాల్లోనూ ఈ పద్ధతి ఉండేది. ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాల్లోని ఆదిమ నివాసుల్లోకూడా ఈ పద్ధతి ఒక ఆచారంగా వుండేది.

ఏ ఇంద్రజాలం వల్లనో ఒక వ్యక్తి అనుభవించే బాధను, వేరొక వ్యక్తికి పంచటం సాధ్యమని నమ్మబడింది. మానసిక శాస్త్రరీత్యా తనవలెనే వేరొక వ్యక్తి బాధపడుతూంటే నిజంగా బాధను అనుభవించేవ్యక్తికి ఒకరకం ఓదార్పు ఉంటుంది. కొన్ని జాతుల్లో భార్య గర్భాన్ని ధరించినప్పటినుంచీ భర్త గడ్డాన్ని పెంచి తన సానుభూతిని చూపటంలాంటి ఆచారాలు నేటికీ ఉన్నవి.

వివాహాల్లో కొనుగోలు పద్ధతి ప్రవేశించాక దాంపత్య జీవితంలో ఆరంభం కావలసిన ఆర్థిక సమస్య వివాహానికి ముందే ఆరంభమైంది! కొన్ని జాతుల్లో ఆడపిల్ల తన పెళ్ళికి కట్నంగా ధన సంపాదనను చేసుకునేందుకు అదీ వ్యభిచారం ద్వారా సంపాయించుకునేందుకు ఆ సమాజాలు అంగీకరించినవి. కుటుంబం బీదరికంలో ఉండటం వల్లనేగాక, ఏవో మానవాతీతమైన శక్తులమీది మూఢనమ్మకాల వల్లకూడా యీ ఆచారాలు ఏర్పడినవి. ఏ దేవత సమక్షంలోనో యీ పవిత్ర కాండ జరగటం వల్ల ఆ ప్రణయదేవత వధువుచేసే యీ త్యాగాన్ని స్వీకరించి ఆనందించి దీవిస్తుందనీ, స్త్రీ తాలూకు దుష్టశక్తులు యీ త్యాగంతో వొదిలి పోతవనే నమ్మకం వుండేది.

కొన్ని ఆల్జీరియన్ తెగల్లోనూ, పొలీషియా, లిండియా, లూసియానా మొదలైన ప్రదేశాల్లోని ఆదిమ వాసుల్లోనూ యీ పద్ధతి ఒక ఆచారంగానే వుండేది. ఆదిమ మానవుల్లోని లైంగిక స్వేచ్ఛకూ, యీ పద్ధతికీ కొంత సంబంధం వున్నదనేందుకు సందేహంలేదు. మొదటిరాత్రి అనుభవం భర్తకుగాక వేరొక వ్యక్తికి అర్పించటమనే ఆచారం మతైకంగా వున్న జాతుల్లో కూడా పై పద్ధతి వేరొక రూపం కనిపించకపోదు.

స్వేచ్ఛగా కామాన్ని తీర్చుకోవటమనే ఆచారాలు ఉన్నట్లు చారిత్రాత్మక ఆధారాలెన్నో ఉన్నవి. ఆయా రచయితలు యీ విషయాల్ని రుజూ చేశారేకాని,

ఇవి ఏర్పడిన కారణాల్ని విశదీకరించలేదు. పోతే ఆదిమ మానవుని ఊహలు యెలా వుండేవో, మనస్తత్వం ఏవిధంగా పనిచేసేదో— ఆధునిక మానవుడి వూహకు దూరం కావటమే ఇందుకు కారణమని చెప్పగలం. మానవాతీతమైన శక్తులంటే ఆదిమ మానవునకు ఎంతో భయం; ఏవో మూఢనమ్మకాలు తోచినవిధంగా గుడ్డిగా నమ్మటం మొదలైన వాటికి కట్టుబడి దూరం ఆలోచించకుండానే ఎన్నో ఆచారాల్ని అమలు జరపటం జరిగింది. వాటినిగూర్చి గాఢంగా ఆలోచించే ధైర్యం, ప్రశ్నించే సాహసం లేక ఆ తరువాతి తరంవాళ్ళు ఏళ్ళపర్యంతంగా వొచ్చిన ఆ ఆచారాల్ని గుడ్డిగా అనుసరిస్తూ వొచ్చారు.

కాబోయ్యే భర్తగాక, వేరొకవ్యక్తి కన్నెచెరనుంచి తప్పించే ఆచారం ఆదిమ సమాజాల్లో విపరీతంగా కనిపిస్తుంది. స్త్రీని ద్వేషించటం, ఆమెను అపవిత్రురాలిగా భావించటం, మరీ స్త్రీ బహిష్ఠవుతుంటం కనుక, ఆదదాని ఉద్దేశ్యం తెలియని ఆదిమ మానవుడు రక్తమంటే భయపడి ఆమెను మరింత దూరాన ఉంచేందుకు ప్రయత్నించటం— యీ కారణాలుగానే అనేక నిషేధాలూ, నిబంధనలూ ఏర్పాటం జరిగింది. అపవిత్రురాల్ని భర్త తాకటంవల్ల ఏదో ప్రమాదం సంభవిస్తుందనే నమ్మకంతో వేరొక వ్యక్తి ఆమెను కన్నెచెర విడిపించాక భర్త ఏలుకొనే వాడు. యీ కర్మకాండ జరుగుతేనేకాని ఆడపిల్ల కాపరానికి సిద్ధంగా వుందని గుర్తించ బడేదికాదు. కొన్ని తెగల్లో ఈ కృతిమ పద్ధతిద్వారానే తల్లి తన కుమార్తెకు కన్నెచెర విడిపించే ఆచారం కూడా వుండేది.

పెరూలోని ఆదిమ నివాసుల్లో—ప్రధానం జరగబొయ్యే ముందు, పెద్దల సమక్షంలో తల్లి తన కుమార్తె కన్యత్వాన్ని నిరూపించి, కృతిమంగా ఆమెను కన్నెచెర విడిపిస్తుంది. యీ పద్ధతివల్ల ఆ కుటుంబ గౌరవ మర్యాదలు నిరూపించ బడటమేగాక దాంపత్య జీవితారంభంలో భర్తకు చాలా శ్రమ తగ్గుతుంది కూడాను.

కమ్‌చదాల్ తెగలో తన వధువుకు కన్నెచెర తప్పలేదని వరుడు బాధ పడటం ఆచారం; అందుకని యవ్వన ప్రవేశంలోనే తల్లి తన కుమార్తెకు కృత్రిమ పద్ధతిలో కన్నెచెరను విడిపిస్తుంది. నీలగిరిలోని టొడాస్‌లో కూడా యీ పద్ధతి వుంది. ఆడపిల్ల చిన్నతనంలోనే కృతిమ విధానంలో కన్నెచెర విడిపించక పోవటం అగౌరవమైనదిగా భావించ బడుతుంది. సకాలంలో ఇది జరగనట్లయితే పురుషుడు ఆ స్త్రీని నిరాకరించటం కూడా జరుగుతుంది. యీ కర్మకాండ చాలా పవిత్రంగా భావించబడుతుంది; ఇందులో పాల్గొనే వ్యక్తులుకూడా గౌరవించబడతారు; అదంతా ఒక మతైకమైన గుడ్డి నమ్మకంగా పరిగణించ బడుతుంది.

లోకంలోని వివిధ జాతుల్లో పెళ్లి సంబంధాల్ని కుదిర్చే వ్యక్తులున్నారు; యీ 'పెళ్లిళ్ల పేరయ్యలు' వ్యక్తిగతంగానేగాక, ఒక కూటమిగా కూడా వుండి


అనేక సంబంధాల్ని స్థిరపరచి అందు మూలకంగా ధనసంపాదన సాగిస్తున్నారు. అటు వధువుకూ, ఇటువరునికీ ఎంతో శ్రమ తగ్గిపోతుంది. ఇందువల్ల ఎన్నో కొత్త అవకాశాలు వధూవరులకు ఏర్పడినవి. స్వయం వరమంత ఖర్చు లేనిదీ, చాలా తక్కువ కష్టంతో సంబంధం దృఢపడేదీ కావటంవల్ల యీ పద్ధతి చాలా అనుకూలంగా వుండిపోయింది. నేటికీ అనేక దేశాల్లో యీ పద్ధతి అనుసరించబడుతూనే వుంది.

ధనిక కుటుంబాల్లో వివాహాలు తేలిగ్గా జరిగిపోవటం, ఆర్థిక స్థితికీ, వివాహానికీ ఒక పెద్దసంబంధం ఏర్పడిపోవటంవల్ల — మధ్య తరగతి కుటుంబాల్లోనూ, బీద కుటుంబాల్లోనూ వివాహం గొప్ప సమస్యగా పరిణమించింది. అప్పుడు యీ పెళ్లిళ్ల పేరయ్యల వ్యాపారానికి ఎంతో అవకాశం ఏర్పడింది. వివాహం ఒక వ్యాపారంగా ఏనాడైతే మారిందో, ఆనాడే వ్యాపార లక్షణాలైన ఒక మధ్య వర్తికి కూడా స్థానం ఏర్పడింది.

ఆదిమ సమాజాల్లోకి వెళ్తే వధువును కొనుక్కునే పద్ధతి అమల్లోవున్న సమాజాల్లో—వరుడు తగినంత ధనం ఇచ్చే వాడుగా ఉండటాన్ని ఆమె తండ్రి కోరటం సహజం. ఒకో సందర్భంలో ధనమంతా ఒక్కసారిగాక దఫాల వారీగా చెల్లించటం అంగీకరించ బడేది. ఆ సందర్భంలో వరుడు చాలా నమ్మకస్థుడు కావాలి. ఎందుకంటే తీరా వధువును చెయ్యి జారనిచ్చాక వ్యాపారంలో నష్టపోవాల్సి వుంటుంది. యీ నమ్మకానికి గాను నమ్మకస్తుడైన ఒక మధ్యవర్తి అవసర మయ్యాడు. పెళ్ళిళ్ళ పేరయ్య పుటక ఇక్కడే వుండొచ్చు.

ఇలాంటి సందర్భాలలో పెళ్ళిళ్ళ పేరయ్య కేవలం వర్తక సరళికి పనికొచ్చే వ్యక్తి మాత్రమే కాదు. అతనికి తగినంత పలుకుబడీ, సామాజికంగా గౌరవ మర్యాదలూ ఉండాలి. కేవలం అతని మాట మీదనే కొన్ని కాపరాలు ఏర్పడ వలసి వుంటుంది. లేదా కుటుంబానికి ఆప్తుడుగా కుటుంబ స్నేహాన్ని కోరే వ్యక్తిగా కూడా వివాహ సంబంధాన్ని కుదర్చవొచ్చు. ఇలాటి సందర్భాలలో వ్యక్తిగతమైన స్వార్థం ఉండదు. కేవలం కొంత ప్రజాసేవ జరుగుతుంది. క్రమంగా సామాజికంగా అతని పలుకుబడి మరికొన్ని పెద్ద కుటుంబాల్లోకి పాకుతుంది. ఇక ఆధునిక యుగంలో యీ మధ్య వర్తిత్వం ఎంత విజృంభించిందో మనకు తెలియంది కాదు.






రచన: ఎ. సూర్యారావు

సూర్యుడు తాటితోపు వెనుకనుంచి నెమ్మదిగా పైకివస్తున్నాడు. దూరాన్ని కుప్పలు నూరుస్తున్న కూలీల పాటలు ఆఉదయపు వాతావరణానికి ఏదోక్రొత్త అందాన్ని యిస్తున్నది. మేడ దిగువ భాగంలోంచి దంపుళ్ల పాటలు వినిపిస్తున్నవి. నీలవేణికి ఏదో క్రొత్త లోకంలోకి వచ్చినట్లుంది. ఆమె ఈ వూరు వచ్చి నెలరోజులు అయినా యింకా క్రొత్తపోలేదు. మొదటి పదిరోజులు ఆమెను ఒక క్షణమయినా విడిచిపెట్టకుండా ఆమెభర్త ఆమెతోనే గడిపాడు. తరవాత కోతలు, కుప్పనూర్పులు అంటూ యింతవరకూ అతను మేడమీదకురాలేదు. దురదృష్ట వశాత్తు భర్త మంచివాడయ్యాడు. లేనట్లయితే ఆసాకుతోనైనా అమ్మగారింటికి వీలైనపుడల్లా పోతూ వుండవచ్చు.

"వదినా! నీకు కాఫీ అక్కర్లేదూ?"

నీలవేణి వెనక్కి తిరిగి చూసింది. రంగమ్మ కాఫీగ్లాసు పట్టుకుని నుంచుని వుంది. ఆమెచేతిలో కాఫీ గ్లాసుతీసుకొని బల్లమీద పెట్టింది.

"ఎప్పుడూ పరధ్యానంగా వుంటావేం వదినా!" తిరిగి ఆమె ప్రశ్నించింది.

"నాకు యిక్కడేమీ తోచటంలేదు. చదువుకుందామంటే పుస్తకాలు దొరకవు. లైబ్రరీ లేదు. రేడియో లేదు. సాయంకాలం షికారు వెళ్లాలంటే బీచి లేదు. యిక్కడ మీరంతా ఎలా వుండగలుగుతున్నారో నాకు ఆశ్చర్యంగా వుంది" అంది నీలవేణి.

"అన్నయ్య ఆయనకు ఉత్తరం రాశారు వచ్చేటప్పుడు రేడియో కొనుక్కు రమ్మని"

"మీ ఆయన ఎప్పుడు వస్తారు?"

"రేపటి వేసవి సెలవులకు వస్తారు. ఆయన వచ్చేటప్పుడు చాలా పుస్తకాలు కూడా తీసుకు వస్తారు. అన్నట్లు నిన్న నువ్వు యిచ్చిన పుస్తకం చదువుతూ వుంటే అన్నయ్య తిట్టాడు. అటువంటి పుస్తకాలు చదవ కూడదట." అంది రంగమ్మ.

"మీఅన్నయ్యేకాదు రంగమ్మా! చాలా మంది బాగాచదువుకున్న మగవాళ్లుకూడా [illegible]కాల్ని ఆడవాళ్ల ఎదుట ద్వేషి సా[illegible] చదవకుండా కట్టు దిట్టాలు

చేస్తారు. వాళ్లుమాత్రం ఏ క్లబ్బులోనో రీడింగు రూమ్‌లోనో కూర్చుని జాగ్రత్తగా ఆ పుస్తకాలు చదివి యింటికి వస్తారు.” యింతలో ఏదో బండి పరుగెత్తుకు వస్తున్న ధ్వని వినిపించింది. యిద్దరూ మేడ చివరకు వెళ్లారు. సవారు బండి పరుగెత్తుకు వస్తోంది. ఆ బండివచ్చి వాళ్లకు తిన్నగావున్న మేడముందు ఆగింది. బండిలోంచి ఒక యువకుడు దిగాడు. దిగగానే అతను ఒకసారి మేడ మీది వాళ్ళకేసి చూసి లోనికి వెళ్లిపోయాడు.

నీలవేణి తన గదిలోకి వెళ్లి జడ వేసుకోవడం ప్రారంభించింది. రంగమ్మ కిందకు వెళ్లిపోయింది. స్నానం చేసి వచ్చి బట్టలు కట్టుకుంటూ పరధ్యాన్యంగా ఎదర మేడకేసి చూసింది నీలవేణి. ఎప్పుడూ మూసివుండే ఆ మేడమీది గది తలుపులు తెరిచి వున్నవి. కిటికీలోంచి ఆ యువకుడు తనవైపే చూస్తూ వుండడం ఆమె కనిపెట్టింది. చప్పున ఆమె తన పొరబాటు తెలుసుకొని కిటికీ తలుపులు వేసి బట్టలు కట్టుకొంది. ఆమెకు ఆ యువకుని మీద చాలా కోపం వచ్చింది. “పల్లెటూరి పశువులా గున్నాడు. మర్యాద తెలియదు.” అనుకొంది. తిరిగి కిటికీ తలుపులు తెరిచి ఒక కుర్చీలో కూర్చుని పుస్తకం చదవడానికి ఉపక్రమించింది. ఎదుటి మేడమీది నుంచి పెద్ద కేకలు నవ్వులు వినిపిస్తున్నాయి. ఆమె చిరాకుగా అటు చూసింది. అయిదారుగురు యువకులు ఆ మేడమీది గదిలో పేకాడు తున్నారు. ఆ యువకుడు ఆటలోంచి మధ్య మధ్య తన గదివైపు చూస్తున్నాడు. ఆమె కోపంతో పుస్తకం మూసి మంచం మీదకు విసరి లేచింది. అక్కడకు అప్పుడే వచ్చిన రంగమ్మనుచూచి “ఏమిటి ఆగోలంతా?” అని అడిగింది.

“వెంకట్రావు వచ్చినప్పుడు ఆ మేడ మీద హడావిడిగా వుంటుంది. పట్నంలో చదువు కుంటున్నాడు. అతను యీవూరు వచ్చేదని తెలిసేసరికి స్నేహితులంతా దిగుతారు” అంది రంగమ్మ.

మధ్యాహ్నం భోజనంచేసి తాంబూలం వేసుకొని నీలవేణి తనగదిలోకి వచ్చేసరికి ఎదుటి కిటికీలో వెంకట్రావు ప్రత్యక్ష మయ్యాడు. అతనిని గురించి తను తలుపులు మూసుకొని దాక్కోవడం తనకే అవమానం అనిపించింది. అతని వైపు కోపంగా చూసింది. మనిషి నల్లగా పొడుగ్గా బలంగా వున్నాడు. అతను ఆమెకేసి చూచి చిరునవ్వు నవ్వాడు. అతని తెల్లని పళ్లు ఎత్తుగా వికృతంగా కనిపించినై. “పశువు! తన అందంచూచి స్త్రీలు మూర్ఛ పోతారను కుంటున్నాడు గావును. తగిన పాఠం చెప్పాలి” అనుకుంది నీలవేణి, అతని వైపు ఓరగా చూస్తూ నెమ్మదిగా నవ్వింది. ఈ అస్త్రం అతనిపై బాగా పని చేసింది. రమ్మని సైగ చేశాడు. ఆమె తిరిగి నవ్వింది. ఈ విధంగా కొన్ని రోజులు గడచినవి. ఆమె అతనిని రోజు రోజుకూ రెచ్చగొట్టడం ప్రారంభించింది. ఆమె రోజూ అతనివైపు చూసి నవ్వేది. సైగలు చేసేది. అతను ఆగదిలో విరహబాధపడేవాడు. రకరకాల సైగలు చేసేవాడు. అతని అవస్థచూసే కొద్దీ ఆమెకు సంతోషం కలుగుతూ వుండేది. చివరకు

ఆమెకిది చక్కని 'ఎంటర్ టైన్ మెంటు'గా పరిణమించింది.

ఒకనాటి సాయంకాలం చీకట్లు నెమ్మదిగా అవరిస్తున్నై. నీలవేణి ఉత్సాహంగా స్నానంచేసి నెమ్మదిగా పాడుకుంటూ స్నానాల గదిలోంచి బయటకు వచ్చేసరికి జామిచెట్టు కింద పొడవైన ఒక నల్లటి రూపం కనిపించింది. ఆ రూపం నెమ్మదిగా తన వైపు వస్తోంది. భయం వేసింది.

"ఇంకా ఎంతకాలం ఏడిపిస్తావ్? రా! ఇది మంచి అవకాశం!" వెంకట్రావు తన్ను సమీపిస్తున్నాడు. అర్థ నగ్నంగా వున్న తన శరీరాన్ని చీరతో కప్పుకొని ఆతృతగా "వెళ్లిపో ఇది సమయం కాదు. ఎవరైనా వస్తారు" అంది.

"ఇది మంచి సమయం. ఇంట్లో ఎవరూ లేరు. అందరూ పురాణం వినడానికి వెళ్లారు."

"రంగమ్మ యింట్లోనే వుంది. చూస్తుంది. వెళ్లిపో!"

"ఫరవాలేదు. ఆమె ఎవరితోనూ చెప్పదు. రా! ఎందుకు వృధాగా కాలాన్ని పాడు చేస్తావు?" అతను ఉద్రేకంతో ఆమె మీదికి వస్తున్నాడు. "నీకోసం ఎంత కాలంనుంచి వేచి వున్నానో! యింత మంచి అవకాశం యిక దొరకదు. నేను ఎందరో అందమైన స్త్రీలను చూశాను. కాని నీలో వున్న ఆకర్షణ నాకు ఏ స్త్రీలోనూ కనిపించలేదు. ఏదీ ఒక్కసారి..." అతను ఆమె మీదికి వస్తున్నాడు.

"ఆగు! మర్యాదగా వెళ్ళిపో! నీ జిత్తులు నాదగ్గర ప్రయోగించకు. నేను పల్లెటూరి అమాయికపు పిల్లను కాను నీకు లోబడడానికి. నీ కోతి మొహానికి ప్రణయం ఒకటి. వెళతావా లేదా?"

ఉరుము ఉరిమి వెలిసినట్లయింది.

"అయితే నాకెందుకు ఆశకలిగించావు?"

"నీకు బుద్ధి చెప్పడానికి. రేపటినుంచి ఏ స్త్రీ జోలికీ పోకు. ఇక మర్యాదగా యిక్కడినుంచి కదులుతావా? అందరినీ పిలిచి పాఠం చెప్పించమంటావా!" అతను నీలవేణివైపు ఒకసారి ఆపాదమస్తకం చూసి ఇంట్లోంచి వేగంగా రోడ్డు యెక్కాడు.

నీలవేణి తన గదిలోకి వెళ్ళి "ఆడదాన్ని చెరచడానికి మగవాడు ఎంత సాహసం చూపిస్తాడు" అనుకొంది. తనేదో అగ్నిపరీక్షనుండి తప్పుకున్నట్లు ఆమెకు తోచింది.

* * * * *

సంధ్యాసమయం. నీలవేణి కిటికీలోంచి బయటకు చూస్తూ ఆలోచిస్తోంది. పడమటి దిశను మామిడితోటకు పైని ఆకాశం బంగారు వర్ణంతో మెరుస్తోంది. పక్షులు బారులు బారులుగా ఆకాశ వీధిలో ప్రయాణం చేస్తున్నవి. మామిడి చెట్టు చిగుళ్ళలో దాక్కొని ఒక కోకిల కూస్తోంది. ప్రశాంతంగా ఉంది వాతావరణం. ఆమె పల్లెటూరి వాతావరణంలో యిప్పుడిప్పుడే సౌందర్యాన్ని చూడగలుగుతోంది. ఆమె వినీల కుంతలాలు పిల్లగాలికి ఎగిరి ముఖం మీదికి వస్తున్నై! వారంరోజుల నుంచి ఆమెకు ఒక విచిత్రమైన అనుమానం కలుగుతోంది. ఆ అనుమానం తీర్చుకోవాలనుకుంది. నెమ్మ

దిగా మేడదిగింది. ఆడవాళ్ళంతా పురాణానికి వెళ్ళారు. ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది. చప్పుడు కాకుండా నడుస్తూ రంగమ్మ గది దగ్గరకు వెళ్ళింది. గది తలుపులు మూసివున్నై! గదిలో మనుషుల అలికిడి వినిపిస్తోంది. ఆమె బల్లయెక్కి కిటికీలోంచి చూసేసరికి ఒకచిత్రమైన దృశ్యం కనిపించింది. రంగమ్మ వెంకట్రావు కౌగిలిలో చిక్కుకొనివుంది. వెంకట్రావు ఆమె ఎర్రని పెదవులపై ముద్దులవర్షం కురిపిస్తున్నాడు. వెంటనే నీలవేణి బల్లదిగి మేడమీదకు వెళ్ళిపోయింది. ఆమె మనస్సు రకరకాల ఆలోచనలతో కదిలిపోసాగింది.

రాత్రి భోజనంచేసి తాంబూలం వేసుకొని కూర్చుంది. ఆమెకు ఆ దృశ్యం యింకా కంట్లో మెదులుతున్నట్లే కనిపిస్తోంది. రంగమ్మను వెంకట్రావు యెలా లోబరుచుకున్నాడు? పాపం! రంగమ్మకు ఇంకా పధ్నాలుగేళ్ళయినా వెళ్ళనవో! లేదో! అటువంటిది మోసపోవడం ఎంత సులువు? అందులోనూ రంగమ్మ పెళ్ళికాని పిల్లకాదు. చిన్నప్పుడే పెళ్ళిచేస్తే పిల్లదృష్టి కేవలం భర్తమీదే కేంద్రీకృత మౌతుందని పల్లెటూరి వాళ్ళ విశ్వాసం. "వేయి పడగలు" నవలలో కూడా తను యిటువంటి సిద్ధాంతాన్నే చదివింది. వాస్తవిక జగత్తులోకి వచ్చేసరికి తనకుఇప్పుడిప్పుడే ఈసిద్ధాంతపు నిజస్వరూపం బోధపడుతోంది. ధర్మశాస్త్రాలలో — మొదటినుంచి చివరవరకూ ఆడదానికే నిబంధనలన్నీ. మగవాడు ఎన్ని చేతులుమార్చినా యిబ్బంది లేదు. పైగా సమాజపు దృష్టిలో సరసుడు అవుతాడు. అదే ఆడదైతే కులట అవుతుంది. ఏమిటో యీ కుటిలనీతి. రంగమ్మ భర్త ఎవరో! బాగా చదువుకున్నవాడట. వీళ్ళ మాటల్నిబట్టి చూస్తే చాలా విజ్ఞానంవున్న మనిషేమోనని పిస్తోంది. యీ మధ్యనే వస్తాడట. అతినినికూడా ఒక ఆటఆడించాలి. అప్పటికి ఈ నాటికలో నాల్గవపాత్ర కూడా పూర్తిఅవుతుంది. ఇంతలో ఆమెకు మనిషిఅలికిడి వినిపించింది. ఆమె ఆలోచనలు అక్కడకు ఆగినై!

"ఎవరు?"

"నేను వదినా!"

"ఒకసారి యిలారా రంగమ్మా! నీకోసమే చూస్తున్నాను." రంగమ్మ ఆమెదగ్గరకువచ్చి "ఎందుకు వదినా?" అంది.

"కూర్చో! భోజనం చేశావా?"

"ఊఁ"

నీలవేణి రంగమ్మను మంచంమీద కూర్చుండబెట్టి తనుకూడా ప్రక్కనే కూర్చుంది. "రంగమ్మా! నిన్నొ ఒక మాట అడుగుతాను. నిజం చెబుతావా?" అంది.

"ఏమిటో అడుగు వదినా!" అంది రంగమ్మ అమాయకంగా.

"నీకూ వెంకట్రావుకూ ఎంత కాలం నుంచి సంబంధం వుంది?"

ఈ ప్రశ్నకు రంగమ్మ చాలా కలవరపడింది. బిత్తరపోయి నీలవేణివైపు చూడసాగింది.

"నాకు అంతా తెలుసును రంగమ్మా! నువ్వేమీ భయపడవద్దు. నిజం చెప్పు! నే నెవరితోనూ చెప్పనులే!"

రంగమ్మ రెండు చేతులలోనూ ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

"ఎందుకు ఏడుస్తావ్ రంగమ్మా! నే నెవరితోనూ చెప్పను. భయం లేదు. అది నా దృష్టిలో గొప్ప అపరాధం కాదు" నీలవేణి ఆమె కన్నీళ్ళు తుడిచి తన వొడిలోకి తీసుకొంది. "నేను నీ అక్కను అనుకో! నాతో చెప్పవ్?" ఆమెను బుజ్జగించింది.

"నీకు పెళ్ళయి ఎంత కాలం అయింది రంగమ్మా?"

"రెండేళ్ళయింది" అంది గద్గద స్వరంతో.

"పెళ్ళి అయిన తరవాతేనా నీవు వెంకట్రావుతో సంబంధం పెట్టుకున్నది?"

ఆమె అవునన్నట్లు తల వూపింది.

"వారం రోజుల క్రితం నేను స్నానాల గదిలో స్నానం చేస్తున్నప్పుడు వెంకట్రావును తీసుకొచ్చి జామిచెట్టు క్రింద నిలబెట్టింది నువ్వేకదూ?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది నీలవేణి.

ఆమె ఈ ప్రశ్నకు తిరిగి వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

"ఏడవకు రంగమ్మా! పాపం! నువ్వేం చేస్తావు? వాడి బలవంతంవల్ల నువ్విలా చేశావు. అంతేకాని నీకు యిది స్వతహాగా పుట్టినబుద్ధి కాదన్న సంగతి నాకు తెలుసు." — చాలా రాత్రిఅయింది. వెళ్ళిపడుకో రంగమ్మా! నే నెవరితోనైనా చెప్తానని భయపడకు. వెళ్ళి హాయిగా పడుకో!" ఆమెనుబుజ్జగించి కిందకుపంపింది నీలవేణి.

ఒకసారి ఎదుటిమేడకేసి చూసింది. వెంకట్రావు చదువుతూ కూర్చున్నాడు. ఆ దీపపువెలుగులో నీలవేణికి అతని మొహంలో పూర్వపు విరహలక్షణా లేమీ కనిపించలేదు. అప్పుడే గడియారం పదకొండుగంటలు కొట్టింది. వీధిఅంతా నిశ్శబ్దంగావుంది. నీలవేణి మేడచివరకు వెళ్ళి వీధివైపుచూస్తూ నుంచుంది. ఒక స్త్రీ నెమ్మదిగా ఆ మసకచీకటిలో ఎదుటి మేడలోకి వెళ్ళడం కనిపెట్టింది. వెంటనే నీలవేణి స్తంభంచాటున దాక్కొని వెంకట్రావు గదివైపుచూడ్డం ప్రారంభించింది. ఆ స్త్రీ అతని గదిలోకి వచ్చింది. దీపపు కాంతి ఆమె ముఖంమీదపడింది. ఆమె రంగమ్మ!

* * *

నీలవేణి నిద్రనుండి లేచేసరికి గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ తాగుతూ ఆలోచిస్తోంది. తను అప్పుడే ఈవూరు వచ్చి రెండు నెలలు కావస్తోంది. తనకేమీ తోచడంలేదు. వేగంగా తను తిరిగి పట్నం వెళ్ళిపోయే ఉపాయం ఏమైనా ఆలోచించాలి. తనభర్త మంచివాడయినా అతని వల్ల తన కోరికలేమీ తీరలేదు. మనస్సును వంచించుకొని యిక్కడవుండి బాధపడే కంటే తిరిగి పట్నం పోవడమే మంచిది. కాగితం కలం తీసి తల్లికి ఉత్తరం రాయడం ప్రారంభించింది. ఇంతలో పనిమనిషివచ్చి పెద్దచప్పుడుచేస్తూ ఇల్లు తుడవడం ప్రారంభించింది. ఉత్తరం కవరులో పెడుతూ పనిమనిషిని అడిగింది. "ఏమిటే! ఇల్లంతా చాలా హడావిడిగా వుంది?"

"ఇవాళ బాబుగారు పట్నంనుంచి వస్తారమ్మా! మీకు తెలియదా!" అంది తుడుస్తూ.

"ఓహో! అలాగా! అయితే రంగమ్మను ఒకసారి ఇక్కడకురమ్మనిచెప్పు!"

పని మనిషి కిందకు వెళ్ళిపోయింది. నీలవేణి అద్దం ముందు నుంచుని తన రూపాన్ని ఒకసారి చూసుకుంది. ముఖంలో మునుపటికీ యిప్పటికీ తేడా వుంది. ముగ్ధలక్షణాలు చాలావరకకు పోయి వాటిస్థానే ప్రౌఢలక్షణాలు కనిపిస్తున్నవి. ఇంకా పరిశీలనగా చూసే సమయంలో ఆ అద్దంలో రంగమ్మ ముఖం కూడా కనిపించింది. ఆమె వెనుకకు తిరిగి "రా! రంగమ్మా! కూర్చో! ఇంకా ఏమీ ముస్తాబు అవ్వలేదేం? త్వరగా మంచి బట్టలు వేసుకో! పల్లెటూరి పిల్లలా జడ అలా బిగువుగా వేసుకుంటావేం? వదులుగా వేసుకోవాలి! ఏదీ యివ్వేళ నీకు జడ నేనే వేస్తాను." నీలవేణి ఆమెకు జడ వెయ్యడం ప్రారంభించింది. జడ వేస్తూ ఆమె ముఖంలోకి చూసింది. ఆమె ముఖంలో ఏదో సిగ్గూ భయం కనిపిస్తున్నవి. యింతలో వీధిలో ఎడ్లబండి చప్పుడు వినిపించింది. యిద్దరూ లేచి మేడ చివరకు వెళ్ళి చూసే సరికి యింటి ముందు బండి ఆగడం బండిలోని మనిషి యింట్లోకి వెళ్ళిపోవడం కూడా జరిగింది. నీలవేణి రంగమ్మను తీసుకొని మేడ దిగే సరికి సన్నగా తెల్లగా వున్న ఒక యువకుడు వసారాలో నుంచుని వున్నాడు. అతనిని చూడగానే నీలవేణికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయ్యింది. అతను ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ, "నీలవేణీ! నువ్వేనా?" అన్నాడు. రంగమ్మను అక్కడ విడిచిపెట్టి నీలవేణి చకచకా మేడ మీదకి వెళ్ళిపోయింది. కుర్చీలో కూర్చుంది. ఆమె గుండె ఇంకా వేగంగా కొట్టుకుంటూనే వుంది. రెండేళ్ళ క్రితం తను సరిగా రంగమ్మ వయస్సులో వున్నప్పుడు తొలిసారిగా విశ్వేశ్వరరావు తన హృదయంలో ప్రవేశించాడు. తనలో కోరికల్ని రేకెత్తించి ఆకస్మికంగా ఆనాడు మాయమైన విస్సు ఈనాడు తిరిగి హఠాత్తుగా ప్రత్యక్షమయాడు. రంగమ్మ భర్త ఎవరో అనుకుంటోంది తను. చివరకు కథ తారుమారయింది. యిలా జరగడం కూడా ఒకందుకు మంచిదే. యిప్పుడు అతనికి తగిన పాఠం చెప్పాలి. అతని నుంచి తన తప్పుకోవడం తన పిరికితనాన్ని ప్రదర్శించడమే అవుతుంది. ఆమె గుండె దిటవు పరచుకొంది. ఒక నిశ్చయానికి వచ్చింది.

ఆనాటి సాయంత్రం రంగమ్మను మేడ మీదకు పిలిచింది. "ఈ పుస్తకం చదువుతూ కూర్చో! నేను వచ్చేవరకూ వెళ్ళిపోకు యిప్పుడే వస్తాను!" రంగమ్మ చేతికి పుస్తకం యిస్తూ అంది నీలవేణి. రంగమ్మ ఆమెవైపు ఆశ్చర్యంగా చూసింది. ఏదో అడుగుదామనుకొంది. కాని అడగలేక పోయింది. నీలవేణి ఆమెవైపుమందహాసంచేసి మేడదిగింది. చప్పుడు కాకుండానడిచి గదిముందు ఆగింది. విస్సు ఏదో పత్రిక చదువుకుంటున్నాడు. నీలవేణి గదిలో అడుగు పెట్టింది. యింకా అతను ఆమెను చూడలేదు.

"చదువులో లీనమైపోయినట్లున్నారే!"

ఈ మాటలకు అతను ఉలిక్కి పడి పక్కకు చూశాడు.

"వేణీ! ఎంత మారిపోయావ్! మునుపటికంటే ఎంత అందంగా కనిపిస్తున్నావ్" ఆమెను ఆపాదమస్తకం చూస్తూ అన్నాడు.

"నేను మునుపటికంటే విశేషంగా ఏమీ మారలేదు. నీలోని విరహం అలా అనిపిస్తోంది. నీకే కాదు ప్రతి మగవాడికీ పరాయి స్త్రీ అందంగానే కనిపిస్తుంది."

"ఓహో! సైకాలజీ ఏమైనా చదువుతున్నావా? మనస్తత్వాలను వివరిస్తున్నావ్!"

"మనుషుల మనస్తత్వాలు ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తున్నప్పుడు పుస్తకాలు చదవడం అనవసరం!"

"బాగా మాట్లాడుతున్నావే? యిదివరకు మాట్లాడ్డానికే జడిసేదానవు. సెక్సు పుస్తకాలు కూడా చదువుతున్నావా?"

"అన్నిరకాల పుస్తకాలు చదువుతున్నాను. అంతకంటే నాకు కాలక్షేపం ఏముంది? పుస్తకాలు చదివి మనస్సు పాడుచేసుకునే మానసిక దౌర్బల్యం నాకులేదు."

"అంటే యింకా ఈవూళ్లో ప్రియుణ్ణి ఒకడినీ సంపాదించలేదన్నమాట?"

"ప్రియులను సంపాదించే శక్తిగల స్త్రీ ఎప్పుడూ సంపాదిస్తూనేవుంటుంది"

"ఆ అదృష్టవంతుణ్ణి నేను తెలుసుకోవచ్చునా?

"ఎదుటింటిలోని వెంకట్రావు" నీలవేణి గంభీరంగా అతని ముఖంలోకి చూస్తూ సమాధానం చెప్పింది. ఈ సమాధానానికి అతను నవ్వి "అటువంటి కురూపితో ఏ స్త్రీ సంబంధం పెట్టుకుందన్నా నేను నమ్మను. అందులోనూ నీలాంటి అందమైన స్త్రీ అంటే అసలు నమ్మను."

"అక్కడే నువ్వు పొరబాటుపడుతున్నావు. స్త్రీకి సరైనవిజ్ఞానం యివ్వకుండా మగవాడు కట్టుదిట్టాలు చేస్తే ఆమె కేవలం పశువాంఛనే ప్రదర్శిస్తుంది. ఆమెలోని సౌందర్యారాధనే నశిస్తుంది. మంచి చెడ్డల విచక్షణాశక్తికూడా లేకుండా పోతుంది."

"అబ్బ! ఏమిటి నాకు ఊపిరిసలుపకుండా మాట్లాడేస్తున్నావ్! యిదివరకు నేనేమిచెప్పినా జాగ్రత్తగా వినేదానవు. రెండేళ్లు గడిచిపోగానే తిరిగి నాకు పాఠం చెప్పేటట్టు తయారయ్యావ్ — సరే కాని వేణీ! నువ్వు రెండవ పెళ్ళివాణ్ణి ఎలా పెళ్ళి చేసుకున్నావ్?"

"పతనమైన స్త్రీని రెండవ పెళ్ళివాళ్లు కాక ఎవరు చేసుకుంటారు?"

"నీవు నిజంగా చెడిపోయావా వేణీ?"

"నీలాంటి స్వార్థపరుల దృష్టిలో!"

"ఎంత నిశితంగా మాట్లాడుతున్నావ్ వేణీ! నీ పతనానికి నేనే కారణం అంటావా? నేను నిన్నే పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ మావాళ్లు..."

నీలవేణి మాట మధ్యలోనే అందుకొని "అవును! మీవాళ్లు పడనివ్వలేదు! అదేనా నువ్వు చెప్పేది? మీవాళ్లకు ఎదురు చెప్పడానికి సాహసించలేనివాడవు ఒక స్త్రీతో ప్రణయానికి ఎందుకు సాహసించావు? ఆమె జీవితాన్ని ఎందుకు ధ్వంసం చేశావు?— నువ్వే కాదు విస్నూ

నీలాంటి అసమర్థులు లోకంలో యింకా ఎందరో వున్నారు. ఆడది చేతికి అందే వరకూ ఆమెను ఆకాశానికి ఎత్తుతారు. తీరా లొంగిన తరవాత అంత సాహసం గల స్త్రీ తిరిగి తననెక్కడ మోసగిస్తుందోనని జడిసి తనే ఆమెను మోసగిస్తాడు. తన నీడ చూసి తనే జడుస్తాడు."

విస్సు ఈ మాటలకు ఆమెవైపు దీనంగా చూస్తూ "నేను చాలా అపరాధం చేశాను వేణీ" అన్నాడు. అతని మాటలలో ఏదో బాధ కనిపిస్తోంది.

"రంగమ్మ అందంగా వుండగా నేను అందంగా వున్నానా?"

విస్సు ఆమె ముఖంలోకి చూశాడు. ఆమెలో దైన్యం కనిపిస్తోంది. ఆమె ఎర్రటి పెదవులు గంభీరతను సూచిస్తున్నై. దీర్ఘమైన జడ బిగువైన వక్షం అతనిని ఉన్మత్తుణ్ని చేసినై. ఆమె భుజాలను తన రెండు చేతులతో పట్టుకొని "రంగమ్మ కంటె ఎన్నోరెట్లు అందంగా వున్నావ్ వేణీ!" అన్నాడు ఆవేశంతో.

"అయితే నువ్వు నన్ను విడిచిపెట్టి రంగమ్మనే ఎందుకు పెళ్ళి చేసుకున్నావ్? పల్లెటూరి పిల్ల పవిత్రంగా వుంటుందనే కాదూ?"

"అబ్బ ఇక నీ మాటలతో నన్ను బాధ పెట్టకు వేణీ! నీకోసం నన్ను ఏం త్యాగం చెయ్యమన్నా చేస్తాను. ఇప్పటికి నా అపరాధం తెలుసుకున్నాను. నన్ను క్షమించవ్ వేణీ?" విస్సు ఆమెను దగ్గరగా తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు. ఆమె అతనిని వారించలేక పోయింది.

"పరిస్థితులు మన చేతినుండి దాటిపోయినై. నీ అపరాధానికి నేను శిక్ష అనుభవిస్తున్నాను. రేపు ఉదయం నేను పట్నం వెళ్ళిపోతున్నాను. నీముందు నేను పవిత్రంగా వుండలేను. హృదయాన్ని వంచించుకోవడం నాకు చేత కాదు. ఇక్కడ కూడా కళంకం తెచ్చుకోవడం నాకు ఇష్టంలేదు. కనక రేపే నేను ఈవూరు విడిచిపెట్టడానికి ఏర్పాటులు చేసుకున్నాను."

"వేణీ! ఇవ్వేళ నువ్వు నా కంటికి దేవతలా కనిపిస్తున్నావ్! ఇవాళ నా కంటికి కనిపించిన నీలవేణిని నా జీవితంలో మరిచిపోలేను. నీతోనే నేను కూడా పట్నం వస్తాను."

"అయితే రంగమ్మ జీవితం కూడా నాశనం చెయ్యదలుచుకున్నావా?

"లేదు వేణీ! యేమైనా ఇక నేను నిన్ను చేతులారా విడిచిపెట్టలేను" ఆమెను ఉద్రేకంతో దగ్గరకు లాక్కొని ఆమె ఎర్రటి పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు.

మరునాటి ఉదయం నీలవేణి పట్నం వెళ్ళిపోయింది. నీలవేణి వెళ్ళిన రెండవ రోజున విస్సుకూడా పట్నం ప్రయాణమయ్యాడు.

★

Edited and Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Office, Tenali, and Printed by him at Jyothi Press, Tenali.




చిత్రియా రిలీజ్ : అన్ని కేంద్రాలలో దిగ్విజయంగా నడుస్తూంది.

Cover Printed by JYOTHI PRESS Tanali